



# ప్రజా విముక్తి

విషయ సూచిక


1. ప్లీనం రిపోర్టు
2. ఆర్టీసీ సమ్మె
3. ఎన్ఆర్సీ
4. దిశ
5. జేఎన్యూ
6. సిద్ధాంత వ్యాసం
7. అమరుల చరిత్రలు
8. పోరాట వార్తలు
9. డాక్టర్ సలహా
10. కా. రామన్న జీవితం



భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార పత్రిక

సంపుటి:1 సంచిక:1 జనవరి-ఎప్రిల్, 2020


## ఆపరేషన్ గ్రీన్‌హంట్ "సమాధాన్ " బహుముఖ దాడి మధ్యనే విజయవంతమైన తెలంగాణ రాష్ట్ర రెండవ ప్లీనం

తెలంగాణ రాష్ట్ర రెండవ ప్లీనం 2019 డిసెంబర్‌లో తీవ్ర శత్రు నిర్భంధంలో ఎలాంటి అటంకాలు లేకుండా విజయవంతంగా జరుపుకున్నాం. పిఒఆర్‌ను ప్లీనం ప్రతినిధుల వరకు తీసుకెళ్ళి అవగాహన కల్పించి ప్లీనాన్ని జరుపుకోవడం వలన బలం, బలహీనతలపై ఒక స్పష్టత వచ్చింది.



మొత్తం ప్లీనం ఐదు రోజులు కొనసాగింది. మొదట బొట్టెం అమరుల కమ్యూన్ నుండి ఊరేగింపుగా విప్లవ గీతాలను ఆలపిస్తూ, అమరులకు పేరు పేరున జోహార్లు అర్పిస్తూ నినాదాలు ఇచ్చారు. అమరుల ఆశయ సాధనకై తుదికంటా పోరాడుతామనీ, నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి, సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి, భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు వర్ధిల్లాలంటూ ఇంకా రకరకాల నినాదాలతో కల్లెడ అమరుల మిలిటరీ గ్రౌండ్ నుండి ముందుకు సాగుతూ కాటెపెల్లి అమరుల ముఖద్వారం నుండి, మొద్దుగుట్ట అమరుల కిచన్ మీదుగా కా|| జిలానీ, కా|| సులోచన మొదటి సెంట్రీ పోస్టు నుండి, కా|| కోటీ, కా|| సురేష్‌ల రెండవ సెంట్రీ పోస్టు వరకు, ఇక్కడి నుండి కసనూర్ అమరుల మూడవ సెంట్రీ పోస్ట్ మీదుగా రామగూడ అమరుల నాల్గవ సెంట్రీ పోస్ట్ ఇక్కడ నుండి కా|| లచ్చి ఐదవ సెంట్రీ పోస్టు వరకు అక్కడి నుండి కా|| శంబూ, కా|| జవ్వాజి లక్ష్మినారాయణల 6వ సెంట్రీ పోస్టు నుండి బుర్కపాల్ అమరుల 1వ పీఎల్ మీదుగా, కా|| అరుణ్ (కూర్నపల్లి) రెండవ పీఎల్ నుండి, కా|| విజ్జె 3వ పీఎల్ నుండి కా|| నగేష్ 4వ పీఎల్ వరకు కా|| మద్దిలేటి, కా|| బాతాల రాజు, కా|| కాశపోగుల ప్రభాకర్‌ల 5వ పీఎల్ నుండి కా|| ప్రభాకర్, కా|| నవతల ప్రెస్ మీదుగా అమరుల ఫొటో ప్రదర్శనశాల నుండి ఊరేగింపుగా జెండా వద్దకు చేరుకున్నారు. టి.ఎస్.సి.కార్యదర్శి జెండా ఆవిష్కరణ చేయడంతో ప్లీనం ఆరంభమైంది. ప్లీనం యొక్క ఆవశ్యకత గురించి కార్యదర్శి ప్రసంగించాడు. ఆ తర్వాత కా|| వర్గేష్ స్తూపావిష్కరణ చేస్తూ అమర వీరులను స్మరించుకుంటూ ప్రసంగించిన అనంతరం అమర వీరులకు రెండు


తెలంగాణ రాష్ట్ర రెండవప్లీనం
భారతకమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

నిమిషాలు మౌనం పాటించి అమరుల ఆశయాన్ని తుదిశ్వాస వరకు కొనసాగిస్తామని శపథం చేశారు.

జెండా, స్థూపావిష్కరణల తర్వాత పూజారి కాంకేర్ అమరుల ప్లీనం హాల్‌కు చేరుకున్నారు. ఊరేగింపు ముగిసిన తర్వాత ప్రతినిధులు ప్లీనం హాలులోకి ప్రవేశించారు. ప్లీనానికి ప్రతినిధులు ... మంది హాజరైనారు. పరిశీలకులుగా డి.కె. నుండి ఒకరు, సి.ఆర్.బి. స్టాఫ్ నుండి ఒకరు సీఆర్‌సీ-2 కంపనీ నుండి ముగ్గురు మొత్తం పరిశీలకులు ఐదుగురు హాజరైనారు. కేంద్ర కమిటీ నుండి ఇద్దరు హాజరైనారు. మొత్తం ప్లీనంలో ...మంది పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు కా॥ డీఎమ్ ప్రతినిధులను పరిచయం చేస్తూ ఆహ్వానించగా కార్యదర్శి బ్యాడ్జీలను ప్రధానం చేశారు.

ప్లీనం నిర్వహణ కోసం ముగ్గురితో కూడిన అధ్యక్షవర్గాన్ని ప్లీనం ఎన్నుకొంది. స్టీరింగ్ కమిటీగా రాష్ట్ర కమిటీ వుంది. అధ్యక్షవర్గం ప్లీనం యొక్క విధి విధానాలను, ఎజెండాను ప్రకటించారు. ప్రారంభ ఉపన్యాసం ఇవ్వాల్సిందిగా కేంద్ర కమిటీ సభ్యున్ని ఆహ్వానించారు. తన ప్రారంభోపన్యాసంలో అంతర్జాతీయ, దేశీయ, రాష్ట్ర పరిస్థితులను వివరించాడు. నేడు సామ్రాజ్యవాదులు వారి దళారీలు సుదీర్ఘ కాలంగా తీవ్ర ఆర్థిక, ద్రవ్య సంక్షోభంలో పీకల్లోతు కూరకపోయింది. ఎడ తెగకుండా సాగుతున్న ఈ మాంద్యం నుండి బయట పడే పరిస్థితులు కనబడడం లేదు. అభిజిత్ బెనర్జీ లాంటి వాళ్ళకు నోబెల్ బహుమతులు ప్రకటించి వారి ద్వారా ప్రజల చేతిలోకి నేరుగా డబ్బులు వెళ్ళే పథకాలు, పరిష్కారాలు వెతుకుతున్నారు. ప్రపంచ మార్కెట్‌ను పునర్విభజించు కోవడానికి దురాక్రమణ యుద్ధాలు కొనసాగిస్తున్నారు. ప్రకృతి వనరులు కొల్లగొట్టడానికి వ్యాపార, సైనిక రంగాలలో సామ్రాజ్యవాదుల మధ్య తీవ్ర వైరుధ్యం ముదురుతున్నది. బ్రెగ్జిట్ పరిణామాలు బ్రిటీష్ పాలక వర్గాల మధ్య వైరుధ్యాల తీవ్రతను ప్రతిబింబిస్తున్నాయి. అమెరికా ఆర్థిక రంగంలో ముందుకు తెస్తున్న రక్షణ విధానాలను మిగతా సామ్రాజ్యవాద దేశాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అమెరికా చైనాల మధ్య వ్యాపార యుద్ధం అత్యంత తీవ్రంగా కొనసాగుతున్నది. హిందూ పసిఫిక్ ప్రాంతాలు సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు కేంద్రంగా వున్నాయి. అవి ఏమాత్రం సంక్షోభం నుండి బయట పడేయలేవు. ఈ సంక్షోభ భారాన్ని ప్రజలపై మోపి ప్రజల బ్రతుకులను దుర్భరం చేస్తున్నారు. సామ్రాజ్యవాదుల దోపిడి విధానాల ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరుగుతున్నాయి. అన్ని ప్రభుత్వాలు ప్రజా ప్రజాసంక్షేమ పథకాలలో కోతలు విధిస్తున్నాయి. కార్మికుల, మధ్యతరగతి ప్రజల నిజవేతనాలు పడిపోతున్నాయి. నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరుకున్నది. ఫలితంగా ప్రజల నుండి తీవ్రమైన నిరసనోద్యమాలు, ప్రతిఘటన పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. జాతుల స్వయం నిర్ణయాధికారం కోసం కుర్దు ప్రజలు సాయుధ పోరాటం సాగిస్తున్నారు. పాలస్తీనా జాతి విముక్తి పోరాటం మిలిటెంట్‌గా కొనసాగుతూనే వుంది. అఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు సాయుధ పోరాటం రెండు దశాబ్దాలుగా కొనసాగిస్తూ అమెరికా సామ్రాజ్యవాదుల మెడలు వంచుతున్నది. లాటిన్ అమెరికా ఖండంలో ఈక్వెడార్, చిలీ, హైతీ, బొలీవియా, అర్జెంటీనా, కొలంబియా, మధ్య ఆసియాలో లెబనాన్, ఇరాక్, ఈజిప్టు, సౌదీ అరేబియా, ఐరోపాలో స్పెయిన్, చెక్‌రిపబ్లిక్, రష్యా, ఫ్రాన్స్, ఆఫ్రికా ఖండంలో అల్జీరియా, సుడాన్, ఆసియాలో కజకిస్తాన్, హాంకాంగ్, పాకిస్తాన్ తదితర దేశాలలో ప్రజా వెల్లువలు లేచాయి. నూతన ప్రజాస్వామిక విప్లవ పంథాకు అనుగుణంగా సాయుధ విప్లవోద్యమాలకు ఫిలిప్పైన్స్, భారతదేశం, టర్కీ, పెరూ తదితర దేశాలలో మావోయిస్టు పార్టీలు నేతృత్వం వహిస్తున్నాయి. ఇలాంటి ఉద్యమాలు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో విశాల గ్రామీణ ప్రాంతాలలో తమ సొంత ప్రజాయుద్ధాలను ప్రారంభించేలా ప్రజలను ఉత్సాహ పరుస్తున్నాయి.

ప్రపంచంలో మూడు ప్రముఖ వైరుధ్యాలు వున్నాయి. వీటిలో ప్రధాన వైరుధ్యం సామ్రాజ్యవాదులకు, పీడిత జాతులకు, పీడిత ప్రజలకు మధ్య వైరుధ్యం. ఈ విధంగా అంతర్జాతీయ పరిస్థితిని చెప్పుతూ దేశీయ పరిస్థితిని వివరించాడు. ఇప్పటికీ మనది అర్థ వలస, అర్థ భూస్వామ్య దేశమే. భూస్వామ్యానికి, పీడిత ప్రజలకు మధ్య వున్న వైరుధ్యమే ప్రధాన వైరుధ్యం అంటూ వర్గ యుద్ధాన్ని తీవ్రతరం చేయాల్సిన కర్తవ్యాన్ని బోధించాడు. అదే విధంగా రాష్ట్ర పరిస్థితిని, ప్రస్తుత పరిస్థితులను చెప్పుతూ మునిపెన్నటికన్నా విప్లవానికి అనుకూలంగా ఉన్నాయన్నారు. అయితే మన ఉద్యమం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. మనలో వున్న అన్ని రకాల బలహీనతల నుండి బయటపడాలి. మన పార్టీ బోల్షివీకరించబడాలి. ఇలాంటి నేపథ్యంలో మనం ప్లీనంను నిర్వహించుకుంటున్నాం. ప్లీనంలో సెట్‌బ్యాక్‌కు గురైయిన ఉద్యమంలో తిరిగి ఎట్లా ఒక వెల్లువను సృష్టిద్దాం, తిరిగి గెరిల్లా జోన్‌గా ఎలా ఎదిగించాలి, అనే విషయాలపై లోతుగా చర్చించాలి.

తెలంగాణలో వర్గ పోరాటంలో ప్రపంచీకరణ మూలంగా చాలా మార్పులు వచ్చాయి. లీగల్ పోరాటాలు ఎలా చేయాలి? ఇల్లీగల్ పోరాటాలు ఎలా చేయాలి? ఈ రెండింటిని ఎలా సమన్వయ పరచాలనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని, ఈ ప్లీనంలో చర్చించి సంపద్వంత చేయాలని పిలుపునిచ్చాడు.

అధ్యక్షవర్గం అమర వీరులకు జోహార్లు తెలుపుతూ చేసిన తీర్మానం, రాజకీయ ఖైదీలకు విప్లవ జేజేలు తెలుపుతూ తీర్మాణాలను ప్రవేశపెట్టింది. వీటిని కొద్ది చేర్పులతో ప్లీనం ఆమోదించింది. తదుపరి డి.కె.ఎస్.జెడ్.సి. నుండి పరిశీలకుడుగా హాజరైన కామ్రేడ్ డీకే సందేశాన్ని ప్లీనంకు వివరించాడు.

ఆ తర్వాత టి.ఎస్.సి. పి.ఒ.ఆర్.ను రాష్ట్ర కార్యదర్శి వివరించాడు. పార్టీ, సైన్యం, ఐక్యసంఘటన అనే మూడు భాగాల పి.ఒ.ఆర్.ను ప్రవేశపెట్టారు. కొన్ని చేర్పులు మార్పులతో పి.ఒ.ఆర్.ను ప్లీనం ఏకగ్రీవంగా ఆమోదించింది. తర్వాత తెలంగాణ ఉద్యమంలో 2001 నుండి కొనసాగుతున్న ఆటు పరిస్థితిని ప్లీనం ప్రతినిధులకు వివరించడం జర్గింది. ప్రజాసంఘాల బలం, బలహీతల గురించి కూడా ప్లీనం ప్రతినిధులకు రిపోర్టు చెప్పడం జర్గింది. ఆ తదుపరి అకౌంట్లను ప్రవేశపెట్టగా ఆమోదించారు. దుబారాను ప్లీనం ప్రతినిధులు

గుర్తించారు. తర్వాత ఆత్మ విమర్శ, విమర్శ సెషన్ కొనసాగింది. దీన్ని పూర్తి చేసుకున్న తర్వాత కొత్తగా కమిటీలోకి సభ్యులను తీసుకోవాలని ప్లీనంలో ప్యానల్‌ను ప్రవేశ పెట్టడంతో ఆమోదించారు. ఆ తర్వాత సెషన్‌లో ప్లీనంలో పాల్గొనడం ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడం జరిగిందని పరిశీలకులు మాట్లాడినారు.

చివరిగా రాష్ట్ర కార్యదర్శి ముగింపు వుపన్యాసం చేశాడు. ఈ ప్లీనం పి.ఒ.ఆర్.ను నాలుగు సంవత్సరాల పది నెలల కార్యచరణ మీద ఆధారపడి పి.ఒ.ఆర్.లో తీసుకున్న కర్తవ్యాల వెలుగులో ఉద్యమాన్ని ముందుకు తీసుకపోవాలి. బలహీన పడ్డ తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే కర్తవ్యంతో ప్రతి ప్రతినిధి కేంద్రీకరించి పని చేయాలని అన్నారు. గతం కంటే కూడా విస్తరణ పెరిగింది. ఆ జిల్లాలను కూడా ఆర్గనైజ్ చేయాలి. పార్ట్ టైమ్ పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజా సంఘాల కార్యకర్తలు ఉన్నారు. మనకు పరిస్థితి ఆశాజనకంగా వుంది. ఐక్యంగా పనిని కొనసాగిద్దాం. దృఢ సంకల్పంతో పనిని కొనసాగిద్దాం మొత్తం మారుతున్న రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేస్తూ, సరియైన నినాదాలతో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవాలి. ప్రతి చిన్న దాన్ని కూడా లోతుగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే ఉద్యమాన్ని ముందుకు తీసుకపోగల్గుతాం.

ఐక్యసంఘటనలో పదుల సంఖ్యలో నిర్మాణాలు చేశాము. ఐక్య సంఘటన నిర్మాణాలను పెంపొందించాము. ఏరియా, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్మాణాలు కూడా చేశాము. లీగల్, ఇల్లీగల్ సమస్యలు ఎదుర్కొంటున్నాము. దీన్ని సరిదిద్దుకోవాలి. అనేక రకాల కవర్ సంఘాలను నిర్మాణం చేయాలి. అప్పుడు మాత్రమే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను ఆర్గనైజ్ చేయగలం.

తెలంగాణలో భూమి, నిర్వాసిత సమస్య ప్రధానంగా వుంది. ముఖ్యంగా భూమి కేంద్రంగా పోరాటాలు కొనసాగించాలి. ఫీల్డ్‌కు పోయేటప్పుడు ఒకటికి రెండు సార్లు ఆలోచించి పనిని కొనసాగించాలి. మిలిటరీలో గతంలో అనేక చర్యలు చేసినప్పటికీ, ప్రస్తుతం బలహీన పడ్డాము. జాయింట్ టీసీఓసీలో పాల్గొని కొన్ని అనుభవాలు సంపాదించాము. స్వీయాత్మక శక్తులు తక్కువగా ఉన్నాయి. వాటిని పెంచుకోవాలి. అన్యవర్గ ధోరణులపై పోరాడాలని చెబుతూ తన ప్రసంగాన్ని ముగించాడు.

చివరి రోజున ప్లీనం 13 తీర్మానాలను ఆమోదించింది. అవి: 1.అమర వీరులకు విప్లవ జోహార్లు 2. జైలు కామ్రేడ్లకు జేజేలు. 3. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా. 4. భూపోరాటాలు. 5. 2019 డిసెంబర్ పార్లమెంట్ పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించండి. 6. నల్లమలలో యురేనియం త్రవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడండి. 7. కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370–35ఏ పునరుద్ధరించాలి. 8. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం. 9. హరితహారం–అటవీ భూములు, ఆదివాసులు, పీడిత ప్రజల గెంటివేత. 10. కార్మికరంగం (సంఘటిత, అసంఘటిత, సింగరేణి). 11. మహిళా సమస్యపై తీర్మాణం. 12. శతృవు బహుముఖ దాడి. 13. బాబ్రీమసీదు, రామజన్మభూమి సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా పోరాడండి.

ప్లీనం హాలులో, జెండా ముందు ఈ క్రింది నినాదాలు ఇవ్వడం జరిగింది. మిలిటెంట్ ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తూ ప్రజా పునాదిని అభివృద్ధి చేసుకుందాం. ప్రజలను సాయుధం చేస్తూ శతృవు బహుముఖ దాడిని ప్రతిఘటిస్తూ తెలంగాణలో గెరిల్లా జోన్‌ను నిర్మిద్దాం. తెలంగాణ భూభాగంలో పని చేస్తూ మైదానాలలో, పట్టణాలలో ఉద్యమాన్ని పెంపొందిద్దాం. గ్రామ స్థాయిలో పార్టీని పటిష్ట పరుచుకుందాం. రిక్రూట్‌మెంట్‌ను పెంచుకొందాం. పి.ఆర్‌లను అభివృద్ధి చేసుకొందాం.

★ శతృవు కొనసాగిస్తున్న “సమాధాన్” బహుముఖ దాడుల మధ్య అబేధ్యమైన రహస్య పార్టీని నిర్మిద్దాం, రహస్య పని విధానాన్ని కొనసాగిద్దాం.

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న “సమాధాన్” దాడిని ఓడిద్దాం.

★ పార్టీని బోల్షివీకరిద్దాం, అన్యవర్గ ధోరణులను సరిదిద్దుదాం.

★ దున్నేవారికే భూమి రైతాంగ కమిటీలకే సర్వాధికారాలు, జల్–జంగల్–జమీన్ ఆత్మగౌరవం అధికారం అనే నినాదంపై ఆదివాసులను, ప్రజలను సమీకరిద్దాం.

★ అటవీ భూములు, నిర్వాసిత, కార్మిక, రైతాంగ, పోరాటాలపై కేంద్రీకరిద్దాం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం.

★ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా సెక్యులర్స్, డెమోక్రట్స్, ఎమ్ఎల్ పార్టీలు, దళిత, ఆదివాసీ, మహిళా మైనార్టీ శక్తులు అందరితో విశాల ఐక్య సంఘటన నిర్మిద్దాం.

★ దళిత, మహిళా, ఆదివాసీ, మైనార్టీ హక్కుల కోసం పోరాడుదాం. కుల నిర్మూలనకై కృషిని కొనసాగిద్దాం. పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడుదాం.

అనే నినాదాలు జెండా ముందు మారుమ్రోగాయి. ఆ తర్వాత నూతనంగా రాష్ట్ర కమిటీలోకి తీసుకున్న కామ్రేడ్లతో రాష్ట్ర కార్యదర్శి ప్రతిజ్ఞలు చేయించారు.

జెండా వందనానికి హాజరైన ప్రతినిధులు, పి.ఎల్.జి.ఎ. బలగాలను ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి హరిభూషన్ పి.ఒ.ఆర్. సమీక్షించిన అనుకూల, ప్రతికూల అంశాలను ప్రస్తావించాడు. ప్లీనం విజయానికి సహకరించిన కామ్రేడ్స్ అందరికీ, ప్రజలకు రాష్ట్ర కమిటీ తరపున విప్లవాభివందనాలు తెలియజేశాడు. సి.ఎన్.ఎమ్., జె.ఎన్.ఎమ్. కళాకారులు ఆటలు, పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరికి జెండాను దించడం జరిగింది. ఈ విధంగా ప్లీనం విజయవంతంగా ముగించబడింది.

**– నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయండి**

# ప్రైవేటీకరణను అడ్డుకున్న ఆర్టీసీ కార్మికుల మిలిటెంట్ పోరాటం.

తొమ్మిది దశాబ్దాలుగా ప్రజా రవాణా వ్యవస్థగా ఘననీయమైన చరిత్ర కల్గిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను కాపాడుకునే ఉద్దేశ్యంతో 55 రోజులుగా కొనసాగిన కార్మికుల సమ్మె చివరకు నాటకీయ పరిణామాల మధ్య విజయవంతం అయ్యింది. ఈ పోరాటం ద్వారా ఆర్టీసీ తాత్కాలికంగా ప్రైవేటీకరణ నుండి తప్పించుకుంది. కార్మికుల మిలిటెంట్ ఆందోళన రాష్ట్రంలో తక్కిన కార్పొరేషన్లకు ఆదర్శప్రాయమైంది.



బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలోని 49,190మంది ఉద్యోగులు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కలిపి 26 డిమాండ్లతో అక్టోబర్ నెల 4వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మెకు దిగారు. రవాణా సంస్థలోని గుర్తింపు పొందిన తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎమ్‌యూ), తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌లు కలిసి ఆర్టీసి జేఏసీగా ఏర్పడగా తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్, బహుజన కార్మిక సంఘం, బహుజన యూనియన్, సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్, మరియు కార్మిక సంఘ్ సభ్యులు కలిసి ఆర్టీసి జేఏసీ-1గా ఏర్పడింది. ఈ ఆర్టీసీ జేఏసీ, ఎంప్లాయిస్ యూనియన్, టిఎంయులు ఒక యూనియన్ తర్వాత మరొక యూనియన్ తమ సమస్యల పరిష్కారం కొరకు ఆగస్టు 31, 2019 నుండి సెప్టెంబర్ 19, 2019 మధ్య కాలంలో సమ్మె నోటీసులు ఇచ్చారు.

టిఎంయు గుర్తించబడిన ట్రేడ్ యూనియన్ అయినందున జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సెప్టెంబర్ 16వ తేదీన దాని నోటీసును అడ్మిట్ చేసి ఎటువంటి కారణం చూపకుండా సెప్టెంబర్ 23వ తేదీకి వాయిదా వేశారు. ఈ సంస్థ ప్రజల నిత్యవసర సేవల సంస్థగా గుర్తింపు వున్న దృష్ట్యా, లేబర్ కమిషనర్ 14 రోజులలో నిరంతరం కార్మిక సంఘాలతో, యాజమాన్యంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి సమ్మెను నివారించాల్సిన బాధ్యత సంస్థ యాజమాన్యం, ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారిగా అతనికి ఉన్నది. కానీ ఆ విధంగా చేయకుండా ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకున్న ఆ అధికారి సెప్టెంబర్ 23 నాటి చర్చలను కూడా ఎటువంటి కారణం లేకుండా, భవిష్యత్ చర్చల తేదీని తెలుపకుండా సెప్టెంబర్ 21వ తేదీనాడు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న అసంబద్ధ, చట్ట వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ సెప్టెంబర్ 26వ తేదీన టియంయు చర్చలను ముగించనున్నట్లుగా ఒక లేఖను కార్మికశాఖ అధికారికి ఇచ్చింది. దాంతో చర్చలను ముగించినట్లుగా కార్మిక సంఘాలు ప్రభుత్వానికి తెలియజేశాయి. భారత కార్మికచట్టాల పరిధిలో, భారత పారిశ్రామిక వివాదాల పరిష్కారచట్టం 1947లోని సెక్షన్ 12(6) ప్రకారం కార్మికశాఖ అధికారి 14రోజులలో సమస్యను సంబంధిత ప్రభుత్వానికి పంపలేదు. అలాగే చర్చలను ఎందుకు కొనసాగించలేకపోయారో తెలుపలేదు.

సెప్టెంబర్ 30 నాటికి గడువు ముగియగా, మళ్లీ మూడవ తేదీన చర్చలు కొనసాగిస్తున్నట్లుగా, 4వ తేదీన చర్చలు జరిగేటట్లు నోటీసు ఇచ్చారు. ఇక ప్రభుత్వం ఆర్థిక కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శి ఇతర అధికారులతో కలిసి ఎలాంటి అధికారాలు లేని త్రిసభ్య కమిటీని సెప్టెంబర్ 2న ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఏ ఒక్క సమస్య మీద కూడా నిర్దిష్టంగా కార్మికసంఘాలతో చర్చించకుండానే చర్చలు ముగించినట్లుగా ప్రకటించింది. కార్మిక సంఘాలకు అనివార్యంగా సమ్మెకు పోవడం తప్ప, మరే మార్గం లేకపోయింది. ఫలితంగా 4వ తేదీ అర్ధరాత్రి నుండి దాదాపు 50వేల కార్మికులు సమ్మెలోకి దిగారు.

దాదాపు 75వేల కోట్ల ఆస్తులు కలిగిన ఈ సంస్థ మీద ఆధిపత్యం చెలాయించి, సంస్థను దోచుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి పన్నాగం పన్నారు. తెలంగాణలోని దాదాపు 550 వరకు బస్టాండ్‌లను కలిగి, విలువైన భూములు కలిగి, రాష్ట్రంలోని 97 డిపోలు, 11 రీజయన్ కార్యాలయాలు, వివిధ వర్క్‌షాపుల, ఇతర ఆస్తులను దోచుకోవడంతో పాటు తనకు, తన తాబేదార్లయిన బడా పెట్టుబడిదారులకు నిరంతరం ఆదాయం సమకూర్చడం కొరకు బస్సుల సంఖ్యలో 50:30:20 నిష్పత్తిలో ప్రభుత్వ, అద్దె, పూర్తిగా ప్రైవేటు బస్సులను తేవాలని నిర్ణయించుకుని, సంస్థ మనుగడను దెబ్బతీసి అపార సంపదను దోచుకునేందుకు పాలకవర్గం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నది.

ప్రభుత్వం మరింత మొండిగా వ్యవహరిస్తూ కార్మికులు తమకు తామే "సెల్ఫ్ డిస్మిస్" అయ్యారని 50,000 కార్మికులు ఇక ఆర్టీసీ కార్మికులు కారని, ఆర్టీసీ చరిత్ర ముగిసిందని, తీరని అప్పుల్లో వుందని, ఆ అప్పును ప్రభుత్వం తీర్చదని అన్యాయంగా, అహంకారపూరితంగా మాట్లాడిన ముఖ్యమంత్రి కేసీఆర్ మరింత నిర్బంధాలతో కార్మికులను భయపెడుతూ, సమ్మె మీద పాశవిక నిర్బంధం అమలుచేశాడు.

కార్మికులు గుర్తింపు కలిగిన యూనియన్లను అప్రతిష్ట పాలు చేసి, తన పబ్బం గడుపుకోవాలని కార్మిక సంఘాల మీద దుష్ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. మొదట పండగపూట సమ్మె చేస్తున్నారని, ఆ తర్వాత యూనియన్ నాయకులకు అక్రమ ఆస్తులు వున్నాయని, మరొకవైపు సంస్థను నష్టాల్లో నెట్టేందుకు కార్మిక సంఘాలు ప్రయత్నాలు చేస్తున్నాయని, కార్మికునికి సగటున 50వేల జీతం ఇస్తున్నా, ఇంకా జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారని ప్రభుత్వం సంస్థకు ఇవ్వవలసిన బకాయిల కంటే ఎక్కువే ఇచ్చిందని, తాము ఎక్కిన కొమ్మను తామే నరుక్కుంటున్నారని నోటికి వచ్చినట్టు తన మీడియా ద్వారా ప్రచారం చేశాడు.

హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు హాజరై సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఇంకొకవైపు ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తూ, మరొకవైపు పాఠశాల, కాలేజీల బస్సులను వారి వారి యజమానుల నుండి బలవంతంగా లాక్కొని నడపడం, అనుమతి లేని డ్రైవర్, కండక్టర్లను నియమించుకోవడం ఇంకోవైపు సమ్మెను విరమింపచేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజనం వ్యాజ్యం వేయించడం లాంటి తప్పుడు పనులకు పూనుకున్నది.

మరొకవైపు ఆర్థిక సమస్యలతో అసలే చాలిచాలని జీతాలు కలిగిన ఉద్యోగులు, సెప్టెంబర్లో చేసిన పనికి కూడా జీతభత్యాలు చెల్లించక పోవడంతో, ప్రభుత్వ నిరంకుశ చర్యలతో కలవరం చెందిన ఇద్దరు మహిళా ఉద్యోగులతో పాటు 30 పైగా కార్మికులు ఆత్మహత్యలు, గుండెపోటుతో మరణించారు. సమ్మెను కోర్టు ద్వారా ముగింపు చేయాలని అనుకున్న ప్రభుత్వం ఆశ రోజురోజుకు సన్నగిల్లడంతో, మరోవైపు కార్మికులను సెల్ఫ్ డిస్మిస్ అన్న ప్రభుత్వం ఒకమెట్టు దిగి వచ్చి ఎక్కడికక్కడ కార్మికుల యూనియన్లతో సంబంధం లేకుండా పనుల్లో చేరాలని కార్మికులకు పిలుపునిచ్చినా, కార్మికులు తమ సమస్యల పరిష్కారం జరిగే వరకు విధుల్లో చేరేది లేదని రెండుసార్లు ప్రభుత్వ ప్రకటనలను తిరస్కరించారు.

హైకోర్టు పరిశీలించి జేఏసీల 26 డిమాండ్లలో 21 డిమాండ్లు పరిష్కరించ తగ్గవిగా నిర్ధారించి, మిగతా వాటిని పరిష్కరించేందుకు ఒక కమిటీ వేయాలని, తక్షణమే కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని సెప్టెంబర్ 18న ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 28కి వాయిదా వేయగా, ప్రభుత్వం తమకు అనుకూలంగా అన్వయించుకుని కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ, అందుకు ఒక కమిటీ వేసి సెప్టెంబర్ 26న రెండు గంటలు చర్చలకు పిలిచి కార్మిక సంఘాల నాయకులను భయభ్రాంతులకు గురిచేసింది. పోలీసు అధికారుల సమక్షంలో చర్చలు జరిపేందుకు ప్రయత్నం చేసింది. ఈ అన్యాయాన్ని తీవ్రంగా నిరసిస్తూ కార్మిక సంఘాలు కోర్టు ఉత్తర్వుల ప్రకారం సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే విషయంతో పాటు మిగతా 25 సమస్యలను చర్చించాలని కోరింది. అందుకు నిరాకరించిన యాజమాన్య ప్రతినిధుల తీరును ఎండగడుతూ బయటకు వచ్చి సమ్మెను మరింత ఉధృతం చేయాల్సిందిగా పిలుపునిస్తూ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలను ప్రజలకు వివరించారు.

సంస్థ నష్టాలకు కార్మికులే కారణమని ప్రభుత్వం చెప్పడంలో ఎలాంటి వాస్తవికత లేదు. గతంలో ఆర్టీసీకి 3444 రూట్లు వుండగా నేడు అవి 3726 చేరుకున్నాయి. గతంలో ఆక్యుపెన్సి రేటు 69శాతం వుండగా, నేడు అది 74.50శాతం చేరుకుంది. గతంలో ప్రతి కిలోమీటరుకు ఆర్టీసీ 19.1 పైసలు లాభం వుండగా నేడు అది 37.4 పైసలకు పెరిగింది. గతంలో ప్రమాదాలు ఒక లక్ష కిలోమీటరుకు 0.12శాతం వుండగా నేడు అది 0.07శాతానికి చేరుకున్నది. గతంలో రోజుకు 73లక్షల ప్రయాణీకులను గమ్యానికి చేర్చగా, నేడు రోజుకు 97.66 లక్షల ప్రయాణీకులను గమ్యానికి చేర్చుచున్నది. గతంలో 10,000కి.మీ 0.05శాతం బ్రేక్‌డౌన్ వుండగా, నేడు 0.02శాతానికి తగ్గింది. గతంలో కార్మికుని ఉత్పత్తి శక్తి 50శాతం వుండగా నేడు 63శాతంకు చేరుకుని కార్మికులు తమ నైపుణ్యాన్ని పెంచుకుని సంస్థ మనుగడకు తమ రక్త మాంసాలను ధార పోస్తుండగా, ప్రభుత్వం కార్మికుల మీద దుష్ప్రచారం చేస్తూ నిందలను వేసింది.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 సెక్షన్ 53 ప్రకారం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాలిటీ చట్టంలోని సెక్షన్ 112(30) ప్రకారం ఆర్టీసీ సంస్థకు గత అయిదు సంవత్సరాలుగా రావలసిన బకాయిలు రూపాయలు 1494 కోట్లు, ప్రభుత్వం ఇవ్వవలసిన బకాయిలు రూపాయలు 784 కోట్లు మొత్తం రూపాయలు 2278 కోట్లు, ప్రభుత్వం ఆర్టీసి నుండి వాహన ట్యాక్స్, డిజిల్ ట్యాక్స్, టోల్‌ట్యాక్స్ లాంటివి వసూలు చేయకుంటే 3,000 కోట్లు సంస్థ అప్పులు తీరుతాయి. రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ ద్వారా చెల్లించాల్సిన డబ్బులు సాలీన చెల్లిస్తే రాబోయే రెండు సంవత్సరాలతో సంస్థకు అప్పులే వుండవు.

రాష్ట్ర మంత్రి వర్గం ఆర్టీసిలోని 5100 పర్మిట్లను ప్రైవేటు ఆపరేటర్లకు ఇచ్చే నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయంతో లక్షలాది పేద ప్రజలకు ఇబ్బందులతో పాటు 25,000వేల కార్మికులకు హృదయాల్లో విషాదం నింపింది. మిగతా 5100 పర్మిట్లను కూడా ప్రైవేటుకిచ్చి సంస్థ నడిపే 10,400 బస్సులను ప్రైవేటుపరం చేస్తామని అహంకారంతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ ఆయాంలో ఆర్టీసీని రెండు ముక్కలు చేసి, ప్రైవేటీకరించడానికి జరిగిన తీవ్ర ప్రయత్నాలు కార్మిక ప్రతిఘటనతో వెనుకకు తగ్గాయి. చాల కాలంగా ఆర్టీసీలో అంతర్గత ప్రైవేటీకరణ దఫ దఫాలుగా యాజమాన్యం చేస్తునే వుంది. గ్యారేజిలో 5వేల మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్టీసీలో వుండే 42 రకాల పనుల్లో 28 రకాల పనులను ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చారు. 2,856 అద్దె బస్సులు

తిరుగుతున్నాయి. ఇందులో 5వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ఈ రోజు కేసీఆర్ ప్రభుత్వం ప్రైవేటీకరణను ముందుకు తీసుకుపోవడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నది.

సంస్థ ఆస్తులను అధికారపార్టీ నాయకులకు, ఆ పార్టీ అధినేత బినామీలుగా వున్న బడా పెట్టుబడిదారులకు అప్పనంగా అందిస్తున్నది. ఇందులో భాగంగా సంస్థకు చెందిన 49 పెట్రోల్ బంకులను కేసీఆర్ వియ్యంకుని బామ్మర్దిగారైన విఠల్‌రావుకు అప్పచెప్పింది. ఆర్మూర్లో బస్టాండ్ స్థలాన్ని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి, కరీంనగర్‌లో మాజీ యం.పి. వినోద్‌కుమార్‌కు అప్పచెప్పగా, వరంగల్‌లో ఎంపీ దయాకర్‌కు, తమ వారికి మెగా కృష్ణారెడ్డికి 40 ఎలక్ట్రిక్ బస్సులు కాంట్రాక్టర్లు అప్పగించింది. ఇంకా సంస్థకు చెందిన మొత్తం ఆస్తులను అప్పచెప్పేందుకు ప్రైవేట్ బస్సులు పెంచి ప్రజా రవాణా సంస్థను ప్రభుత్వం నుండి తప్పించి ప్రజల సహజ వనరులను తన బినామిదారులకు, తాబేదారులకు అప్పచెప్పేందుకు కుట్రకు తెరతీసి, కార్మికుల సమ్మె మీద ఉక్కుపాదం మోపుతూ నిర్బంధాన్ని ప్రయోగించింది.

సమ్మె 47 రోజులు సాగుతున్న సమయంలో సమ్మె వ్యవహారాన్ని కార్మిక న్యాయస్థానమే తేల్చాలని, దీనికి రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొంటూ హైకోర్టు కార్మికశాఖకు సూచించిన నేపథ్యంలో ఎలాంటి షరతులు విధించకుండా కార్మికులను విధుల్లోకి తీసుకుంటే సమ్మె విరమణకు సిద్ధమని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించి దీనికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం సానుకూలత వ్యక్తం చేస్తే సమ్మెను విరమిస్తామని లేనిపక్షంలో యధాతథంగా సమ్మెను కొనసాగిస్తామని తేల్చి చెప్పింది. సమ్మె పరిష్కారం కార్మికశాఖ పరిధిలోకి వెళ్ళటం, అక్కడి నుండి కార్మిక న్యాయస్థానానికి వెళ్లేందుకు రెండు వారాల సమయం పట్టడం, ఆ తర్వాత తీర్పు రావటానికి మరికొంత సమయం పడుతుండడంతో సమ్మె విరమణకు సిద్ధం అయ్యామని జేఏసీ వివరణను ఇచ్చింది. దీనికి పదిరోజుల ముందే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రధాన డిమాండ్‌ను వదులుకొని రాతపూర్వకంగా హైకోర్టుకు తెలియజేసింది.

ప్రభుత్వం నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకుండానే జేఏసీ సమ్మె విరమణకు సిద్ధమైందని, ఇది కార్మిక ద్రోహమేనని జెఏసీ-1, నేషనల్ మజ్దూర్ యూనియన్‌లు ప్రకటించాయి. జేఏసీ ప్రకటన తర్వాత ప్రభుత్వం నుండి వెంటనే ఎలాంటి స్పందన రాలేదు. మరో 4 రోజులు వేచిచూసిన జేఏసీ సమ్మె విరమణ చేసింది. తమ ఉద్యోగాల్లో జాయిన్ కావడానికి డీపోల్లోకి వెళ్ళడానికి ప్రయత్నాలు చేసిన కార్మికులను పోలీసుల సహాయంతో అధికారులు డీపోల్లోకి ప్రవేశించకుండా అడ్డుకొన్నారు. తాత్కాలిక డ్రైవర్లతోనే బస్సులను నడిపించారు. నవంబర్ 28న ముఖ్యమంత్రి క్యాబినేట్ సమావేశం ఏర్పాటు చేసి ఆర్టీసీ కార్మికులను విధుల్లోకి చేర్చుకోవడం, ఆర్టీసీకి వందకోట్ల తక్షణ సహాయం అందజేయడం, సమ్మె కాలంలో చనిపోయిన కుటుంబాలకు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాననే హామి ఇచ్చాడు. అలాగే ఆర్టీసీ ఛార్జీలను కిలోమీటర్‌కు 20పైసల చొప్పున పెంచేశాడు. వీటితో పాటు లేబర్ కోర్టుకు రెఫర్ చేస్తే ఉద్యోగాలు వూడుతాయని, నేను అలా చేయడం లేదు. యూనియన్లు అరాచకత్వానికి పాల్పడినాయని, యూనియన్లను సంప్రదించేది లేదని, ప్రతిపక్షాలు రాజకీయ చలిమంటలు కాచుకొంటాయని, వీరి మాటలు వింటే నట్టేట్లో మునిగిపోతారని, నా మాటవింటే మీకు క్షేమం కలుగుతుందని, ఒకవైపు హితవు చెబుతూనే మరోవైపు బెదిరింపులకు పాల్పడినాడు. డీపోకు 5గురు, అందులో ఇద్దరు మహిళలు వుండేలా ప్రతినిధి వర్గం తాను ప్రగతిభవన్‌లో నిర్వహించబోయే “ఆత్మీయ సభ”కు హాజరు కావాలని ప్రకటన చేశాడు. దీని తర్వాత కార్మికులందరు ఉద్యోగాల్లో చేరారు. ప్రగతిభవన్ మీటింగ్‌కు డీపోకు 5గురు చొప్పున హజరైనారు. ఆ మీటింగ్‌లో కూడా ముఖ్యమంత్రి యూనియన్లను, ప్రతిపక్షాలను నిందించాడు. యూనియన్లతో పనిలేదని ఈ కమిటీలే కార్మికుల తరపున పని చేస్తాయని మాట్లాడాడు. అయితే కార్మికులు మాత్రం మా హక్కులు కాపాడబడాలంటే యూనియన్లు వుండడం తప్పనిసరి అని చెబుతున్నారు.

కార్మిక యూనియన్లు, ప్రతిపక్షాలు కార్మికుల మిలిటెంట్ ఆందోళనలపై నమ్మకం ఉంచకుండా హైకోర్టు నిర్ణయాలపై అతిగా ఆధారపడి సమ్మెను విరమించి మోసం చేశాయి. బూర్జువా కోర్టులు అంతిమంగా రాజ్యానికే సపోర్టు చేస్తాయనే సత్యాన్ని కార్మికవర్గం గ్రహించాలి.

ఆందోళన సమయంలో కార్మికులు ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడడం సరైంది కాదు. పోరాడి బతకాలి గాని ఆత్మహత్యలకు తెగించడం ఎంత మాత్రం ఆమోదనీయమైనది కాదు. సమ్మె విరమణ తర్వాత ప్రభుత్వం తమని డ్యూటీలో చేర్చుకోవాలనే వేడుకోళ్ళు సరైంది కాదు. ముఖ్యమంత్రి నిర్వహించిన ప్రగతిభవన్ మీటింగ్‌కు కార్మికులు హాజరు కాకుండా వుండాల్సింది. ఈ చర్య కేసీఆర్ నిరంకుశత్వానికి దయార్థహృదయుడు అనే ముసుగు కప్పింది. కార్మికవర్గ పోరాట సాంప్రదాయానికి ఇది విరుద్ధమైంది.

సంస్థ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రధాన డిమాండ్‌తో రాష్ట్ర రోడ్డు రవాణా(ఆర్‌టిసీ) కార్మికులు 55 రోజులుగా జరిపిన సమ్మె రాష్ట్ర కార్మికోద్యమ చరిత్రలో ఒక పుటను రచించుకొన్నది. కార్మికులు ఎంతో పట్టుదలతో సమ్మె ముందునెల నుండి ప్రభుత్వం జీతాలు చెల్లించక పోయినప్పటికీ కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూడా సమ్మెను ఏకతాటిపై నడిపించారు. సమ్మె జరిగినంత కాలం కార్మికులు డిపోల ముందు ధర్నాలు చేశారు. ఈ ధర్నాల్లో వీరి కుటుంబాలు కూడా పాల్గొన్నాయి. మధ్య మధ్యలో సడక్‌బందులు నిర్వహించారు. పనిలో దిగిన తాత్కాలిక డ్రైవర్లను ఈ పని మానుకోవాలని ఒప్పించ ప్రయత్నించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై పోలీసుల నిషేధాలను

**(11వ పేజీలో....)**

# హిందూత్వ ఎజెండాలో భాగమే పౌరసత్వ సవరణ చట్టం-2019 (సిఏఏ)!

# సిఏఏ-ఎన్ఆర్సీ క్రూరమైన చట్టాల రద్దుకై పోరాడండి!!

'పౌరసత్వ సవరణ చట్టం-2019'కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా మిలిటెంట్ ఆందోళన చెలరేగింది. ఢిల్లీ నుండి తమిళనాడు వరకు, అసోం నుండి మంగుళూరు వరకు అన్ని పట్టణాల్లో, విద్యాలయాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో విద్యార్థులు ఆందోళనకు కేంద్రంగా వుండగా, అసోంలో వివిధ సెక్షన్ల ప్రజలు నాటి ఉద్యమాన్ని తలపించేలా ఆందోళనకు దిగారు. దేశవ్యాప్తంగా సిఏఏను వ్యతిరేకిస్తూ ప్రదర్శనలకు దిగిన ప్రజలపై కేంద్ర, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తీవ్ర నిర్బంధకాండ అమలుచేశారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రదర్శకులపై యుద్ధాన్ని ప్రకటించి, వారిపై క్రూరమైన దాడులకు పాల్పడింది. ప్రదర్శకుల ఇండ్లపై దాడులు చేసి పురుషులు, మహిళలు, పిల్లలు అనే బేధం లేకుండా తీవ్రంగా చితక్కొట్టారు. వారి ఇళ్లను ధ్వంసం చేశారు. ప్రదర్శకులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో 19మందికి పైగా మరణించారు. వందలాదిమంది గాయపడ్డారు. వేలాదిమందిని అరెస్టు చేసి జైళ్లలో పెట్టారు. ఈ బీభత్సాన్ని సమర్థించుకొంటూ యోగి ఆదిత్యనాథ్ "మా ప్రభుత్వం తీసికొన్న కఠిన చర్యల వలన ప్రదర్శకులు భీతావాహం అయి చల్లబడిపోయారని" ట్వీట్ చేశాడు. దేశం విభజన అయిన సందర్భంగా పూర్తికాని కర్తవ్యాన్ని, సీఏఏ ద్వారా పూర్తి చేస్తున్నామని, అందుకు ఇక్కడి ముస్లింలను పాకిస్తాన్ పంపిస్తామని పోలీసు అధికారులు బాహటంగా చెబుతున్నారు. ఈ ఆందోళనలో కేవలం మైనార్టీలే కాకుండా హిందువులతో సహా వివిధ మతాలకు, వర్గాలకు, సెక్షన్లకు చెందిన ప్రజలు పాల్గొంటున్నారు. ఈ ఆందోళనలో పాల్గొంటున్న ప్రజా సమూహాలను చూసి ప్రభుత్వం బెంబేలు వడిపోతున్నది. అప్రతిహతంగా సాగుతున్న ఆర్.ఎస్.ఎస్-బీజేపీ హిందుత్వ ఎజెండా జగన్నాథ రథచక్రాలకు ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు జరుపుతున్న దేశవ్యాప్త ఆందోళన ద్వారా అడ్డుకట్ట వేశారు. దేశంలో నూతన తరం కొత్త ఉద్యమానికి నాంది పలికి దేశ ప్రజలకు ఆశాజ్యోతిగా వెలిగిపోతున్నది. రాబోయే రోజుల్లో హిందూత్వ ఫాసిస్టుల నగ్న స్వరూపం మరింతగా బహిర్గతం కాక తప్పదు.



దేశంలో జాతీయ పౌర జాబితా(ఎన్ఆర్సీ) అమలు చేసే లక్ష్యంలో భాగంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిఏఏ అనే కొత్త చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకొని అమలులోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబర్ 31న గాని, అంతకు ముందుగాని మన దేశానికి పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుండి వలస వచ్చిన అల్ప సంఖ్యాకులైన హిందూ, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్శీ మతస్థులకు పౌరసత్వం కల్పిస్తున్నది. ఈ పౌరసత్వ సవరణ చట్టం-2019 ముస్లింలను టార్గెట్ చేస్తూ, వారిని ఈ దేశంలో ద్వితీయ శ్రేణి పౌరులుగా దిగజార్చడం, రేపు అమలు జరపబోయే ఎన్ఆర్సీకి రక్షణ కవచంగా ఉపయోగపడే ఉద్దేశ్యంతోనే పాలకులు దీనిని రూపొందించారు. ఆ వెనువెంటనే కేంద్ర క్యాబినేట్ 'నేషనల్ పాపులేషన్ రిజిస్టర్'కు(ఎన్‌పీఆర్) ఆమోదం తెలిపింది. బీజేపీ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ముందుకు తెస్తున్న చట్టాలు బీజేపీ-ఆర్ఎస్ఎస్ ఎజెండా అయిన 'హిందూ రాష్ట్రం' ఏర్పాటుకు ఉపయోగపడేలా రూపొందించారు. రెండవసారి అత్యధిక మెజార్టీలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ దేశంలో ఎవరిని లెక్క చేయకుండా తన హిందూత్వ ఎజెండాను వడివడి అడుగులతో ముందుకు తీసుకొనిపోతున్నది. బీజేపీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన సిఏఏ బిల్లుకు తద్వారా దేశవ్యాప్తంగా ఎన్ఆర్సి తేవడానికి చాలా వేగంగా వేస్తున్న అడుగులకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు గట్టిగా పోరాడలేకపోయాయి. కాని ముస్లింలు, ఈశాన్య రాష్ట్ర ప్రజలు, పౌరహక్కుల సంఘాలు, సకల సామాజిక వర్గాలు ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా మిలిటెంట్ ఆందోళనకు దిగాయి. కాంగ్రెస్‌తో సహా ఇతర ప్రతిపక్షాలు కూడా ఎన్ఆర్సీని అమలుకు అనుకూలమైనవే. అసోంలో 2013లో కాంగ్రెస్ పార్టీయే ఈ ప్రక్రియ చేపట్టింది.

అసోంలో అమలుచేస్తున్న సవరించిన ఎన్ఆర్సీ చట్టం ఎలాంటిది? దీన్ని అమలు చేయడంలో పాలక వర్గాల ఉద్దేశ్యాలు ఏమిటి? ఇది అక్కడి ప్రాదేశిక సామాజిక స్వరూపాన్ని ఎలా మార్చి వేస్తున్నది? అణగారిన మతాలను, జాతులను ఎలా అణచివేస్తున్నది? మొదలైన విషయాలను మనం కార్మికవర్గ పార్టీ సైద్ధాంతిక, రాజకీయ కోణంలో పరిశీలించాలి. అలాంటప్పుడే దేశంలోని పాలకవర్గాల దుశ్చర్యలను బహిర్గతపర్చగలం. పీడిత ప్రజలను, జాతులను, మైనార్టీలను ప్రజా ఉద్యమాల్లోకి సమీకరించి కరుడుగట్టిన చట్టాలను రద్దు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేగలం. నేడు అసోంలో అమలు చేస్తున్న, రేపు దేశమంతటా అమలు చేయబోయే ఎన్ఆర్సీ లక్ష్యాలను మనం ఈ విధంగా చెప్పవచ్చు.

అసోంతో సహా ఈశాన్య రాష్ట్రాలు ఏనాడు భారతదేశంలో

అంతర్భాగం కావు. ఈ ప్రాంతాల్లోని ప్రజలను భారతీయకరణ చేయడమే ఎన్ఆర్సీ లక్ష్యంగా వుంది.; అసోం, ఈశాన్య రాష్ట్రాల్లోని వివిధ సెక్షన్ల, మతాల మధ్య సాంప్రదాయక చిచ్చురేపి ప్రజల్లో చీలికలు తేవడం.; పౌరసత్వం లాక్కొని కొద్దిమంది పౌరసత్వం తొలిగించివేసి వారికి ఎలాంటి హక్కులు లేకుండా చేసి తిరిగి మరొక బానిస వ్యవస్థను ఏర్పాటు చేయడం. వీరే సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు చౌకశ్రమ అందించే సమూహాలుగా మారిపోవడం. సిఏఏ నూతన చట్టం ద్వారా ముఖ్యంగా భారతీయ జనతా పార్టీ ముస్లింల నుండి వారి పౌరసత్వం లాక్కొని వారిని శరణార్థులుగా మార్చడం.

పై అంశాలను క్షుణ్ణంగా పరిశీలించే ముందు అసలు ఎన్ఆర్సీ అంటే ఏమిటో తెలుసుకోవాలి.

భారత ప్రభుత్వం 1951లో జనాభా లెక్కలతో పాటు ఎన్ఆర్సీని రూపొందించింది. ఈ కొత్త విధానంతో దేశంలోని ప్రతి పౌరుడు అనివార్యంగా తన పౌరసత్వాన్ని నిరూపించుకోవాలి. అందుకు కనీసం 15 అధికారిక డాక్యుమెంట్లను ప్రవేశపెట్టాలి. ఎన్ఆర్సీ ప్రకారం ప్రతి పౌరుడు తన వంశ వృక్షాన్ని వెదికి తను ఈ దేశ పౌరుడునేనని నిరూపించుకోవాల్సి ఉంటుంది. అందుకు తల్లిదండ్రులతో పాటు పూర్వీకులు ఇక్కడ స్థానికులేనని, 1951 సూచిలో వీరి నమోదును చూపెటాల్సి ఉంటుంది. తల్లి దండ్రుల స్థాయి, అడ్రసు, జన్మ ప్రమాణపత్రం, వివాహ ప్రమాణపత్రం, ఓటరు సూచి, ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఉద్యోగంలో ఉన్న సాక్ష్యాల్ని 1971 ముందు తమ, తమ పూర్వీకులవి చూపెట్టాల్సిన తప్పనిసరి నియమంగా వుంది. ఈ నియమం ప్రకారం దేశంలోని లక్షల కోట్ల పౌరులు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవడం చాలా కఠిన తరమే గాకుండా చాలామందికి అసాధ్యమైన విషయం. దేశంలో ఎలాంటి హక్కులు లేకుండా పడివుండే శ్రామిక జనం, పేదలు, దళితులు, ఆదివాసులు, మైనార్టీలు అధికారిక డాక్యుమెంట్లు కల్గివుండడం అసంభవం. ఉన్నత మధ్యతరగతి, ధనికులు ఈ విధానం ద్వారా తమ పౌరసత్వాన్ని నిరూపించుకోగలరు, లేదా కోర్టులనాశ్రయించి తము ఈ దేశ పౌరులమేనని నిరూపించుకోగలరు. కాని పేద ప్రజలకు ఈ ప్రక్రియ అసాధ్యమైన విషయంగా ఉంటుంది.

ఇక ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం 2016 నుండి అసోంలో అమలు చేస్తున్న ఎన్ఆర్సీ లక్ష్యాలను ఒక్కొక్కటిగా చూద్దాం.

అసోంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు ఏనాడు భారతదేశంలో అంతర్భాగంగా లేవు. మానవశాస్త్రం, చరిత్ర అధ్యయనం ద్వారా తెలిసే విషయమేమంటే అసోం భారతదేశంకు విభిన్నమైన భూమండలంగా ఉంది. అసోంలో భాష, సాంస్కృతిక అంశాల్లో భారతదేశానికి సంబంధించినవి కాకుండా మంగోల్ మరియు టిబెట్ సాంస్కృతిక ప్రభావం కనబడుతున్నది. ఇలా ఏ అంశాల్లో చూసినప్పటికీ భారతదేశ ప్రధాన భూభాగం నుండి అసోం వేరుగానే అభివృద్ధి జరిగిందనే విషయం స్పష్టం అవుతోంది.

మొదటగా యూరప్లో వివిధ జాతులు అభివృద్ధి చెందాయి. పెట్టుబడిదారీ విధానంతో సమానంతరంగా జాతుల ఆవిర్భావం జరిగింది. కాని మనదేశంలో జాతుల వికాసం అసమానంగా వుంది. ఇక్కడ కొన్ని జాతులు ముందే వికాసం చెందగా, మరికొన్ని ప్రాదుర్భావ దశలోనే వుండిపోయాయి. బ్రిటీష్ వలసగా, ఆ తర్వాత అర్థవలస-అర్థభూస్వామ్య వ్యవస్థ ఇందుకు కారణాలుగా ఉన్నాయి. అసోంలోని ఈశాన్య రాష్ట్రాలు వెనుకబడి వున్నాయి. కాబట్టి అసోంలో తదితర ఈశాన్య రాష్ట్రంలో ప్రజలు చేస్తున్న ఆందోళనలకు మద్దతునిస్తూ, వీరికి విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికారం కావాలనే డిమాండ్కు సంపూర్ణ మద్దతునివ్వాలి. ఎన్ఆర్సీ ద్వారా అసోం ప్రజలను భారతీయకరణ చేసే కుట్రలను వ్యతిరేకించాలి. అసోంములదే అసోమని వారి డిమాండ్ను మనం గట్టిగా సమర్థించాలి.

అసోమ్లోని అడవుల్లో బ్రిటన్ 1823వ సంవత్సరంలో టీ తోటల పెంపకం కనిపెట్టింది. ఈ టీ తోటల్లో పనిచేయడానికి చౌకశ్రమ కోసం చోటనాగ్పూర్ నుండి పెద్దసంఖ్యలో ఆదివాసీలను బ్రీటిష్వారు తీసుకొచ్చారు. బ్రహ్మపుత్ర నది పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయం అభివృద్ధి పర్చడంలో అక్కడి స్థానిక ప్రజలకు తగినంత నైపుణ్యం లేదు. ఉత్పత్తిని పెంచడానికి ఈ పరివాహక ప్రాంతంల్లోకి బ్రీటిష్ వారు బెంగాలీలను ప్రోత్సహించారు. అప్పటికే బెంగాల్లో భూపంపకాలు జరిగి భూదాహం కలిగిన రైతులు వున్నారు. వీరంతా ముఖ్యంగా తూర్పుబెంగాల్ నుండి అసోం వైపు పలాయనం అయ్యారు. క్రమంగా టీ తోటల కార్మికులు, రైల్వే అధికారులు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, బ్యూరోక్రట్లు వచ్చి చేరగా జనాభా సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇలా జనాభా విస్తరణతో వ్యవసాయంలో ఉత్పత్తి పెరుగుదల అవసరమైంది. అసోంలోని భూస్వాముల వద్ద పడావు వున్న భూముల్లో చౌకశ్రమ ద్వారా ఉత్పత్తి జరపడానికి మనషులు అవసరమైనారు. ఈ కారణాలతో బెంగాల్ నుండి అసోంలోకి పలాయనాన్ని బ్రీటిష్ వారు ప్రోత్సహించారు. ఆ రోజు అసోంలోకి వలస వచ్చిన వారు పేద ప్రజలు తమ పొట్టకూటి కోసమే గాని మరో ఉద్దేశ్యంతో వారు రాలేదు. కానీ బ్రీటిష్ సామ్రాజ్యవాదులు, వారి దళారీ పెట్టుబడిదారులైన టాటాబిర్లాలు అసోంలో లాభాలు సంపాదించడానికే ఈ ప్రాంతంలోకి చొరబడినారు. ఈ దళారులే బెంగాల్ సహజ అభివృద్ధికి అటంకంగా మారి బెంగాల్ విభజనకు బ్రీటిష్ వారితో చేతులు కలిపారు.

కాంగ్రెస్లో ఒక భాగం, హిందూ మహాసభకు చెందిన మదన్మోహన్ మాలవ్య బెంగాల్ను విభజించే లార్డ్ కర్జన్ పాలసీకి మద్దతునిచ్చారు. బెంగాల్లో స్థానిక ముస్లిం లీగ్, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి కిరణ్ శంకర్రే, సుభాస్చంద్రబోస్ తమ్ముడు శరత్ చంద్రబోస్లు బెంగాల్ విభజనను వ్యతిరేకించగా, కాంగ్రెస్ నాయకులు విధాన్రే, గాంధీ, నెహ్రూ, వల్లభాయ్పటేల్తో పాటు హిందూసభ నాయకుడు శ్యామప్రసాద్ ముఖర్జీలు బెంగాల్ విభజనకు మద్దతు పలికారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నేతృత్వంలో దళారీ పాలకవర్గ పార్టీలైన

కాంగ్రెసు, హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్ అనుసరించిన విభజించు పాలించు అనే విధానంతో అసోం, బెంగాల్ ప్రజల మధ్యగల మిత్ర వైరుధ్యం శత్రు పూరితంగా మారింది. అసోం, బెంగాల్ ఇరు జాతుల ప్రజలకు సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, బడా భూస్వాములు వారి పార్టీలైన కాంగ్రెస్, బీజేపిలే శత్రువులు గాని, బెంగాలీ, చోటనాగపూర్ ప్రజలు శత్రువులు కారు.

అసోంలో తమ అస్తిత్వం కోసం దశాబ్దాలుగా జరుగుతున్న ప్రజల పోరాటానికి మనము నిర్ద్వందంగా మద్దతునివ్వాలి. వారికి విడిపోయే హక్కుతో సహా స్వయం సంపూర్ణ అధికారాన్ని మనం గుర్తించాలి. అస్సామి, బోడో, రవ్వ, కర్బీ, హింహస్, గోరే, కసియా, టీ తోటల ఆదివాసీలు, బెంగాలీల మధ్య ఐక్యతను నెలకొల్పుతూ భారత విస్తరణవాదులైన దళారీ పెట్టుబడిదారులకు, వారి యాజమానులైన సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సివుంది.

అసోంలో సవరించిన జాతీయ పౌర జాబిత(ఎన్ఆర్సీ)ని 2016 నుండి బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్నది. దీనితో ప్రజల్లోని ఒక పెద్ద భాగానికి పౌరసత్వ అధికారంను రద్దు చేయడానికి బీజేపీ, దాన్ని మిత్రపక్షాలు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించాయి. జూన్ 2018 నుండి 40లక్షల మంది ప్రజల హక్కును ఎన్ఆర్సీ పత్రాలు రద్దు చేశాయి. సుప్రీంకోర్టు సిఫారసుల ద్వారా మరో 50లక్షల మంది పౌరసత్వం చిక్కులో పడింది. ప్రస్తుతం ప్రజల ఆందోళన తర్వాత ఈ సంఖ్యను 19లక్షలకు కుదించారు. అసోంలో అమలుచేస్తున్న ఎన్ఆర్సీని సమర్థిస్తూ బీజేపీ, దాన్ని మిత్రపక్షాలు రెండు కారణాలు చూపెడుతున్నాయి. పౌరసత్వం కోల్పోతున్న వారిలో చాలామంది బంగ్లాదేశ్ నుండి 'చొరబాటుదారులు' వున్నారని చెపుతున్నారు. రాజీవ్‌గాధీ నాయకత్వంలో ప్రభుత్వంకు, అల్ అస్సాం స్టూడెంట్ యూనియన్‌తో ఆగస్టు 14, 1985లో జరిగిన ఒప్పందం ప్రకారం ఈ తొలగింపు జరుగుతుందని చెబుతున్నారు. కాని ఆ ఒప్పందంలో 1971ని కటాఫ్ సంవత్సరంగా ప్రకటించి ఉంది. దీని ప్రకారం అన్ని లక్షల మంది పౌరసత్వ రద్దు పరిధిలోకి రారు. ఎందుకంటే మనం ఈ కటాఫ్ డేట్ ఆధారం చేసుకొని ప్రభుత్వ అధికారిక డాక్యుమెంట్లను పరిశీలిస్తే, దేశంలోని తక్కిన ప్రాంతాలతో పోలిస్తే అస్సాంలో వలసల పెరుగుదల రేటు 7.53శాతం తక్కువగా వుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 2014 నుండి ఓటర్ల లిస్టు నుండి తొలిగించి వేయబడిన సంఖ్య 1,43,227 అయినప్పుడు ప్రస్తుతం 40లక్షల (19లక్షల)ను తొలగించడానికి కారణాలు ప్రభుత్వం ఏమి చెప్పగలదు? ఈ వాస్తవాల్ని పరిశీలిస్తే బీజేపీ దాన్ని మిత్రపక్షాలు చేస్తున్న వాదన అర్థ రహితమైనదని చెప్పవచ్చు. పై విషయాల ద్వారా ఎన్ఆర్సీని బీజేపీ ఒక లక్ష్యంతో అమలుచేయ పూనుకున్నట్లుగా ఖచ్చితంగా చెప్పవచ్చు. అట్లాగే అసోంలో ఒక కమ్యూనిటీని(ముస్లింలను) టార్గెట్ చేస్తున్నారన్న విషయం సులువుగా అర్థమవుతున్నది.

దేశంలో ఎన్ఆర్సీ కంటే ముందు బ్రిటీష్ పాలనలో 'ఇల్లీగల్ మైనార్టీ డిటెన్షన్' చట్టం పేరుతో ఒక చట్టం అమలులో వుండేది. ఈ క్రూర చట్టాన్ని 1995 సుప్రీంకోర్టు రాజ్యాంగేతర అధినియమంగా పేర్కొని రద్దు చేసింది. అయితే ఈ చట్టాన్ని అనుసరించి 22 ఏళ్ళ పాటు అసోంలో బంగ్లాదేశీయులను గుర్తించి బలవంతంగా డిటెన్షన్ చేయడం జరిగింది. ఏ చట్టానయితే సుప్రీంకోర్టు రాజ్యాంగేతర అధినియమంగా పేర్కొని రద్దు చేసిందో అదే చట్టాన్ని దొడ్డిదారిన నేడు బీజేపీ ఎన్ఆర్సీ పేరుతో అమలుచేయ చూస్తున్నది.

సిఏఏ కొత్త చట్టంపై దేశవ్యాప్త చర్చతో పాటు ప్రజాందోళనలు చెలరేగుతున్నాయి. ఈ చట్టం ద్వారా మన దేశానికి చుట్టుపక్కల వున్న ఇతర దేశాలను అక్కడి అల్ప సంఖ్యాకులను విస్మరించి కేవలం మూడు దేశాలు, ఆరు అల్ప సంఖ్యాక మతాలనే ఎందుకు ఎన్నుకున్నారనే ప్రశ్నలకు బీజేపీ ప్రభుత్వం నుండి ప్రజలకు సంతృప్తికరమైన సమాధానం రాలేదు. ఈ చట్టం రాజ్యాంగపు విరుద్ధం, రాజ్యాంగపు 14,15,25 అధికరణాలను ఉల్లంఘిస్తున్నదని న్యాయకోవిధులు లేవనెత్తారు. ఒక వ్యక్తికి పౌరసత్వం కల్పించడం లేదా తిరస్కరించడం, మతాన్ని ఆధారం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమనే వాదనకు ప్రభుత్వం సరైన సమాధానం ఇవ్వకుండా ఎదురుదాడి చేసింది. కాంగ్రెసు దశాబ్దాలుగా అనుసరించిన మత రాజకీయాల వల్లనే ఈ పద్ధతికి ఒడిగట్టాల్సి వచ్చిందని బీజేపీ ప్రభుత్వం సమర్థించుకున్నది. అయితే ఈ చట్టం అసలు ఉద్దేశ్యం ఈ దేశవాసులైన ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా దిగజార్చివేయడమే తప్ప మరేమి కాదు.

సిఏఏ-ఎన్ఆర్సీ రెండింటిని అమలు చేస్తే ఎలాంటి పరిణామాలు వుంటాయో ఇక్కడ మనం పరిశీలించాలి. 2014 డిసెంబర్ ఒకటికి ముందు వలస వచ్చిన వారికే పౌరసత్వానికి అర్హులుగా పేర్కొనే సిఏఏకు, 1971 మార్చి 25గడువుగా నిర్ధారించిన ఎన్ఆర్సీకి మధ్య వైరుధ్యం విషమ ప్రభావాన్ని చూపక తప్పదు. దీనితో ఎన్ఆర్సీ కింద మినహాయించబడిన ముస్లిమేతరులకు సిఏఏ ప్రకారం భారతీయ పౌరసత్వం కలిగించడం అవకాశం ఇవ్వగా ముస్లింలను మాత్రం అక్రమ వలసదారులుగా గుర్తించడం, జాతీయ పౌరజాబితా నుండి మినహాయించడం జరుగుతుంది. అక్రమ వలసదారులుగా గుర్తించిన వ్యక్తులను వారు నివసిస్తున్న ప్రాంతాలలోని ఇతర ప్రజల నుండి వేరుచేసి ప్రత్యేక శిబిరాల్లో వుంచుతారు. ఏ దేశమైన తమ పౌరులుగా అంగీకరించే వరకు వారు ఆ శిబిరల్లోనే వుండిపోవాల్సి వస్తుంది. వీరంతా ఆ శిబిరాల్లో కట్టు బానిసలుగా పడివుండి సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు చౌకశ్రమను అందించే వనరుగా మారిపోవడం జరుగుతోంది. బీజేపీ-ఆర్ఎస్ఎస్ కుట్ర అసలు ఇందులోనే దాగివుంది.

ఇక 'నేషనల్ పాపులేషన్ రిజిస్టర్' అమలుకు ప్రభుత్వం ఈ సమయంలోనే పూనుకోవడం కూడా రేపు దేశవ్యాప్తంగా రూపొందించబోయే ఎన్ఆర్సీ చట్టానికి సహాయకారిగా వుండడం కోసమే తప్ప మరేమి కాదు. దీని ప్రక్రియ సాధారణమైనదని దీనికి ఎలాంటి ధృవపత్రాలు అవసరం లేకుండానే ప్రజల ఒప్పుదలతోనే రిజిస్టర్లో నమోదు చేయబడుతుందని ప్రభుత్వం బుకాయిస్తున్నది. కాని

దీనిలో వున్న అసలు గుట్టును పరిశీలిస్తే, నేడు ఈ రిజిస్టర్లో నమోదుకు నేడు ఎలాంటి ధృవపత్రాలు అవసరం లేకపోయినప్పటికీ ప్రభుత్వం రేపు నమోదు నిరూపణ కోసం ధృవపత్రాలు కావాలని కోరవచ్చు. ప్రస్తుత రిజిస్టర్ నమోదు కోసం తయారు చేసిన డాటా పత్రంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా నమోదు చేసుకునే వ్యక్తికి సంబంధించిన తల్లిదండ్రుల పుట్టుక వారి మ్యారేజి స్థలాలకు సంబంధించిన వివరాల కాలంను అందులో చేర్చింది. ఇలా సిఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పిఆర్ చట్టాలను ఒకదాన్నివెంట మరొకదాన్ని ప్రభుత్వం అమలుచేస్తూ బీజేపీ తన అప్రకటిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

'భారత్ ఒక హిందూదేశం' అన్న గోల్వాల్కర్ సిద్ధాంతాన్ని అనుసరించి ఆర్ఎస్ఎస్–బీజేపీ నేడు 'శ్రేష్టభారత్–ఏక్భారత్', 'అఖండ భారత్', డిజిటల్ ఇండియా' లాంటి పదగుంభనాలతో దేశాన్ని హిందూదేశంగా మార్చడానికి ఉరకలేస్తున్నది. భారతదేశం విభిన్న జాతులకు, మతాలకు నిలయమైన దేశం. ఇక్కడ అనేక మతాలు సహజీవనం చేస్తున్నాయి. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు మన దేశాన్ని 200ఏళ్ల పాటు పరిపాలించి జాతుల వికాసాన్ని అడ్డుకొన్నారు. 1947లో దేశానికి వచ్చిన బూటకపు స్వాతంత్ర్యంతో దేశంలో అర్ధవలస–అర్ధభూస్వామ్య వ్యవస్థ కొనసాగుతున్నది. దేశంలో వివిధ జాతుల అభివృద్ధి వికాసానికి సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, బడా భూస్వాములు అటంకంగా వున్నారు. దేశంలోని అన్ని జాతులను, దళితులను, ఆదివాసులను, మైనార్టీలను, పేదలను అణచివేస్తూ పరిపాలన సాగిస్తున్నారు. ఇప్పుడు హిందూత్వ ఫాసిస్టు శక్తులు అధికారంలోకి వచ్చి కొత్తగా నిరంకుశ చట్టాల్ని అమల్లోకి తెస్తున్నాయి. నేడు సిఏఏ–ఎన్ఆర్సి చట్టాల ద్వారా ముస్లింలను ఈశాన్య రాష్ట్ర ప్రజలను ఇతర మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చడం, పౌరసత్వానికి అనర్హులను చేసి వారిని డిటెన్షన్, డిలీషన్, డిపోర్టెటేషన్ చేయడం, వారిని ప్రత్యేక శిబిరాల్లో నిర్బంధించడం చేస్తున్నారు. అందుకు ఇప్పటికే అస్సాంలో నిర్బంధ శిబిరాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అసోంలో అమలుచేస్తున్న ఎన్ఆర్సీ చట్టాన్ని కొద్దిరోజుల్లో దేశవ్యాప్తంగా అమలుచేయడానికి గాను బీజేపీ చురుకుగా సన్నాహాలు చేస్తున్నది. ఇది ఇప్పటినుండే దేశాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది.

మన దేశం విభిన్న జాతులు, మతాలు, దళితులు, ఆదివాసులు, పురాతన ప్రజల వారసత్వానికి నిలయం. ఎంతో గొప్ప చారిత్రక వారసత్వం కలిగిన దేశం. దీని కారణంగా దేశంలో ఫెడరల్ వ్యవస్థ చాలా బలంగా నెలకొల్పాల్సిన అవసరం వుంది. ఇందులో వివిధ జాతులు, ప్రజలు స్వేచ్ఛా జీవనం కొనసాగించే అవకాశం వుంటుంది. దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు–బడా భూస్వామ్య పాలకవర్గాలను అధికారం నుండి తొలగించి దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే ఏర్పడే ఫెడరల్ రిపబ్లిక్లో వివిధ జాతులు, ప్రజలు దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యములతో జీవనం సాగించగలరు. నేడు బీజేపీ తన హిందూత్వ ఎజెండాతో దేశానికి ప్రమాదకారిగా మారింది. బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా వివిధ జాతులు, మైనార్టీలు, దళితులు, ఆదివాసులు, మహిళలు, కార్మికులు, రైతాంగం, విద్యార్థులు, ప్రజాస్వామికవాదులు, హక్కుల కార్యకర్తలు జరుపుతున్న పోరాటాలకు మద్దతునిస్తూ బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు దాడిని ఎదుర్కోవడానికి ముందుకు రావాల్సిన అవసరం దేశ ప్రజల ముందు వుంది. ప్రజలంతా ఐక్యమై పోరాడడం ద్వారానే ఎన్ఆర్సీతో పాటు సీఏఏ, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ లాంటి సవరించిన చట్టాలతో బీజేపీ చేపట్టే నిరంకుశ చర్యలను ఎదుర్కోగలం.

**(7వ పేజీ తరువాయి)......**

ధిక్కరించి మిలిటెంట్గా మార్చ్ నిర్వహించి తెలంగాణ ఉద్యమ మిగతా కాలంనాటి పోరాట రూపాన్ని ముందుకు తెచ్చారు. ఈ సమ్మెను ముఖ్యమంత్రి కేసీఆర్ మొండివైఖరితో వ్యతిరేకిస్తూ కార్మికులు సమ్మె చేపట్టడం ద్వారా 'సెల్ఫ్డిస్మిస్' అయ్యారని బెదిరించినప్పటికీ, రెండు సార్లు డెడ్లైన్ విధించిన కూడా కార్మికులు విధుల్లో చేరలేదు. ఆర్టీసీని పూర్తిగా ప్రైవేట్పరం చేస్తానని హుంకరించినప్పటికీ కార్మికులు కొంచెం కూడా బెదరకుండా ఐక్యంగా సమ్మెను కొనసాగించారు. ఈ పోరాటంలో మహిళ కార్మికులు చివరి వరకు మిలిటెంట్గా సమ్మెలో పాల్గొనడం విశేషం. తెలంగాణలో తాను చెప్పిందే వేదం అని చెప్పుకునే ముఖ్యమంత్రి కేసీఆర్కు కార్మికులు ఐక్యపోరాటం ద్వారా సవాలు విసిరారు. నూతన ఆర్థిక విధానాలతో ప్రభుత్వం ప్రతీది ప్రైవేటీకరించడమే అంటూ ముందుకుపోతున్న సమయంలో ఈ బుల్డోజర్ను అడ్డుకోవడంతో ఆర్టీసీ కార్మికులు తాత్కాలికంగానైనా విజయం సాధించారు. ఆ రకంగా వారు కార్మిక వర్గానికంతటికీ ఆదర్శ ప్రాయంగా నిలిచారు. ప్రభుత్వం రేపు కార్పొరేషన్లను, వివిధ సంస్థలను ప్రైవేటీకరించడానికి చేసే ప్రయత్నాల్లో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకొనే పరిస్థితి కల్పించారు. ఈ సమ్మెకు ప్రజల, ప్రజాసంఘాల, లాయర్ల, ప్రజాస్వామికవాదుల మద్దతు లభించింది. ప్రతిపక్షాలు వాటి ట్రేడ్ యునియన్లు ఈ సమ్మెలో భాగస్వామ్యం కావడం వలన కార్మికుల సమ్మెకు అవి మద్దతునిచ్చాయి.

ఈ పోరాటంలో ట్రేడ్ యూనియన్లు, ప్రతిపక్షాలు, బూర్జువా కోర్టులు కార్మికులను మధ్యలో వదిలేసిన కూడా కార్మికులు పట్టుదలతో చివరి వరకు సమ్మె కొనసాగించి విజయవంతం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి కుటిలత్వాన్ని బయటపెట్టి తాత్కాలికంగా ప్రభుత్వం ప్రైవేటీకరణను వదులుకునేలా కార్మికవర్గం పోరాడింది. ఈ అనుభవంతో ఆర్టీసీ కార్మికవర్గం, ఇతర కార్మికులు రాబోయే రోజుల్లో తమ సొంత కాళ్ళపై నిలబడి మిలిటెంట్ ఆందోళనలను చేపట్టి మరిన్ని విజయాలు సాధించగలరని ఆశిద్దాం. ఆర్టీసీని, దానికున్న 75,000 కోట్ల రూపాయల ఆస్తులను బడా పెట్టుబడిదారుల, అధికార పార్టీల నాయకుల చేతుల్లోకి పోకుండా కాపాడుకోవాలి.

# చట్టాన్ని పోలీసులకు అప్పజెప్పితే మానవ మనుగడకే ప్రమాదం.

నాగర్ కర్నూలు జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి గ్రామానికి చెందిన పోతుల ప్రియాంకరెడ్డి (దిశ) పశు వైద్యురాలుగా కొల్లూరులో ఉద్యోగం చేస్తున్నది. డ్యూటి ముగియగానే ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడి షాద్‌నగర్‌లోని స్కిన్ స్పెషలిస్టు డాక్టర్‌ని కలవడానికి వెళ్ళింది. తొండుపల్లి సమీపంలోకి రాగానే తనస్కూటీ చెడిపోవడంతో అక్కడే పార్కుచేసి మెకానిక్ షాప్ కోసం వెతుకుతుంటే అది గమనించిన (రాత్రి 9॥30కు) లారీ డ్రైవర్లు, క్లీనర్లు నలుగురు నీకు సహాయం చేస్తానని నమ్మించి మోసం చేసి షాద్‌నగర్ సమీపంలో అత్యాచారం చేసి చటాన్‌పల్లి గ్రామ శివారులో వంతెన క్రింద పెట్రోలుపోసి కాలబెట్టారు. ప్రియాంకరెడ్డి అంతకు ముందే ఆ నలుగురి వాలకాన్ని చూసి అనుమానించి తన చెల్లికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించింది. తర్వాత ఎంతసేటికి అక్క దగ్గరి నుంచి ఫోన్ రాకపోయేసరికి అనుమానంతో పోలీసులకు రాత్రి 11 గంటలకు ఫోన్ చేసి తన అక్క పరిస్థితిని వివరించి చెప్పినప్పటికీ పోలీసులు యధావిధి నిర్లక్ష్య వైఖరితో 3 గంటలకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించేలోపు ఆమె చనిపోయి శవమై కాలి బూడిదై పోయింది.

ఈ విషయం 5.30 గంటల సమయంలో బయట ప్రపంచానికి తెలిసింది. హైదరాబాద్ రాజధానిలోని సైబరాబాద్ పోలీస్ కమీషనర్ సి.పి (సజ్జనార్) పరిధిలో జరగడంతో ప్రభుత్వ, పోలీసుల నిర్లక్ష్యం వల్ల ఇది రాజధానిలో జరిగిందని అన్ని వర్గాల ప్రజల నుండి, బూర్జువా, ప్రతిపక్ష పార్టీల నుండి, దేశవ్యాప్తంగా నిరసనలు, వ్యతిరేకత వచ్చింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం చేసిన ముగ్గురిని సస్పెండ్ చేసింది. తర్వాత సిసిటీవి పుటేజీల ఆధారంగా సమాచారం సేకరించి హత్య చేసిన వారు నారాయణపేట జిల్లాకు చెందిన నిందితులు అరిఫ్ (26) జొల్లు శివ (20) జొల్లు నవీన్ (20) చింతకుంట చిన్న కేశవులు (20)ను ఈ నలుగురిని గుర్తించామని వారిని అరెస్టు చేసి చర్లపల్లి జైళ్ళో పెట్టారు. ఈ కేసును త్వరితరగతిన విచారించడానికి ప్రత్యేక కోర్టును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పోలీసులు కోర్టు ద్వారా 10 రోజులు కష్టడిలోకి తీసుకుని 2 రోజులు విచారించారు. ఈ సమయంలో ప్రభుత్వంపై, పోలీసులపై, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, వాట్సాప్‌లలో నిందితులను చట్ట ప్రకారం సరైన శిక్ష విధించాలని, వారికి మరణ శిక్ష వేయాలని, ఎన్‌కౌంటర్ చేయాలని ప్రజల నుండి డిమాండ్స్ వచ్చాయి.

దేశంలోని బూర్జువా పార్టీలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వారిని చట్ట ప్రకారం వెంటనే శిక్షించాలని, మరణ శిక్ష వేయాలని ప్రజల్లో ప్రజాగ్రహం, భావోద్వేగాలు రెచ్చగొట్టింది. రాష్ట్ర ప్రభుత్వంపై రకరకాల వైఫల్యాలపై ఆరోపణలు చేసింది. దాని నుండి ప్రజల్లో భావోద్వేగాలు, ప్రజా ఆగ్రహాలు పెరిగిపోయాయి. ఎలక్ట్రానిక్ మీడియా విపరీతంగా రెచ్చగొట్టింది. ప్రభుత్వాన్ని, పోలీసులని నిందించడం పెద్ద ఎత్తున ప్రజాగ్రహం రావడం, భావోద్వేగాలు పెరిగిపోవడంతో దీన్ని చల్లార్చడానికి ప్రభుత్వానికి వేరే మార్గం కనిపించలేదు. ఈ సమస్య నుండి బయట పడడానికి ఒక పథకం ప్రకారం ఎన్‌కౌంటర్ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్, పోలీసు బాసును ఆదేశించాడు. దానితో దిశ ఘటన రీకన్‌స్ట్రక్షన్ కోసం చటాన్‌పల్లిలో వైద్యురాలి మృతదేహం లభ్యమైన ప్రదేశానికి నిందితులను తీసుకువెళ్లారు. నిందితులు పోలీసులపై దొరికిన కర్రలు, రాళ్ళతో దాడి చేశారని, తుపాకులు లాక్కొని పోలీసులపై కాల్పులు జరుపడంతో వెంటనే పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపితే ఆ కాల్పుల్లో నలుగురు నిందితులు మృతి చెందారని, ఎస్సై, కానిస్టేబుల్‌లకు గాయాలు అయినాయని ఎప్పటిలాగానే కట్టుకథలు అల్లినారు.

నలుగురు నిందితులకు బేడీలు వేసి చుట్టూ 20 మంది పోలీసులు సాయుధంగా (తుపాకులతో) ఉండగా నిందితులు కర్రలు, రాళ్ళతో ఎలా దాడి చేస్తారు? పోలీసుల తుపాకులు గుంజుకుని ఎలా కాల్పులు జరుపుతారు? ఇది పోలీసులు నలుగురు నిందితులని హత్య చేసి ప్రజలను నమ్మించడానికి వీరు శిక్షణపొంది ఉన్నారని, వారు ఎన్నో హత్యల్లో పాల్గొన్నారని నమ్మించడానికి ప్రయత్నించారు. నిజానికి ఇది బూటకపు ఎన్‌కౌంటర్‌రని అందరికి తెలిసిందే. కాని ఎవరు బూటకపు ఎన్‌కౌంటర్ అని సాహసించి చెప్పలేకపోయారు. కొంత మంది చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోరాదని, ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని అన్నారు. కొంత మంది ఇది ఎన్‌కౌంటర్లతో పరిష్కారం కాదని చెప్పారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, కేంద్ర మంత్రులు ఎమ్మేల్యేలు, బూర్జువా పార్టీలన్ని, వివిధ రకాల సంస్థలు, సినీనటులు ఈ ఎన్‌కౌంటర్‌ను సమర్థించారు.

బూటకపు ఎన్‌కౌంటర్లు చేయడం, హత్యలు చేయడం కొత్తేమి కాదు. గతంలో హైదరాబాద్ నగర శివారులో ఉన్న ఫామ్‌హౌజ్‌లలో దొంగతనాలకు పాల్పడినట్టు అభియోగాలు చేయబడి జైళ్ళో వున్న నిందితులను ఎస్‌పి సురేంద్రబాబు కష్టడి పేరుతో కోర్టు నుండి పరిమీషన్ తీసుకొని జైళ్ళో వున్న నిందితులను తీసుకువచ్చి కాల్చి చంపి ఎన్‌కౌంటరని కట్టు కథ అల్లారు. అలాగే వరంగల్ జిల్లా జైలు నుండి కోర్టు వాయిదాకు తీసుకువెళుతూ నల్గొండ దగ్గర వికారుద్దీన్‌తో పాటు 5గురిని పోలీసు వ్యాన్‌లో కాల్చిచంపి ఎప్పటిలాగానే ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లారు. అదే వరంగల్ జిల్లాలో మహిళాపై యాసిడ్ దాడి చేసిన నేరస్థులను పట్టుకుని కాల్చి చంపిన ఘనమైన చరిత్ర (సజ్జనార్) మన పోలీసులకు వున్నది.

పోలీసులంటే ప్రజలకు జవాబుదారిగా వుండాలి. కానీ ఈరోజు పోలీసు వ్యవస్థ మొత్తం దోపిడీ దారులకు అండగా వుంటూ ప్రజలపై స్వారీ చేస్తున్నది. దళారీ బడా బూర్జువా భూస్వామ్య దోపిడి పాలక వర్గాలు వాళ్ళ అధికారాలను కాపాడుకోవడం కోసం పోలీసులను కిరాయి నరహంతకులుగా మార్చి వేశారు. ఈ నరహంతకులు ప్రజలపై

దాడులు చేసిన, అరెస్టులు చేసిన, తప్పుడు కేసులు బనాయించిన, చిత్రహింసలు పెట్టిన, మహిళలపై అత్యాచారాలు చేసిన, ఎన్‌కౌంటర్ల పేర్లతో హత్యలు చేసిన, ఇలాంటి దుర్మార్గులను ఎవరు కూడా ప్రశ్నించకుండా వుండడానికే పోలీసు అనే లైసెన్స్ ఇచ్చి పెంచిపోషిస్తున్నారు. ఈరోజు పోలీసులంటే లైసెన్స్ కిరాయి నరహంతక ముఠాలు, రక్తం రుచి మరిగిన మానవ మృగాలు. ఈ పోలీసు మృగాల చేతులకు చట్టాన్ని అప్పగిస్తే మానవ మనుగడకే ప్రమాదం.

దేశ రాజధానిలో దేశం మొత్తంగా ఎస్సీ, ఎస్‌టీ, బిసి, మైనార్టీ మహిళలపై గ్రామాలలో, పట్టణాలలో, పరిశ్రమలలో పని స్థలాల్లో ప్రతి స్థలంలో లైంగిక వేదింపులు, అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలు చేసి హత్య చేయడం, పెట్రోలుపోసి కాల్చివేయడం నిత్యకృత్యం అయినాయి. ఇలా అగ్రవర్ణ భూస్వాములు, యాజమాన్యం, వారితొత్తులు, అధికారులు చేస్తున్నారు. జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలతో పాటు మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ జవాన్లు, పోలీసులు ఏపీలో గ్రేహౌండ్స్ పోలీసులు వాకపల్లి, భల్లుగూడలో ఆదివాసీలపై, మరియు అనేక ప్రాంతాలలో అత్యాచారాలు చేసి హత్యలు చేశారు. ప్రత్యూష, అమెషామీరాపై అత్యాచారం చేసిన వారు బడాబాబులు, రాజకీయ నాయకుల బిడ్డలే. రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపిలతో సహా పోలీసు అధికారులు ఐఎఎస్‌ల బిడ్డలు లైంగిక వేదింపులు, అత్యాచారాలు చేసి హత్యలు చేస్తున్నారు. కాని అవి బయటకు వచ్చేది నామమాత్రమే. ఈ మధ్య కాలంలో సైకో శ్రీనివాసరెడ్డి ముగ్గురు బాలికలను అత్యాచారాలు చేసి బావిలో పడవేశాడు. మతగురువులు ఎంతోమంది అత్యాచారం చేసి హత్య చేశారు. మరి వారిని ఎన్‌కౌంటర్ చేయగలరా? వారు ఎన్ని అత్యాచారాలు, హత్యలు చేసిన కేసులు నమోదు కావు. నమోదైతే వెంటనే విడుదల అవుతారు. లేదా శిక్షలు పడవు ఎందుకంటే రాజ్యం వారి చేతుల్లో ఉంది. అగ్రవర్ణాలకు ఒక న్యాయం, అణగారిన వర్గాలకు ఒక న్యాయం ఈ దేశంలో రాజ్యమేలుతుంది. అందుకే ప్రజలకు ఈ చట్టాలపై విశ్వాసాలు లేవు.

ఈ ఎన్‌కౌంటర్ జరిగిన వెంటనే ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని ప్రజాసంఘాలు, సంఘాలు, వివిధ సంస్థలు ఖండించాయి. జాతీయ మానవ హక్కుల సంఘం దీని విచారణను ప్రారంభించింది. హైకోర్టు ఎన్‌కౌంటర్ బాధితులను దహనం చేయవద్దని చెప్పింది. నలుగురు నిందితుల ఎన్‌కౌంటర్‌పై త్రిసభ్య కమీషన్ ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టులు, సుప్రీంకోర్టులు అన్నీ పాలక వర్గాలకు చుట్టాలే. కాబట్టి ప్రజలను వీటిద్వారా న్యాయం జరుగుతుందని ప్రజలను భ్రమింపజేయడం తప్ప మరేంకాదు. చరిత్రలో అణగారిన పీడిత వర్గాలవైపు చట్టాలు, కమీషన్‌లు ఒకటి కూడా పరిష్కరించలేదు.

ఈ రోజు యువత పెడమార్గం పట్టడానికి సామ్రాజ్యవాద, భూస్వామ్య విషసంస్కృతిని టీవిల ద్వారా, యూట్యూబ్, పేస్‌బుక్, సామాజిక మాద్యమాల పేరుతో రహస్యంగా అశ్లీల చిత్రాలను వీడియోలు తీయడం, వాట్సాఫ్, డార్క్‌నెట్, నింబూజ్, క్రోమ్, గూగుల్ ఇలా ఎన్నో రకాలుగా డౌన్‌లోడ్ చేసుకుని చూడడం చేస్తున్నారు. పట్టణాలలో పభ్‌లను ప్రోత్సహించి పెంచడం, రాష్ట్రంలో ఒక లక్ష పదమూడువేలు మద్యం బెల్టుషాపులు విపరీతంగా పెంచి యువతను మత్తులో ఉంచడం, డ్రగ్స్, గుట్కా, అంబార్, గంజాయి హెరాయిన్, బ్రౌన్‌షుగర్‌తో పాటు అన్ని రకాల మత్తు పదార్థాలను అమ్మడంతో యువత మత్తులో ఉంటూ పెడమార్గం పట్టి మహిళలపై విచ్చల విడిగా లైంగిక వేదింపులు, సామూహిక అత్యాచారం చేసి హత్య చేయడం, పెట్రోలుపోసి కాలబెట్టడం, మిస్సింగు కేసులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. నిర్భయ చట్టాలు చేసిన మహిళపై అత్యాచారాలు, హత్యలు ఆగలేదు.............దిశ బాధితులను ఎన్‌కౌంటర్ చేసినంత మాత్రాన ఇవి ఆగవు. అందుకోసం ఈ సామ్రాజ్యవాద విషసంస్కృతిని అడ్డుకోకుండా ఈ హత్యల నుండి మహిళలను కాపాడలేము. సామ్రాజ్యవాద, భూస్వామ్య వర్గాన్ని కూలదోసి, ఆ విషసంస్కృతికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాడి దాన్ని కూల్చివేయాలి. దాని స్థానంలో విప్లవ సంస్కృతిని నెలకొల్పాలి. ఇది నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిజం, కమ్యూనిజం ద్వారా పరిష్కారం అవుతుంది.

**దోపిడి సమాజాన్ని నిర్మూలించకుండా, నవ సమాజం నిర్మాణం చేయకుండా**

**హత్యాచార హంతకులను ఎన్‌కౌంటర్ హత్యలు చేసిన, ఉరిశిక్షలు విధించిన**

**మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఆపలేవు.**

# బీజేపి మోడీ ప్రభుత్వం దిశానుసారం ఏబివిపి గుండాలు జేఎన్‌యూ విద్యార్థులపై పథకం ప్రకారం కొనసాగించిన హింసాకాండను, ఆటవిక చర్యను ఖండించండి. ఇది విద్యార్థి సమాజంపై బీజేపి నియంతల సర్జికల్ స్ట్రైక్.

దేశ రాజధాని ఢిల్లీ నడిబొడ్డున వెయ్యి ఎకరాల సువిశాల స్థలంలో 1969లో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం స్థాపితమైంది. ఇది ప్రజాస్వామిక భావాలకు వేదిక కావడంతో పాలకవర్గాలకు కంటిగింపైంది. దీనితో ఏదో సాకు చూపి జేఎన్‌యూ విద్యార్థులపై నిరంతరం దాడులు, అరెస్టు చేస్తున్నారు.

హిందుత్వ ఏజెండాకు జేఎన్‌యూ విద్యార్థుల నుండి ప్రతిఘటన ఎదురవుతుడడం, హాస్టల్ ఫీజుల పెంపుపై 70 రోజులుగా జర్గుతున్న నిరసనలపై మోడీ ప్రభుత్వానికి, పచ్చి హిందుత్వ మతోన్మాది వీసీ జగదీశ్ కుమార్‌కు అసహనం కారణంగానే విద్యార్థులపై హింస కొనసాగింది. బీజేపి పెద్దలు, వీసీ జగదీశకుమార్ నాయకత్వంలో పక్కా ప్రణాళికతో జనవరి 5వ తారీఖు ఆదివారం రాత్రి ముసుగులు ధరించిన 50 మందికిపైగా ఆర్ఎస్ఎస్, ఏబీవీపి గుండాలు (మూక) వర్సిటీ ప్రాంగణంలోని శబర్మతి, మహిమాడ్వి, పెరియార్ హాస్టళ్ళలోకి చొరబడి లాఠీలు, రాడ్లు, సుత్తెలతో విధ్వంసం సృష్టించారు. విద్యార్థులపై, అధ్యాపకులపై విచక్షణా రహితంగా హింసాకాండకు పాల్పడి గాయపర్చారు. ఈ దాడిలో వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్ తల పగిలింది. మరో 35 మంది విద్యార్థులు తీవ్ర గాయాలపాలై ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇంకా హస్టళ్ళలోని ఫర్నీచర్, అద్దాలు పగులగొట్టి నాశనం చేశారు. ప్రణాళిక బద్దంగానే జేఎన్‌యూ క్యాంపస్‌ను ఆనుకొని ఉన్న బాబ గంగానాథ్ మార్గంలో రెండు కిలోమీటర్ల మేరకు వీధి దీపాలను ఆర్పివేసి దాడి పూర్తి చేసిన తర్వాతనే మూకలు క్యాంపస్ నుంచి వెళ్ళిపోయిన తర్వాతనే లైట్లు వెలిగించారు. పోలీసుల రక్షణలోనే, సమక్షంలోనే జేఎన్‌యూ కుడి ప్రధాన ద్వారం నుంచి క్యాంపస్‌లోకి పోయి హింసాకాండ కొనసాగించారు. ఇది విద్యార్థి సమాజంపై బీజేపీ హిందుత్వవాద నియంతలు కొనసాగించిన సర్జికల్ స్ట్రైక్‌గా చరిత్రలో నిలిచపోయింది. జేఎన్‌యూ విద్యార్థినుల ఆర్తనాదాలు మోడీ ప్రభుత్వానికి పట్టలేదు. ఆనందాన్ని కలిగించాయి.



గాయపడిన జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు ఘోష్; హాస్టల్‌లో విధ్వంసం

హెచ్‌సీయూ, ఓయూ, బెంగుళూర్, అలీగడ్, బీహెచ్‌సియూ, ఢిల్లీ, పూనెలోని సావిత్రిభాయి పూలే, ముంబాయి టిస్, కోల్‌కత్తా ప్రెసిడెన్సీ వర్సిటీల్లో కోల్‌కత్తా, ముంబాయి, ఐఐటీ విద్యార్థులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు నిరసన తెలిపారు. జేఎన్‌యూ ఘటన భయానకం, ఆటవికం అంటూ సినీనటులు, ఖండిస్తూ ఇలాంటి వాళ్ళను ఉపేక్షించరాదని, తగిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాలు, సామాజిక వేత్తలు పెద్ద ఎత్తున ఢిల్లీలో ర్యాలీ చేపట్టారు. దీనితో పోలీసులు పెద్ద ఎత్తున లాఠీ చార్జీ చేశారు. వందలాది మందిని అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దాడికి కుట్రదారుడైన వీసీ జగదీష్ కుమార్‌ను తొలగించే వరకు రాజీపడేది లేదని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

జేఎన్‌యూ, జామియా విద్యార్థులకు సంఘీభావంగా సిఏఏ, ఎన్నార్సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా వందలాది మంది ఢిల్లీలోని జామా మసీదు ఎదుట పోస్టర్లు చేతబూని క్యాండిల్ లైట్ ప్రదర్శన నిర్వహించారు. జేఎన్‌యూలో దాడికి సరైన విద్యార్థులను పరామర్శించిన బాలివుడ్ తారా దీపికా పడ్‌కోనేపై బీజేపీ మోడీ ప్రభుత్వం కన్నెర్ర జేసింది. దీపిక చిత్రీకరించిన ప్రమోషన్ చపాక్ సినిమా విడుదలను నైపుణ్య అభివృద్ధి మంత్రిత్వశాఖ నిలిపివేసింది. మోడీ బీజేపీ సర్కారుకు వత్తాసు పలికినంత కాలం దేశభక్తురాలిగా కనిపించిన దీపిక జేఎన్‌యూను సందర్శించగానే దేశ ద్రోహిగా మారిపోయింది.

హింసకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీలోని సభర్మతి హాస్టల్ వార్డెన్లు రామావతార్‌మీనా, ప్రకాశ్‌చంద్ర సాహూ రాజీనామాలు చేశారు. దాడికి గురైన విద్యార్థులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. పైగా దాడులకు గురైనా విద్యార్థులనే దోషులుగా బిజెపి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్న పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. దాడికి గురైన వారంత వామపక్ష భావాలు

కల్గిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కాని జెఎన్‌యులో జరిగిన హింస వామపక్ష ఉగ్రవాద విద్యార్థుల కుట్రేనని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తప్పుదోవ పట్టిస్తున్నాడు. ఐషేఘోష్ తనను తాను గాయపర్చుకున్నదని దాడిచేసిన ఎబివిపి అధ్యక్షుడు దుర్గేష్ దొంగే దొంగ దొంగ అనీ అరుస్తున్నాడు.

తొలుత జామియా మిలియా యూనివర్సిటీలో పోలీసులు చొరబడి దాడులు, విధ్వంసాలు చేశారు. ఇప్పుడు జెఎన్‌యులో పోలీసులు నిలబడి ముసుగు మూకలకు అండగా ఉండి హింసకు, విధ్వంసానికి పాల్పడ్డారు. రెండుచోట్ల పోలీసులు మూక దొంగలైన ఆర్‌ఎస్‌ఎస్ హిందుత్వ వాదుల కొమ్ము కాశారు. తామే ఈ దాడికి పాల్పడినట్లుగా హిందూ రక్షక్‌దళ్ అధ్యక్షుడు పింకి చౌదరి ప్రకటించినప్పటికీ కేసు నమోదు చేయకపోవడం మోడీ ప్రభుత్వ, పోలీసుల పక్షపాత బుద్ధికి, కుట్రకు నిదర్శనం. ఇది ఆటవికం, అన్యాయం ఎముకలు కుళ్ళిన శరీరంతో ఉన్న హిందుత్వ వాదులు హిందుత్వ జాతీయ అహంకారాన్ని, హిందూ రాజ్యాన్ని నెల కొల్పడానికి బహిరంగగానే ఆటవిక దాడులకు పాల్పడుతున్నారు. యూనివర్సిటీలలో లౌకికవాదాన్ని, శాస్త్రీయ విధానాన్ని నాశనం చేసి, హిందుత్వ జాతీయ అహంకారాన్ని అంధ విశ్వాసాలను నెలకొల్పడానికి పూనుకున్నారు. యూనివర్సిటీలలో వామపక్షాలు, ముస్లిం తీవ్రవాదుల పేర్లతో దాడులు కొనసాగిస్తున్నారు. విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారు. ఇలా పీడిత వర్గాల ప్రజలపై శాస్త్రీయ భావాలు కల్గిన వాళ్ళపై దాడులు, హత్యలు కొనసాగిస్తూ అరాచకత్వాన్ని ప్రేరేపిస్తున్నారు. నేడు దేశంలో అరాచకత్వానికి మారు పేరుగా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నిలిచిపోయింది. దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగ సమస్య, యూనివర్సిటీలలో చోటు చేసుకొంటున్న హింసాత్మక ఘటనల పరిష్కారంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

ఈ దాడిని ఢిల్లీలో జర్గబోతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెల్వడానికి కేజ్రీవాల్ చేతగాని తనానికి నిదర్శనంగా చూపిస్తూ కేజ్రీవాల్‌ను అప్రతిష్ఠ పాలు చేస్తూ మోడీ అమిత్‌షాలు ఎన్నికల వ్యూహం కూడా పన్నారు. కానీ వాళ్ళ వక్రబుద్ధి బహిర్గతమైపోయింది.

యూనివర్సిటీలు భావాల సంఘర్షణకు వేదికలవ్వాలి, కానీ భౌతిక ఘర్షణలకు కాదు. విభిన్న భావజాలాల్ని ఆహ్వానించినప్పుడే సమాజానికి మెరుగైన దారులు కనబడతాయి. ఎంతో మంది మేధావుల్ని అందిస్తున్న ఉన్నత విద్యాలయాలు భయం నీడన ఉండాల్సిన పరిస్థితి రావడం దేశానికి మంచిది కాదు.

యూనివర్సిటీలు యుద్ధ రంగాలు కారాదు. ముసుగులు వేసుకున్న అరాచక శక్తులు విద్యార్థులు, అధ్యాపకులపై విచ్చలవిడిగా హింసకు తెగబడడం దేశ చరిత్రలో మాయనిమచ్చ. ఈ మధ్య కాలంలో యూనివర్సిటీలు మూకదాడులకు, ముసుగు దాడులకు వేధికలుగా మారడం విద్యారంగానికి తీరని నష్టం. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. లేదా ప్రజలే తప్పకుండా ప్రజాకోర్టులో శిక్షలు విధిస్తారు.

---

**(40వ పేజీ తరువాయి)......**

సంఘటితమైన వందలాది యువతీ, యువకులకు ప్రేరణ కల్పించి పీఎల్‌జీఏలోకి రిక్రూట్ చేసి పీఎల్‌జీఏ ఫార్మేషన్స్‌ను పెంచడం, బలోపేతం చేయడంలో ప్రధాన భూమిక నిర్వహించాడు. భారత దోపిడీ పాలకవర్గాలు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ఎల్ఐసీ వ్యూహంతో దఫదఫాలు కొనసాగిస్తూ వస్తున్న బహుముఖ అణచివేత క్యాంపెయిన్లలో భాగంగా బూటకపు సంస్కరణలను, మానసిక యుద్ధాన్ని, బూటకపు సరెండర్ పాలసీని తిప్పికొట్టడంలో, ఇన్‌ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను పసిగట్టి దెబ్బతీయడంలో, ప్రజా ఇంటెలిజెన్స్ వ్యవస్థను నిర్మించి శత్రు దాడులను తిప్పికొట్టడంలో ముందున్నాడు. 1987లో కుర్నపల్లి, 1992లో లింగాన్‌పల్లి ఆంబుష్‌ల నుండి మొదలుకొని ఉర్పల్‌మెట్ట, తాడిమెట్ల, తోంగూడ, భట్టిగూడ, సింగన్‌మడుగు, ముకరం, కసల్‌పాడ్, 2018లో ఏలాడ్‌మడుగు, కాసారం, 2019లో కొండసావలి, కేశ్‌కుతుల్ ఆంబుష్‌లు, కలిమెల, బైలడిల్లా రెయిడ్ల వరకు ప్రత్యక్ష-పరోక్ష నాయకత్వం వహించి గెరిల్లా యుద్ధం తీవ్రతరం చేయడంలో, ప్రత్యేకించి మొబైల్ యుద్ధ లక్షణాలు కలిగిన ముకరం ఆంబుష్‌కు, రాణిబోదిలీ రెయిడ్‌కు రూపకల్పన చేయడంలో, శత్రు బలగాల నుంచి పెద్దెత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకొని పీఎల్‌జీఏను సాయుధం చేయడంలో, దాని పోరాట సామర్థ్యాన్ని పెంచడంలో ప్రముఖ పాత్ర వహించాడు. 2011 అక్టోబర్‌లో జరిగిన డీకే ప్లీనం దండకారణ్య విప్లవోద్యమం గడ్డు పరిస్థితుల్లో ఉందని అంచనా వేసింది. ఈ గడ్డుస్థితిలో సైతం ఎటువంటి శషబిషలకు తావులేకుండా డీకే ఎస్‌జడ్‌సీ కార్యదర్శి బాధ్యతలు చేపట్టి ఉద్యమాన్ని పురోగమింపజేసేందుకు కృషి చేసాడు.

కామ్రేడ్ రామన్నలోని విప్లవతత్వం, సాహసం, సాదాసీదా-కఠిన జీవనశైలి కమ్యూనిస్టు విప్లవకారులకు, గెరిల్లాలకు ఆదర్శనీయం. ఉద్యమంలోని ప్రతి మలుపులో ఆయన ప్రజలతో, కేడర్లతో మమేకమవుతూ వచ్చాడు. వారిలో రాజకీయ చైతన్యాన్ని కలిగిస్తూ, వర్గకసిని రేకెత్తిస్తూ పార్టీని, పీఎల్‌జీఏని, విప్లవకర ఐక్యసంఘటనను అభివృద్ధి చేస్తూ ప్రజా ప్రతిఘటనను, గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో దూరదృష్టితో ఆయన చేసిన కృషి నుంచి కామ్రేడ్స్ అందరూ నేర్చుకోవాలి. కార్మికవర్గ పుత్రుడిగా, మంచి కమ్యూనిస్టుగా దృఢంగా నిలబడుతూ, నాయకత్వాన్ని అందిస్తూ పలాయనవాదాన్ని, సరెండర్లను అసహ్యించుకుంటూ, వాటికి వ్యతిరేకంగా పార్టీ కేడర్ల, ప్రజల చైతన్యాన్ని పెంపొందించాడు. ఆయన నిలబెట్టిన ఈ విప్లవ ఆదర్శాలు విప్లవోద్యమానికి సదా ప్రేరణను అందిస్తూనే ఉంటాయి.

ప్రియమైన కామ్రేడ్స్, పీడిత ప్రజలారా! భారత ప్రజల ప్రియతమ నాయకుడు, యోధుడు, అమరుడు కామ్రేడ్ రావుల శ్రీనివాస్‌కు ఘనంగా నివాళులర్పించండి! స్ఫూర్తిదాయకమైన ఆయన ఆదర్శాలను ప్రజలలో ఎత్తిపట్టండి! ఆయనలేని లోటు తీర్చడానికి దృఢసంకల్పంతో ముందుకురండి! దేశవ్యాప్తంగా ప్రత్యేకించి దండకారణ్య వ్యాప్తంగా అన్ని డివిజన్లలో గ్రామగ్రామాన అమరుడు కామ్రేడ్ రామన్న సంస్మరణ సభలు పెద్దెత్తున జరపండి! విప్లవోద్యమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన విప్లవ ప్రతీఘాతుక 'సమాధాన్' వ్యూహాత్మక దాడిని దీర్ఘకాల ప్రజాయుద్ధం పురోగమింపజేయడం ద్వారా ఓడిస్తామని నినదించండి! వేలాది అమరులు కన్నకలల్ని సాకారం చేయడానికి భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, అంతిమంగా సోషలిజాన్ని-కమ్యూనిజాన్ని విజయవంతం చేస్తామని చాటిచెప్పండి!

సిద్ధాంత వ్యాసం

# ఒకరి నుండి మరొకరు నేర్చుకోవాలి

## ఆత్మతృప్తితో పెరిగే అలక్ష్యాన్ని అహంభావాన్ని అధిగమించాలి.

**కా॥ మావో**

ఆత్మసంతృప్తి, అహంభావానికి లోనవడమూ, మార్క్సిస్టు గతితార్కిక విశ్లేషణా పద్ధతిని, అంటే, ఒకటి రెండుగా (విజయాలు, లోపాలుగా) విభజించి చూసే పద్ధతిని ఉపయోగించడానికి నిరాకరించడమూ, కేవలం తన రంగానికి మాత్రమే పరిమితమైపోయి పనిచేయడమూ, విజయాలను మాత్రమే అధ్యయనం చేస్తూ, లోటుపాట్లను కానీ తప్పుల్నిగానీ అధ్యయనం చేయకపోవటమూ, పొగడ్తలను కోరుకోవడం, విమర్శలను సహించలేకపోవడమూ ఇతర రాష్ట్రాలు, నగరాలే, ప్రాంతాల లేదా విభాగాల పనిని పరిశోధించి, దాని నుండి నేర్చుకుని, ఆ ఫలితాలను, తమ పరిస్థితులను మెరుగుపర్చుకునేందుకు, తమ రాష్ట్రం, ప్రాంతం, నగరం లేదా విభాగపు పనిని మెరుగుపర్చుకునేందుకు వినియోగపెట్టుకోవడంలో, సమర్థులైన పైస్థాయి మధ్యస్థ స్థాయిల కేడర్లను సంఘటితపర్చడం పట్ల ఏ మాత్రం శ్రద్ధ కనబర్చకపోవడమూ, గుడ్డి అహంభావంతో మెసలడం, అంటే తన స్వంత జిల్లా లేదా స్వంత డిపార్ట్‌మెంట్స్ అనే చిరు ప్రపంచానికి పరిమితమైపోవడమూ, తన పరిధిని విస్తృతపర్చుకునే సామర్థ్యం లోపించడమూ, ఇతర కార్యరంగాల గురించి అజ్ఞానంతో ఉండడమూ, విదేశీయులకూ, ఇతర తావుల నుండి వచ్చిన సందర్శకులకూ, కేంద్రం పంపేవారికి, తన కార్యరంగంలోని విజయాలను గురించి మాత్రమే తెలియజెప్పి, వాటి గురించే మాట్లాడి, బలహీనతల విషయంలో మౌనం వహించడమూ, సారంలేని సొల్లు కబుర్లు చెప్పడం, మొక్కుబడిగా (పెర్ఫంక్టోర్లి) మాట్లాడడం (మన కామ్రేడ్స్ అందరిలోను ఈ లోపాలు వున్నాయి). కేంద్ర కమిటీ ఈ సమస్యను మన కామ్రేడ్స్ దృష్టికి పలుమార్లు తెచ్చింది. ప్రతి కమ్యూనిస్టూ, 'ఒకటిని రెండుగా' విజయాలు, లోపాలు, నిజాలు, తప్పులుగా విభజించి చూసే మార్క్సిస్టు గతితార్కిక పద్ధతికి సదా అంటిపెట్టుకుని ఉండాలి. అన్ని విషయాలు (ఆర్థికంగా, రాజకీయ, సిద్ధాంత, సాంస్కృతిక, సైనిక, పార్టీ వగైరా) నిరంతరమూ ఒక అభివృద్ధి క్రమంలోనే వుంటాయి. ఇది మార్క్సిస్టులకుండే సాధారణ అవగాహన. అయితే కేంద్రంలోని, ప్రాంతాలలోని అనేక మంది కామ్రేడ్స్ ఈ ఆలోచనా పద్ధతిని, ఈ పని పద్ధతిని వాడరు. వారి బుర్రలో లాంఛనతర్కం (ఫార్మల్ లాజిక్) బలంగా నాటుకుని వుంది. వారు దాన్ని వొదిలించుకోలేక పోతున్నారు. లాంచనతర్కం, విషయంలోని విరుద్ధాంశాల ఐక్యతనూ, విరుద్ధాంశాల జత, మరో దానిగా రూపాంతరం చెందుతుంది అనేదాన్ని నిరాకరిస్తుంది. అందుచేతనే ఈ కామ్రేడ్స్ ఆత్మసంతృప్తిపరులూ, అహంభావులూ అవుతారు. విజయాలను మాత్రమే చూస్తూ, బలహీనతల పట్ల అంధులవుతారు. తమకు వినసొంపుగా వుండే విషయాలను మాత్రమే వినగల్గుతారు, విమర్శలను భరించలేరు. తమల్ని తాము విమర్శించుకోడానికి (అంటే ఒకటిని రెండుగా విభజించి చూడడానికి) ఇష్టపడరు. ఇతరుల విమర్శలకూ భయపడతారు. 'అహంకారం ప్రమాదకారి, వినయం ప్రయోజనకారి' అనే పాత నానుడి (శ్రామిక వర్గ ప్రయోజనాల దృష్ట్యానూ, ప్రజా ప్రయోజనాల దృష్ట్యానూ, కూడా) ఇప్పటికీ వర్తించే నానుడే.



1. అహంభావం అనేది, అన్ని పరిస్థితులలోనూ, అన్ని రూపాలలోనూ పెరుగుతుంది. సాధారణంగా అది, విజయంతోనూ, గెలుపుతోనూ పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏమంటే, ప్రతికూల పరిస్థితులలో తన బలహీనతలను ఎవరైనా తేలిగ్గానే గమనించగలరు. అందువల్ల సాపేక్షికంగా కొంత జాగ్రత్తగా మెసులుకుంటారు. ఇబ్బందులు చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తునప్పుడు వినయం, ఆచితూచి అడుగు వేయడం అనేవే అవలంభించాల్సిన వైఖరులు. అయితే విజయంతోపాటు ఇతరుల కృతజ్ఞతలు కూడా వస్తాయి. ఒకప్పటి శత్రువు కూడా మనసు మార్చుకుని ఒక వ్యక్తిని (అతని శక్తి సామర్థ్యాలను) కీర్తించవచ్చు. అందుచేత విజయం తర్వాత అనుకూల పరిస్థితులలో ఎవరికైనా సులువుగానే బుర్రకు కిర్రెక్కవచ్చు. అతడు గాలిలో స్వారీ చేయవచ్చు. 'ఇక నుంచి రాజ్యం అంతా ప్రశాంతంగా ఉంటుంది' అని విశ్వసించవచ్చు. విజయం, సఫలత లభించిన సందర్భాలలో పార్టీ, అహంకారమనే విషక్రిమి వాతానికి గురయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయన్న విషయం

మనందరికీ బాగానే తెలుసు.

2. అహంకారం విజయం సిద్ధించిన పరిస్థితులలో పెరుగుతుంది-అంటే, బుర్రకు కిర్రెక్కడం, అహంకారంతో ఉబ్బితబ్బిబ్బు అవడం అనేవి అహంభావ లక్షణాలు. ఇది ఒక రకం అహంభావం. సాధారణ పరిస్థితులలో పెరిగే మరో రకం అహంభావం వుంది. ఎటువంటి బ్రహ్మాండమైన విజయంగానీ, లేదా తలవొంపులుతెచ్చే ఘోర ఓటమి కానీ లేనప్పుడు 'అంత శ్రేష్ఠుడిని ఏమి కాకపోయినప్పటికీ, దద్దమ్మకంటే నేను నయమే కదా', 'ఇరవైయేళ్ళ కోడరికం, ఆ కోడల్ని సహజసిద్ధంగా అత్తను చేస్తుంది' వంటి ఆలోచనలతో మెదడుకు మత్తెక్కినప్పుడు ఇది పెరుగుతుంది.

వెనకబడిన పరిస్థితుల్లో వికసించే మూడవ రకం అహంభావం వుంది. 'మా పని అంతబాగా ఏమీ లేనప్పటికీ గతంలో కంటే మెరుగ్గానే వుంది కదా' అనిగానీ 'ఫలానా, ఫలానావాడు మనకంటే మరీ అధ్వాన్నం కదా' అనిగానీ కొందరు ఆలోచిస్తూ, అందుమూలంగా తమ వెనుకబాటుతనాన్ని గురించి గర్వపడుతుంటారు. ఇక వారు తమ విషయాలన్నిటినీ వెంటనే పక్కకు పెట్టేస్తారు. వారి మొఖాలు వెలిగిపోతాయి. ఇక వారు 'ఒకప్పుడేం జరిగిందంటే' అని మొదలెడతారు.

3. మనం ఎప్పుడైతే ప్రజారాశుల బలాన్ని చిన్నచూపు చూస్తామో, ఎప్పుడైతే మన స్వీయమానసిక అవగాహన భౌతిక వాస్తవికతాభివృద్ధికంటే వెనకబడుతుందో, మన స్వీయ సాఫల్యతల గురించి ఎప్పుడైతే మనం అంచనా వేసుకుంటామో, అప్పటి నుంచే మనం అహంభావులవుతాము.

4. అహంభావం, ప్రధానంగా వ్యక్తిత్వం (ఇండివిద్యువలిజం) నుండి పుట్టుకొస్తుంది, వ్యక్తిత్వాన్ని పెంచి పోషిస్తుంది.

5. వర్గ విశ్లేషణా దృష్టి నుండి చెప్పాలంటే, అది మొదటగా దోపిడీ వర్గ భావాజాలం నుండి, అటుపిమ్మట చిన్నపాటి ఉత్పత్తిదారుల భావాజాలం నుండి ఉత్పన్నమవుతుంది.

6. చిన్నపాటి ఉత్పత్తిదారులకు శ్రామికులుగా అనేక సద్గుణాలు ఉన్నాయి. వారు కష్టించి పని చేస్తారు. పొదుపుగా వుంటారు. కష్టాల కడగండ్లకు భయపడరు. వాస్తవాత్మకంగా వుంటారు. ఆచితూచి అడుగు వేస్తారు. అయితే, చిన్నపాటి యజమానులుగా వారు, వ్యక్తిత్వ పోకడలతో వుంటారు. అంతకంటే ముఖ్యంగా, వారి పని పరిస్థితులూ పద్ధతులూ వారు వాడే కాలం చెల్లిన ఉత్పత్తి సాధనాల మూలంగా పరిమితికిలోనై వారు చెల్లాచెదురుగా విస్తరించి వుండి సంకుచిత మనస్తత్వంతో వుంటారు. విషయపరిజ్ఞానం కొరవడి వుంటారు. వారు తరచుగా సమిష్టికి వుండే బలాన్ని చూడలేరు. ఒక చిన్న సాఫల్యత వారిలో 'ఇది ఫరవాలేదు', 'ఇది బ్రహ్మాండంగా వుందే', 'కొంచెం మజా చేద్దాం', 'అంత శ్రేష్ఠుడినేమీ కాకపోయినప్పటికీ దద్దమ్మకంటే నయమే కదా' వంటి ఆలోచనలు రేకెత్తిస్తుంది.

7. అహంభావానికి బూర్జువా, భావవాద ప్రాపంచిక దృక్పథమే పునాది. అది మనల్ని వాస్తవాభివృద్ధి నియామకాలకు వ్యతిరేకంగా వాస్తవంతో వ్యవహరించచేటట్లు చేయగలరు. అంతిమంగా వైఫల్యానికి దారి తీసేటట్టు చేయగలదు. సామాజికాభివృద్ధి చరిత్ర బడానాయకుల చరిత్ర కాదనీ, శ్రమజీవి ప్రజానీకపు చరిత్రేననీ, భౌతికవాద చారిత్రక దృక్పథం తెలియచెబుతోంది. అయినాగానీ, అహంభావులు వ్యక్తుల పాత్రను గోరంతల్ని కొండంతలు చేస్తారు, అనవసరమైన గొప్పల్ని ఆపాదించుకుంటారు, తమన్ని చూసి తామే ఉబ్బి పోతుంటారు. వారు ప్రజల బలాన్ని తక్కువగా అంచనా వేస్తారు, లేదా అసలు దాన్ని గమనించనే గమనించరు.

8. అందుచేత అహంభావం మార్క్సిజం-లెనినిజానికి వ్యతిరేకమైనది. మన పార్టీ తాలుకు గతాతార్కిక, చారిత్రిక, భౌతికవాద ప్రాపంచిక దృక్పథానికి విరుద్ధమైనది.

9. అహంకారులు తమ గొప్పల్ని మరువలేరు. తమ లోపాల్ని కప్పిపుచ్చుతారు, ఇతరులలోని మంచి లక్షణాలను అసలు లెక్కలోకి తీసుకొరు, వారు తరచుగా తమ గొప్పల్ని ఇతరుల లోపాలతో పోల్చి చూసుకుంటూ ఆవిధంగా సంతృప్తి పడుతుంటారు. ఇతరులలోని మంచి లక్షణాలు వారి దృష్టికి వచ్చినప్పుడు వారు 'ఆ! పెద్దగా ఏం వున్నాయట' అనీ, 'అంత సంబరపడాల్సిందేమీ లేదు' అనీ అంటుంటారు.

10. వాస్తవానికి, ఎవరైనా తన గురించి ఎంత ఎక్కువగా అంచనా వేసుకుంటే, ఫలితంగా అంతకంత ఘోరంగా వుంటుంది. రష్యా మహా రచయిత టాల్‌స్టాయ్ ఈ విషయాన్ని గురించి చమత్కార పూర్వకంగా ఇలా వ్రాశారు. మనిషిని గణితశాస్త్రంలోని భిన్నం (ఫ్రాక్షన్)తో పోల్చవచ్చు. అతడి నిజ ప్రతిభను ఆ భిన్నం తాలూకు లవంతోనూ, దాన్ని గురించిన అతడి స్వీయ అంచనాను హారంతోనూ పోల్చవచ్చు. హారం ఎంత పెద్దదైతే భిన్నం అంత చిన్నదవుతుంది.

11. వినయం అనేది ప్రతి విప్లవకారుడికి తప్పనిసరిగా వుండాల్సిన ఒక మంచి లక్షణం. అది ప్రజల ఆశయానికి మేలు చేస్తుంది. కాగా, అహంభావం ప్రజల ఆశయపు ఓటమికి బాట వేస్తుంది. అందుచేత వినయం అనేది ప్రజల ఆశయం పట్ల ఒక వ్యక్తి తాలూకు బాధ్యతను సూచించే ఒక వ్యక్తీకరణ.

12. మనసా వాచా విప్లవకారుడైనవాడు ఈ క్రింది వాటిని తప్పనిసరిగా నిర్వర్తించగల్గి వుండాలి.

మొదటిది: ప్రజల సృజనాత్మకశక్తి పట్ల గౌరవం చూపాలి. వారి అభిప్రాయాలను జాగ్రత్తగా వినాలి. వారిలో ఒకడిగా మసలుకోవాలి. అతడికి ఆవగింజంత స్వార్థం కూడా వుండకూడదు. తన పాత్రను ఎక్కువచేసి చూడకూడదు. ప్రజల కోసం నిజాయితీగా పని చేయాలి. లూషన్ చైతన్యాన్ని గురించి ఇలా వివరించారు. 'నేను ప్రజల కోసం తలవొంచి ఒక ఎద్దులా సేవ చేస్తాను', వినయం అంటే అదే.

రెండవది: అతడికి అలసటే తెలియని పురోగామితత్వం తప్పనిసరిగా వుండాలి. అతడు నిరంతరం జాగరుకంగానూ స్పష్టమనస్కంగానూ వుండాలి. అతడు తప్పనిసరిగా కొత్త విషయాలను

బాగా గమనించాలి, వాటిని పరిశీలించాలి. అందుచేత అతడు అనావశ్యకమైన దుర్లక్షణాలను పోగుచేసుకోకుండా వుంటూ, తన విజయాలతోనే సంతృప్తి పడిపోయేటట్టుగాక వినయం వుండాలి. ఇది వాస్తవ వైఖరి, ఇది వినయం అనే మహత్తర గుణం.

13. ఒక మనిషి, పని నుండి, వాస్తవ పోరాటాల నుండి శ్రద్ధగా నేర్చుకోగల్గితే, తన లోటుపాట్లను లొసుగుల్ని పొరపాట్లను కనుగొనే దృష్టిలో భాగంగా, తన ఆలోచనలనూ కార్యాచరణనూ నిరంతరం మదింపు వేసుకోగలిగితే, అతడు తన అహంకార ఆత్మసంతృప్తి వైఖరులకు వ్యతిరేకంగా నిర్దాక్షిణ్యంగా నిశ్చయాత్మకంగా పోరాడి, ఎటువంటి తటపటాయింపులకూ లోనవకుండా వాటిని అధిగమించగలిగితే, ఒక వినమ్ర మానవుడిగా తనని తాను తీర్చిదిద్దుకోవడం అతడికి ఖచ్చితంగా అతి సుసాధ్యమవుతుంది.

14. నిజంగానే వినయంగల మనిషి పార్టీ కోసం, ప్రజల కోసం, సమిష్టి ఆశయం కోసం సమధికోత్సాహంతోనూ ఎటువంటి తటపటాయింపులూ లేకుండానూ అంకిత భావంతోనూ క్రియాశీలంగానూ పని చేసే మనిషి అవుతాడు. అతడు తన గొప్పను ప్రదర్శించుకోవడం కోసమో లేదా పేరు ప్రఖ్యాతులు బహుమతుల సముపార్జన కోసమో లేదా ఏదో స్వార్ధ ప్రయోజనం కోసమో పనిచేయడు. ప్రజల సుఖసంతోషాల కోసం వారి ప్రయోజనాల కోసం హృదయపూర్వకంగా కృషి చేస్తాడు. అందుచేతనే అతడు తన ప్రతిభకు గుర్తింపు, తన హోదా, పేరు ప్రఖ్యాతుల సముపార్జన లేదా జీతభత్యాల వంటి విషయాలకు తన బుర్రలో అసలు తావే ఇవ్వకుండా, పార్టీకీ ప్రజలకూ ప్రయోజనకారి అయిన కృషిలో క్షణం తీరికలేకుండా సదా నిమగ్నుడై వుంటాడు. తన విజయాల గురించి ఇతరులతో ఏకరువు పెట్టడు. అసలు అటువంటి ఆలోచనే బుర్రలోకి రానివ్వడు. ప్రజలకు ఇంతకంటే మిన్నగా ఎలా సేవ చేయాలి అనే విషయం గురించి తప్ప మరో విషయాన్ని గురించి ఆలోచించడు.

15. ఇక సిసలైన సమిష్టితత్వవాది, తను వినయంగా వుండాలని ఎందుకు కోరుకోవాలి? ఎందుచేతనంటే:

మొదటిది, విజ్ఞానాన్నిగానీ, ఇతర ఫలితాలనుగానీ సాధించడంలో తాను ఒక పాత్రను నిర్వహించినప్పటికీ అందులో ప్రజల పాత్ర మరింత పెద్దదని అతడు అవగతం చేసుకుంటాడు. ప్రజల అండదండలు లేనపుడు అతడికి విజ్ఞానము దక్కదు, అతడి పని సఫలమూ కాదు. సమిష్టితత్వవాదిగా అతడు ప్రజల గొప్పతనాన్ని తోసి రాజనకూడదు లేదా 'ప్రజల విజయాలను వారి నుంచి దొంగిలించకూడదు', అహంభావంతో వుండడం సిగ్గుచేటైన విషయమని అతడికి తెలుసు.

రెండవది: తాను నేర్చుకున్నదిగానీ తన స్వీయకృషిగానీ విప్లవ విజ్ఞానం, కృషి అనే మహాసముద్రంలో ఒక చిన్న నీటి చుక్కేననీ అణు ప్రమాణమైనదనీ అతడికి తెలుసు. అంతేకాదు విప్లవ విజ్ఞానం, కృషి నిరంతరాయంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఒక సమిష్టి తత్వవాదిగా అతడు ప్రజలకు ఉపయోగకరంగా వుండే విజ్ఞానాన్ని సంతరించుకోవడానికీ, తన యావత్ సామర్థ్యాన్ని విప్లవానికి అంకితం చేయడానికీ శాయశక్తులా పాటుపడాలి. అందుచేత, ఆత్మసంతృప్తితో వుండడానికిగానీ, ఎదుగుబొదుగూ లేకుండా గిడసబారిపోవడానికిగానీ ఏమాత్రం సందులేదని అతడు భావించాలి.

మూడవది, పని అనేది చక్రాలు, సీలలు, ఉక్కు చట్రాలు, రకరకాల సైజుల్లోని ఇతర భాగాలతో కూడుకుని వుండే ఒక భారీ యంత్రంలాంటిదనీ, అందులోని ఏ ఒక్క భాగాన్ని వేరుచేసి పక్కన పడవేయలేమనీ అతడికి తెలుసు. ఒక సమిష్టి తత్వవాదిగా అతడు ప్రతిఒక్కరి పనిని ప్రతిఒక్కరి సాఫల్యాలను గౌరవించాలి. విప్లవ కృషిని సర్వాంగ పరిపుష్టంగా చేయడానికి అతడు తన పనిని ఇతరుల పనితో సమన్వయించుకోవాలి. సమిష్టి నుండి విడిగా మనజాలనని అతడు భావించాలి. తన సహచరులను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించాలి. ఇందువల్ల అతడు ఇతరులపట్ల వినయంగా ప్రవర్తించాలి. గర్వంతోగానీ అహంభావంతోగానీ ప్రవర్తించరాదు.

నాలుగవది, వ్యక్తి దృక్పథం సంకుచితమైనదీ పరిమితమైనదీ కాగా, విప్లవ కృషి విజ్ఞానాల పరిధి చాలా సువిశాలమనీ వాటి సారం సుసంపన్నమూ సంక్లిష్టమూ అనీ అతడు అవగతం చేసుకున్నాడు. ఆ విధంగా వ్యక్తికి లొసుగులు, అనివార్యమనీ తప్పులు చేసే అవకాశం బాగా వుంటుందనీ అతడికి అర్ధమవుతుంది. ఈ లొసుగులు, తప్పులు తరచుగా అతడి దృష్టిలో రావు. అయితే, అతడో సమిష్టి తత్వవాది కనుక విప్లవ కృషిని సమర్ధవంతంగా నిర్వహించి ప్రజల పట్ల బాధ్యతతో మెలగడానికిగానూ, తన లోపాలూ తప్పులనూ సకాలంలో కనుగొని వాటిని త్వరితంగా సరిదిద్దుకోవడానికై మరింత లోతైన అవగాహనను పెంపొందించుకోవడానికి కృషి చేస్తాడు. ఇందుమూలంగా అతడు వినయంగా వుంటాడు. నమ్రతతో ఇతరుల నుండి నేర్చుకుంటూ ఇతరుల విమర్శలను నిజాయితీగా ఆహ్వానిస్తాడు.

ఒక నిజమైన సమిష్టి తత్వవాదికి వినయం వుంటుందని పై అంశాల నుండి మనం గ్రహించవచ్చు. ఇది అతడి పురోగామి చైతన్యానికీ వాస్తవాత్మక వైఖరికీ అద్దంపట్టే ఒక వాస్తవం.

16. అహంకారాన్ని అధిగమించి వినయాన్ని పెంపు చేసుకోవడానికి మరో పద్ధతి ఏమిటంటే, తన కమ్యూనిస్టు చైతన్యాన్ని పెంపొందించుకోవడం. దీనికి మార్క్సిజం-లెనినిజాన్ని మరింత ముమ్మరంగా అధ్యయనం చేయాల్సి వుంటుంది.

17. ఏమంటే ప్రపంచాన్ని గురించి, వ్యక్తులకూ ప్రజలకూ మధ్యా, వ్యక్తికి సమిష్టికీ మధ్యా, వ్యక్తులకూ సంస్థకూ మధ్యా, వ్యక్తులకూ పార్టీకీ మధ్యా సంబంధాల గురించి శాస్త్రీయంగా అవగాహన చేసుకోవడానికి మార్క్సిజం-లెనినిజం సిద్ధాంతాలు మనకు ఉపయోగపడతాయి.

విప్లవ పోరాటంలో ప్రజల, వ్యక్తుల పాత్రల గురించి సరిగ్గా అర్ధం చేసుకోడానికి కూడా అవి మనకు ఉపకరిస్తాయి. సామాజిక సంపదకు శ్రమజీవులే సృష్టికర్తలనీ, విప్లవ పోరాటానికి వారే మూల స్తంభాలనీ మార్క్సిజం-లెనినిజం మనకు చెబుతోంది. చైనాలో సోషలిజం

కమ్యూనిజంలను నిర్మించడానికి తమ అగ్రగామిదళ నాయకత్వం కింద నడుస్తున్న కార్మికవర్గపూ, కోట్లాది శ్రమజీవులా సృజనాత్మకశక్తి మీద మనం తప్పనిసరిగా ఆధారపడాలి. ఇక వ్యక్తి విషయానికి వస్తే, అతడు ఒక విప్లవ యంత్రాగారంలోని చిన్న మరమేకు మాత్రమే. యావత్తు విజయమూ సమిష్టిబలం తాలూకు ఫలితమే. తనను నడిపించే పార్టీగానీ సంస్థగానీ తనకు అండదండలనందించే ప్రజారాశులుగానీ లేకపోతే వ్యక్తి ఏమీ సాధించలేడు. చరిత్రలో ప్రజలూ వ్యక్తులూ నిర్వహించిన పాత్రల గురించి వాటి పరస్పర సంబంధం గురించీ మనం సరిగ్గా అవగతం చేసుకున్నప్పుడు వినయం మనకు సహజసిద్ధంగా అలవడుతుంది.

మార్క్సిజం-లెనినిజం భవిష్యత్తును గురించిన, మనం చేరవలసిన గమ్యాన్ని గురించిన మన అవగాహన పెంపొందించగలదు, మన దృక్పథాన్ని విశాలం చేయగలదు, మన ఆలోచనల్ని సంకుచితత్వం నుండి విముక్తం చేయగలదు. తమ కాళ్ళకింద వున్నదాన్ని మాత్రమే చూడగల్గి కొండకోనల్ని దాటి సముద్రాలకావల ఏముందో చూడలేనివారు 'నూతిలో కప్ప' ఎంత భేషజాలకు పోగలదో అంతగానూ పోగల్గుతారు. అయితే, ప్రపంచం ఎంత అపారమైనదో, మన వ్యవహారాల వర్ణవైచిత్రి ఎంతటిదో, మానవాళి ఆశయం ఎంత దేదీప్యమానమైనదో, ఎంతటి శోభను వెదజల్లుతుందో, మానవుని ప్రజ్ఞాపాటవాలు ఎంత సుసంపన్నమైనవో, విజ్ఞానం ఎంత విశాలమైనదో గమనించడానికి వారు తమ దృక్కుల్ని సారిస్తే వెంటనే వినమ్రులౌతారు. మనం ప్రపంచాన్ని అతలాకుతలం చేసే ఒక బాధ్యతకు అంకితమై వున్నాం. మనం కేవలం మన కళ్ళముందుండే పనీ సుఖసంతోషాల మీద మాత్రమే దృష్టిని నిలపకూడదు, సుధూర భవిష్యత్తులో మనందరి పనీ సుఖసంతోషాల మీద కూడా దృష్టిని కేంద్రీకరించాలి. ఒక చిన్న విజయం లేదా ఒక చిన్న సాఫల్యం కారణంగా ఆత్మసంతృప్తి చెందు చిన్నపాటి ఉత్పత్తిదారుడి వైఖరిని అధిగమించడానికి మార్క్సిజం మనకు ఉపకరిస్తుంది. నిరంతరాయ పురోగతికోసం మన ఆకాంక్షకు అది ఊపునిస్తుంది. అదే సమయంలో మన భావవాద స్వీయాత్మకత ఆలోచనాపద్ధతిని నిర్మూలించుకోవడానికి అది తోడ్పడుతుంది.

18. వినయం, తనని తాను చిన్నచూపు చూసుకోడం-ఈ రెండూ పర్యాయపదాలు కావు. వినయం అంటే తనని తాను చిన్నచూపు చూసుకోవడం కాదు. అది భౌతిక వాస్తవికత వెలుగులో వాస్తవాలను చూడడానికి తోడ్పడే ఒక వారసత్వ వైఖరి, పురోగామిచైతన్యం తాలూకు వ్యక్తీకరణ. కాగా తనను తానూ చిన్నచూపు చూసుకోవడం అనేది అవాస్తవికతకూ, ఆత్మస్థైర్యం లేకపోవడానికీ, ఇబ్బందులకు వెరవడానికీ ఒక వ్యక్తీకరణ.

తనను తాను చిన్నచూపు చూసుకోవడం, స్వంత డబ్బా వాయించుకోవడం ఆధిక్యభావాన్ని ప్రదర్శించడం అనేవి స్వీయమానసికతత్వంపై ఆధారపడి వుంటాయి. ఇవన్నీ తప్పుడువే. అవి ఒక వ్యక్తి తనను గురించి తాను వేసుకున్న తప్పుడు, స్వీయమానసిక అంచనా ఫలితాలు. రెండూ, రెండు విపరీత ధోరణులే. స్వోత్కర్షకుపాల్పడే వ్యక్తి వాస్తవం నుండి దూరమైపోతాడు, తనను గురించి ఎక్కువగా అంచనా వేసుకుంటాడు. తన నిజ సామర్థ్యాన్ని గురించి, తన పాత్రను గురించీ గోరంతలు కొండంతలు చేస్తాడు. అతడు, తాను సామాన్యుడిని కాదనీ ఇతరులకంటే అధికుడిననీ భావిస్తాడు. అందుచేత, అతడి పురోగతి ఆగిపోతుంది, కొత్త విషయాలను నేర్చుకోవడం ఆపివేస్తాడు. అతడు అనివార్యంగానే తప్పులు చేస్తాడు. తనని తాను చిన్నచూపు చూసుకునే వ్యక్తి స్వోత్కర్షకు పాల్పడే వ్యక్తికి పూర్తిగా విరుద్ధమైనవాడే కానీ, ఇతను కూడా అతనంతటి అవాస్తవికంగానే వుంటాడు. అతను తనని గురించి తక్కువగా అంచనా వేసుకుంటాడు, తాను తన పనినీ క్రమశిక్షణనూ మెరుగుపర్చవచ్చుననే విషయాన్ని విస్మరిస్తాడు, విప్లవంలో తాను నిర్వహించబోయే పాత్రను గురించి చిన్నచూపుతో వుంటాడు. పర్యవసానంగా అతను పురోగతిని సాధించగలననే ధైర్యాన్నీ ఆత్మవిశ్వాసాన్నీ కోల్పోతాడు, తన పోరాట చైతన్యాన్ని నీరుగార్చుకుంటాడు.

క్లుప్తంగా చెప్పాలంటే తనను తాను చిన్నచూపు చూసుకోవడం, అహంభావం అనే రెండూ తప్పుడు ధోరణులే. ఎందుకంటే ఈ రెండూ కూడా ఒక వ్యక్తి విప్లవంలో తన పాత్ర గురించి వేసుకున్న తప్పుడు అంచనానూ ఒక అవాస్తవిక అశాస్త్రీయ వైఖరినీ సూచిస్తాయి. రెండు ధోరణులూ విప్లవానికి ప్రమాదకారులే. అందుచేతనే మనం అహంకారానికీ స్వోత్కర్షకూ పాల్పడడాన్ని కృతనిశ్చయంతో ప్రతిఘటించాలి. వినయాన్నీ తనను తాను చిన్నచూపు చూసుకోవడాన్నీ వేరుచేసి చూడాలి. ఈ విధంగా చేస్తే మనం ఒక విపరీత ధోరణి నుండి మరో విపరీత ధోరణికి కొట్టుకుపోవడాన్ని నివారించుకోవచ్చు.

**కార్మిక చట్టాల సవరణకు, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఒక రోజు సమ్మెలో పాల్గొన్న కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ, రైతాంగ, సింగరేణి కార్మికులకు విప్లవ జేజేలు**

ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు, 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు నిరసనగా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేలా జనవరి 8న తలపెట్టిన దేశవ్యాప్త ఒక్క రోజు సమ్మెను విజయవంతం చేసి తమ సత్తా చాటిన కార్మికులకు విప్లవ జేజేలు.

# నిస్వార్థసేవకు సంకేతంగా నిలిచిన శ్రామికవర్గ యోధ కామ్రేడ్ సుమతికి అరుణారుణ జోహార్లు !

కామ్రేడ్ సుమతి గత మూడున్నర దశాబ్దాల కాలం పాటు అజ్ఞాత యోధగా అత్యంత నిస్వార్థంగా మన పార్టీకి, భారత విప్లవోద్యమానికి తన సేవలందించి 68వ ఏట తీవ్ర అనారోగ్యంతో ఒక మారుమూల పల్లెలో మరణించింది. గొప్ప అనుభవాల తరగని గని, శ్రామిక మహిళా యోధ కామ్రేడ్ సుమతి మరణం మన పార్టీకి, ఉద్యమానికి తీరని లోటు. కేంద్రకమిటీ, సిపిఐ (మావోయిస్టు) కామ్రేడ్ సుమతికి సగౌరవంగా వినమ్రంగా జోహార్లు చెప్తున్నది. అమర కామ్రేడ్ సుమతి ఆశయ సాధనకు పునరంకితమవుతున్నది. కామ్రేడ్ సుమతి పిల్లలకు, బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. వారి విషాదంలో పాలు పంచుకుంటున్నది. కామ్రేడ్ సుమతి నెలకొల్పిన ఉత్తేజకరమైన ఆదర్శాల నుండి నేర్చుకుంటూ ఆమె నడచిన విప్లవ బాటలో దృఢంగా ముందుకు సాగాలని వీరినీ, యావత్తు కామ్రేడ్స్‌నూ కోరుతున్నది.

సికింద్రాబాద్‌లో రైల్వే కార్మికుడు డి. రాఘవులు, డి. రంగమ్మల 6గురు సంతానంలో 2వ కూతురుగా కామ్రేడ్ సుమతి 1950లో జన్మించింది. మధ్యతరగతి కుటుంబం. సుమతి 10వ తరగతి వరకు చదివింది. చిన్నతనంలో చురుకుగా, హుషారుగా అన్ని పనుల్లో ముందుండేది. అమ్మాయిననే బెరుకుదనం లేకుండా ఒంటరిగా తను ఒక్కతే కుటుంబ పనులపై చుట్టాల ఇంటికి రైలులో ప్రయాణం చేసి పోయి వచ్చేది. అది ఆనాడు అరుదైన విషయమే. తనకు 22 ఏళ్ల వయస్సులో అంటే 1972లో కామ్రేడ్ ఉడుత శ్రీనివాసులుతో వివాహమైంది. అప్పటికే కామ్రేడ్ శ్రీనివాసులు పోస్టల్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేస్తూ సి.పి.ఐ. రాజకీయాల పట్ల ఆకర్షితుడై కార్మికరంగంలో యాక్టివిస్టుగా పనిచేసేవాడు. తర్వాత అనతికాలంలోనే నక్సల్బరీ శ్రీకాకుళం సాయుధ విప్లవ రైతాంగ పోరాటాల ప్రేరణతో సిపిఐ (ఎం.ఎల్) పార్టీతో సంబంధాలను ఏర్పరచుకొని అందులో కార్యకర్తగా మారాడు. కామ్రేడ్స్ సుమతి-శ్రీనివాసుల పెళ్లి కట్నకానుకలు, బాజా-బజంత్రీలు లేకుండా కమ్యూనిస్టు ఆదర్శాలతో స్టేజీపై ఉపన్యాసాలతో జరిగింది. వీరికి ముగ్గురు సంతానం.

కామ్రేడ్ సుమతికి విప్లవ రాజకీయాల పట్ల పరిచయం తనకు వివాహమైన తర్వాత కార్మికసంఘం నాయకుడైన తన సహచరుడి ద్వారానే జరిగింది. తన ఇంట్లో విప్లవ సాహిత్యంపై జరిగే చర్చలు, విప్లవకారుల రాకపోకలతో కూడిన విప్లవకర వాతావరణం తను కూడా విప్లవకారిణిగా తయారవడానికి తోడ్పడ్డాయి. తన సహచరుడు కార్మికులను సంఘటితం చేసి ఉద్యమాలను నడిపే క్రియాశీల కార్మికసంఘ నాయకుడు కావడం వల్ల ఆయనను అధికారులు ఒక చోటి నుండి మరో చోటికి ఏడాదికి ఒకసారి బదిలీ చేసి ఇబ్బందుల పాలు చేస్తుండేవారు. ఎమర్జెన్సీ కాలం (1975-76)లో ఇందిరా ప్రభుత్వం ఎందరో విప్లవకారులతో పాటు శ్రీనివాసులును కూడా జైలు పాలు చేసింది. దీనితో ఆ సమయంలో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను, కుటుంబ సమస్యలను, మానసిక ఒత్తిడులను కామ్రేడ్ సుమతి ఎంతో ధైర్యంగా ఎదుర్కొంది. ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత శ్రీనివాసులు జైలు నుండి విడుదలయ్యాక ఆయన మళ్లీ కార్మికరంగంలో విప్లవకర కార్యకలాపాలలో క్రియాశీలంగా పనిచేయడానికి కామ్రేడ్ సుమతి తన పూర్తి సహాయ సహకారాలను అందించింది.

1972-80 మధ్యకాలంలో కామ్రేడ్ సుమతి పిల్లల పెంపకం పనిలో, ఇంటి పనిలో తీరిక లేకుండా ఉంటూనే తమ ఇల్లు పార్టీకి చాలా నమ్మకమైన రహస్య స్థావరం (డెన్)గా ఉపయోగపడడంలో నిర్వహించిన పాత్ర కొనియాడదగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కార్మికోద్యమంతో పాటు వివిధ ప్రజా ఉద్యమాలు పెల్లుబికి విస్తరించిన 1980-85 మధ్యకాలంలో వీరి ఇల్లు ఎంతో మంది విప్లవకారులకు ఒక ముఖ్యమైన శిబిరంగా మారింది. ఈ కర్తవ్య నిర్వహణలో కామ్రేడ్ సుమతి అత్యంత సేవాభావంతో పనిచేస్తూ, ప్రేమాభిమానాలతో, అప్యాయతతో, చాలా కలుపుగోలుతనంతో ఉంటూ కామ్రేడ్స్ ఆదరాభిమానాలు చూరగొన్నది. ఈ కాలంలో ఆమె పార్టీకి సంబంధించిన, మన దేశానికీ, రష్యా, చైనా విప్లవోద్యమాలకు సంబంధించిన పుస్తకాలను అధ్యయనం చేసింది. అమ్మ, కాకలు తీరిన యోధుడు, నార్మన్ బెతూన్ జీవిత చరిత్ర, నా కుటుంబం లాంటి నవలలు ఆమెను ఎంతో ఉత్తేజపరిచాయి. డెన్ మెయింటేన్ చేసేటప్పుడు చాలా మంది కామ్రేడ్స్‌కు కా. సుమతి తన వయసుకు, అనుభవానికి మించి ఒక అక్కలా, ఒక తల్లిలా ఎంతో చాతుర్యంగా తన బాధ్యతలను నిర్వహించింది. ఈ కాలంలో ఆమె పార్టీకి సంబంధించిన కొన్ని ప్రత్యేక పనులలో తన సహకారాన్ని అందించింది. తమ డెన్‌కు వచ్చిన పార్టీ కామ్రేడ్స్‌కు తలెత్తే అనారోగ్య సమస్యలకు చిన్న చిన్న సలహాలు సూచనలతో పరిష్కారాలు చూపించేది. ముఖ్యంగా తమ డెన్‌కు వచ్చే మహిళా కామ్రేడ్స్‌తో కా. సుమతి చాలా కామ్రేడ్‌లీ సంబంధాలు కొనసాగిస్తూ వారికి అన్ని విషయాల్లోనూ తోడ్పాటునందించింది. కామ్రేడ్ సుమతి అనారోగ్యంతో ఉన్న కొందరు మహిళా కామ్రేడ్స్‌కు ఒక మంచి సహ కామ్రేడ్‌లానే గాకుండా ఒక కమ్యూనిస్టు తల్లి లాంటి ప్రేమను పంచి, సేవలనందించి వారు త్వరగా కోలుకొనేలా తోడ్పడింది. వారికి ఒక మంచి స్నేహితురాలిగా, శిక్షకురాలిగా, సలహాదారుగా ఉంటూ వారిని దృఢమైన పార్టీ కేడర్లుగా తీర్చిదిద్దటానికి కృషి చేసింది. ఈ కాలంలో కొనసాగిన ప్రజావెల్లువలను, జనవాహినిని చూసి నూతనోత్తేజాన్ని పొందింది. ఇలా కా. సుమతి ఒక విప్లవకారిణిగా పరిణతి చెందింది.

1980ల తొలి భాగంలో కార్మికరంగంలో ఉద్యమ కార్యకలాపాలు బాగా విస్తరించాయి. వీటిలో కా. శ్రీనివాసులుతో సహా సంబంధిత కేడర్లు క్రియాశీల నాయకత్వ పాత్ర వహించారు. వీటిలో పోస్టల్ అండ్ టెలిగ్రాఫ్ కార్మికుల సమ్మె చెప్పుకోదగినది. ఆ సమ్మెకు మద్దతుగా వివిధ కార్మికసంఘాలు కూడా సమ్మెలో పాల్గొనడంతో ఆ పోరాటం కార్మిక ఐక్యతపై మంచి ప్రభావాన్ని కలిగించింది. దీనితో ప్రభుత్వం కన్నెర్ర జేసి 1983లో కామ్రేడ్ శ్రీనివాసులుతో పాటు మరికొంత మంది కార్మిక నాయకులను ఉద్యోగం నుండి తొలగించింది. తను కార్మిక సంఘంలో పాల్గొననని, తనది తప్పని పేర్కొంటూ హామీపత్రం రాసివ్వాలనీ అధికారులు బెదిరించినప్పటికీ ఆయన ఆ బెదిరింపులకు తలవంచక దృఢంగా నిలిచి పోరాడడంలో ఆయనకు కామ్రేడ్ సుమతి విప్లవస్ఫూర్తితో అండగా నిలిచి అందించిన తోడ్పాటు ఆసమయంలో ఉద్యోగాలు పోయిన కార్మిక కుటుంబాలకు కార్మికసంఘాలు చందాలు

జమచేసి ఇచ్చి వారికి అండగా నిలిచాయి. ఉద్యోగం పోయిన శ్రీనివాసులు కుటుంబానికి అలా దొరికిన కొద్దిపాటి సహాయ సహకారాలతోనే సహచరునితో పాటు ఆమె దృఢంగా నిలిచింది.

1980-85 మధ్య డెన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో అనారోగ్య సమస్యలు ఆమెకు ఇబ్బంది కలిగించేవి. తమ చిన్న ఇల్లు ఎప్పుడూ వచ్చే పోయే పార్టీ కేడర్లతో, ఎల్లప్పుడూ ఉండే ఇద్దరు ముగ్గురు కామ్రేడ్స్‌తో సందడిగా ఉండేది. దీని ప్రభావం నిరంతరం పిల్లల పెంపకంపై, వారి చదువులపై పడినా, తనకు కుటుంబ ప్రైవసీ కొరవడినా, తన సహచరుడు కార్మికోద్యమ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉండి డెన్ నిర్వహణ బాధ్యత భారాన్నంతటినీ తన పైననే వదిలిపెట్టినా, ఆయనకు ఉద్యోగం లేకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా ఆమె చాలా ఓపికగా, నొచ్చుకోకుండా అన్నీ చాకచక్యంగా చక్కబెట్టేది. ఇది కామ్రేడ్స్ అందరినీ ఆశ్చర్యపరిచేది. దీనితో ఆమెను అందరూ ఒక చాలా నమ్మకమైన, ఆదర్శవంతమైన కామ్రేడ్‌గా గౌరవించేవారు.

1985లో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విప్లవోద్యమంపై ఫాసిస్టు ప్రభుత్వ నిర్బంధం తీవ్రతరమైంది. శత్రువు ఎంతో మంది మెరికల్లాంటి నవయువ విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో క్రూరంగా కాల్చి చంపాడు. మరెంతో మందిని జైళ్లలో పెట్టాడు. దీనికి కామ్రేడ్ సుమతి ఎంతో బాధ పడింది. కానీ పార్టీకి కలిగిన ఈ నష్టాలను చూసి ఆమె భీతిల్లకుండా చాలా ధైర్యంగా విప్లవస్ఫూర్తితో దృఢంగా నిలిచింది. అమరుల పోరాటదీక్షను, త్యాగాలను చూసి ఆమె విప్లవస్ఫూర్తి పొందేది. ఆ అమరుల త్యాగాల ముందు మా ఇబ్బందులు ఏపాటివనేది. ఆమె చెప్పే ఈ ధీరోదాత్త మాటలు తమ డెన్‌కి వచ్చే కామ్రేడ్స్ అందరికీ, ప్రత్యేకంగా మహిళా కామ్రేడ్స్‌లో నూతనోత్తేజాన్ని నింపేవి. నిర్బంధకాండ మధ్య కామ్రేడ్స్ సుమతి-శ్రీనివాసులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు వీరిపై తమ సహ కామ్రేడ్స్‌కు, తమ బంధుమిత్రులకు మరింత నమ్మకాన్ని, గౌరవాభిమానాలను పెంచాయి.

ఇలాంటి పరిస్థితులలోనే కామ్రేడ్స్ సుమతి-శ్రీనివాసులు కుటుంబం మొత్తంగా రహస్య జీవితంలోకి వెళ్లాలని ఉన్నత కమిటీ నిర్ణయించింది. దీనిని వీరు ఎలాంటి శషభిషలు లేకుండా ఉన్నత చైతన్యంతో తమ బంధుమిత్రులను, పుట్టిన ఊరిని వదిలిపెట్టి మరొక రాష్ట్రంలోకి వెళ్లి కేంద్రకమిటీకి సంబంధించిన రహస్య డెన్ నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. అక్కడ ఈ బాధ్యతలు నిర్వహిస్తుండగా రెండేళ్ల కాలంలోనే వారికి కేంద్రకమిటీ కాంటాక్టు తెగిపోయింది. దీనితో ఆ సమయంలో కలిగిన ఆర్థిక తదితర అనేక ఇబ్బందులను కామ్రేడ్ సుమతి నిబ్బరంగా ఎదుర్కొన్నది. దీని తర్వాత కొంత కాలానికి తమను పార్టీ కాంటాక్టు చేసింది. ఈ కాలంలోనే పార్టీ కేంద్రకమిటీలో తలెత్తిన ఆంతరంగిక సంక్షోభకాలంలో కూడా ఆమె తన సహచరునితో పాటు ఎలాంటి ఊగిసలాటలకు గురికాకుండా పార్టీ పంథా వైపు చాలా దృఢంగా నిలబడింది.

భారత విప్లవోద్యమ చరిత్రలో 1990వ దశకం మన పార్టీ అభివృద్ధికి, విప్లవోద్యమ విస్తరణకు సంబంధించిన విషయంలో దానిదైన ఒక ప్రత్యేకత కలిగి ఉన్నది. ఇలాంటి దశకంలో కామ్రేడ్స్ శ్రీనివాసులు-సుమతిల కుటుంబం పార్టీ అవసరాలకు అనుగుణంగా మన కేంద్రకమిటీకి సంబంధించిన ఒక రహస్య డెన్ నిర్వహణ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించింది. ఇందుకోసం కామ్రేడ్స్ శ్రీనివాసులు-సుమతి అవసరమైన రాష్ట్రాలలో రహస్యంగా డెన్స్‌ని ఏర్పరిచి కేంద్రకమిటీ కార్యకలాపాలు నిరాటంకంగా కొనసాగటానికి అన్ని విధాలా తోడ్పడినారు. తమకు మొదట పరిచయమైన, విప్లవోద్యమ పునర్నిర్మాణంలో కీలకమైన భూమిక నిర్వహించిన కొండపల్లి తదితర కొందరు నాయకులు పార్టీకే ఆటంకంగా మారినప్పుడు ఆమె ఎలాంటి శషభిషలకు తావు లేకుండా వారిని వ్యతిరేకించింది. విప్లవోద్యమంలో సాధించిన విజయాలను చూసి, నూతన పార్టీ-సిపిఐ (మావోయిస్టు) ఏర్పాటును చూసి ఆమె ఎంతో సంతోషించింది. ఉద్యమ క్రమంలో కలిగిన నష్టాలను చూసి సమాజ సమూల మార్పుకు, నూతన సమాజం నెలకొల్పడానికి అపూర్వమైన త్యాగాలు తప్పవని ప్రగాఢంగా నమ్మేది. ఆనాడు మన కేంద్రకమిటీ భారత విప్లవోద్యమానికి నాయకత్వాన్ని అందించటానికి చేసిన కృషిలో ఈ విప్లవ కుటుంబం పాత్ర విడదీయలేనంతగా మిళితమై ఉంది. ఈ అజ్ఞాత విప్లవకారులు చేసిన అత్యంత కఠినమైన ఇలాంటి నిస్వార్థ సేవే మన పార్టీకి ఒక పెన్నిధి.

1990వ దశాబ్దం ఆరంభం నుండి మన దేశంలో ఆరంభమైన నూతన ఆర్థిక విధానాల ప్రభావం వల్ల సమాజంలో ముందుకు వచ్చిన సామ్రాజ్యవాద సంస్కృతిపై తన సహచరునితో పాటు కా. సుమతి మార్క్సిస్టు దృక్పథంతో సరైన అవగాహన ఏర్పరచుకొని దానికి వ్యతిరేకంగా పోరాటవైఖరిని అవలంభించింది. దీనికోసం వీలైనంత సహకారాన్ని కా. శ్రీనివాసులు నుండి, వేర్వేరు ఉన్నత స్థాయి నాయకత్వం నుండి తీసుకుంటూ తన రాజకీయ చైతన్యాన్ని మరింతగా పెంపొందించుకున్నది. తన పిల్లలకు కూడా విప్లవ రాజకీయాలు, కార్మికవర్గ సంస్కృతి, కమ్యూనిస్టు ఆదర్శాల గురించి ఎడ్యుకేట్ చేయడంతో పాటు అందుకనుగుణంగా వారు ఎలా జీవించాలనే విషయం గురించి కూడా నేర్పించింది. ఈ విషయంలో తన వంతు బాధ్యతను చాలా చక్కగా నిర్వహించింది. తమ పిల్లలు విప్లవబాటలో పెరిగేలా చాలా ప్రోత్సాహాన్ని అందించింది.

1995లో పార్టీ కా. శ్రీనివాసులుకు ఆంధ్ర రాష్ట్రంలో కార్మికోద్యమ రంగంలో బాధ్యతలను ఇవ్వాలని నిర్ణయించింది. దీనికి కామ్రేడ్ శ్రీనివాసులు మనస్ఫూర్తిగా తన ఆమోదాన్ని తెలిపాడు. కామ్రేడ్ సుమతి కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. తాను పార్టీ అండతో పిల్లల బాధ్యతను చూసుకుంటూ పార్టీ ఇచ్చే పనిని తన శక్తికొద్దీ చేస్తానని చెప్పింది. కానీ కా. శ్రీనివాసులు ఇంకా ఈ నూతన బాధ్యతలలో చేరక ముందే కొద్ది రోజుల్లోనే మలేరియా జ్వరంతో ఆకస్మికంగా అమరుడైనాడు. అనుకోని ఈ ఘటన కామ్రేడ్ సుమతినే గాకుండా పిల్లలను కూడా చాలా తీవ్రంగా కలచివేసింది. అప్పుడు వారి బాధకు అంతు లేదు. అపుడు మరో రాష్ట్రంలో అత్యంత రహస్యంగా అజ్ఞాత జీవితంలో పనిచేస్తుండడం వల్ల పార్టీ కాంటాక్టు తప్ప మరెవ్వరితోనూ ఎలాంటి సంబంధాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కా. సుమతి, పిల్లలు చాలా నిబ్బరంగా ఉండి ఎంతో సమయస్ఫూర్తితో ఆయన అంతిమ సంస్కారం నిర్వహించారు. కామ్రేడ్ శ్రీనివాసులు అంతిమ సంస్కారానికి బంధుమిత్రులెవ్వరూ రాకపోవడం వల్ల డెన్ చుట్టుప్రక్కల వారి నుండి ఎదురైన సమస్యలను కామ్రేడ్ సుమతి, పిల్లలు ఎంతో ధైర్యంగా సమయస్ఫూర్తితో పరిష్కరించుకున్నారు. వీరు యథావిధిగా పార్టీ కాంటాక్టు కొనసాగించారు. ఆ తర్వాత కూడా కా. సుమతి తన పిల్లలను విప్లవకారులుగా తీర్చిదిద్దుతూ, కుటుంబమంతా విప్లవ కృషి లోనే నిమగ్నమయ్యేలాగా చేసింది. విప్లవంలో ఎందరో కామ్రేడ్స్ చేస్తున్న ప్రాణార్పణలలో ఒక భాగంగానే తన సహచరుడు కామ్రేడ్ శ్రీనివాసులు మరణాన్ని ఒక గొప్ప త్యాగంగా పరిగణించింది. అందువల్లే ఆమె, తన పిల్లలు యథావిధిగా కేంద్రకమిటీ రహస్య డెన్ నిర్వహణ బాధ్యతను కొనసాగించారు.

1999లో పనులలో భాగంగా పోతున్నప్పుడు ఒకసారి బస్సు ప్రమాదం జరిగి కాలు విరిగింది. గతం నుండే ఉన్న రక్తపోటుతో పాటు సైనస్, తలనొప్పి, కాళ్ల నొప్పుల వంటి సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని తన పనులకు అడ్డు రాకుండా చూసుకునేది. కామ్రేడ్ సుమతి 2000 సంవత్సరంలో తీవ్ర అనారోగ్యానికి గురైంది. అయినప్పటికీ కొంత విరామం తర్వాత తన ఆరోగ్య పరిమితులను దృష్టిలో పెట్టుకొని పార్టీ తనకు ఒప్పగించిన పనిని సఫలీకృతంగా నిర్వహించటానికి చివరి వరకూ శాయశక్తులా కృషి చేసింది. తీవ్రతరమైన శత్రు నిర్బంధంతో పాటు తన అనారోగ్యాన్ని గమనంలో ఉంచుకొని గత దశాబ్ద కాలంగా పార్టీ ఆమెకు క్రియాశీలంగా పనిచేసే అవకాశం కల్పించలేక పోయింది. ఎర్రసైన్యం దన్నుతో నూతన ప్రజాస్వామిక రాజ్యాధికారం నడిచే ప్రాంతంలో కేంద్ర నాయకత్వంతో పాటు వివిధ తరాల కామ్రేడ్స్‌తో జరిగే పార్టీ మహాసభలు, రాజకీయ తరగతులు లాంటి కార్యక్రమాల్లో ఒకసారైనా పాల్గోవాలనే తన చిరకాల కోరికను ఈ కారణాల వల్లనే మన కేంద్రకమిటీ నెరవేర్చలేక పోయింది.

పార్టీపై శత్రుదాడి తీవ్రత వల్ల డెన్స్ వాడకం తగ్గింది. అయినా పార్టీ తనకు అప్పగించిన టెక్నికల్ పనిని తప్పకుండా నిర్వహించేది. వయస్సు పైబడుతున్న కొద్దీ ఆరోగ్యం క్షీణిస్తున్నా ఎల్లప్పుడూ హుషారుగా ఉంటూ, అందరితో కలిసిపోయి ఉల్లాసంగా ఉండే కామ్రేడ్ సుమతి ఎక్కడైనా మన కామ్రేడ్స్‌కు మాత్రమే గాకుండా పరిచయస్థులకూ, ఇరుగుపొరుగు వారికీ మంచి స్నేహాన్ని పంచేది. మిత్రులను సంపాదించుకునేది. అలాగే 25 ఏళ్ల సుదీర్ఘకాలం పాటు విప్లవ కార్మికోద్యమ నాయకునిగా, ఒక సమర్థవంతుడైన పార్టీ కేడర్‌గా, పార్టీ టీచర్‌గా పనిచేసిన తన సహచరుడు కామ్రేడ్ శ్రీనివాసులు అమరుడైనా కామ్రేడ్ సుమతి ఎంతో ధైర్యంగా చివరి వరకూ పనిచేసింది.

1972 నుండి 2018 వరకు గత 45 ఏళ్లుగా కామ్రేడ్ సుమతి సుదీర్ఘ విప్లవ జీవిత కాలమంతా వివిధ రూపాలలో విప్లవ సేవ చేస్తూ నిరంతరం తన రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవటానికి కృషి చేసింది. ఆమె అనేక ఉద్యమ ఆటుపోట్లను చవిచూసింది. తనకు అత్యంత ప్రేమాస్పదుడైన సహచరుడిని కోల్పోయినా, తనకు పరిచయస్థులైన కొందరు పార్టీ కేడర్లు ఉద్యమాన్ని వదిలిపోయినా, తనకు పరిచయస్థులైన కామ్రేడ్స్ ఎందరో అమరులైనా, కష్టాలు, నష్టాలెన్ని ముందుకు వచ్చినా, పార్టీతో సంబంధాలు తెగిపోయినా ఆమె చలించలేదు. ఒక నిజమైన, నిస్వార్థమైన కమ్యూనిస్టు కేడర్‌గా విప్లవం పట్ల, పార్టీ పట్ల, ప్రజల పట్ల అచంచల విశ్వాసంతో పార్టీని, విప్లవోద్యమాన్ని తన సర్వస్వంగా భావించింది. నిరంతరం విప్లవోత్సాహంతో, ఉల్లాసంతో పనిచేస్తూ కామ్రేడ్స్ ఆదరాభిమానాల్ని చూరగొన్నది.

కామ్రేడ్ సుమతి కుటుంబ బంధాలను విప్లవ ప్రయోజనాలకు అడ్డురానివ్వకుండా ఒక సిన్సియర్ పార్టీ కేడర్‌గా పార్టీలో తన స్థాయి ఏమిటనేది ఎన్నడూ ఆలోచించకుండా పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతలను నిర్వహించింది. అమరుల త్యాగాల స్ఫూర్తితో, కమ్యూనిస్టు స్పిరిట్‌తో తన పిల్లలను విప్లవకారులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసింది. తన తుదిశ్వాస వరకు విప్లవోద్యమ అభివృద్ధినీ, పార్టీ, సహ విప్లవకారుల, ప్రజల శ్రేయస్సునే కాంక్షించింది. 2018లో తన 68 ఏళ్ల వయస్సులో తీవ్ర అనారోగ్యంతో ఒక అజ్ఞాత మారుమూల పల్లెలో విప్లవకారుల మధ్య తుదిశ్వాస విడిచి అందరి నుండి అంతిమ సెలవు తీసుకొంది. కామ్రేడ్ సుమతికి అక్కడి కామ్రేడ్స్ అశ్రునయనాలతో వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటించారు. కామ్రేడ్ సుమతి విప్లవ స్ఫూర్తి, నెలకొల్పిన కమ్యూనిస్టు ఆదర్శాలు మనందరికీ సదా ప్రేరణగా నిలుస్తాయి. కామ్రేడ్ సుమతికి మన కేంద్రకమిటీ మరోసారి అరుణారుణ జోహార్లు అర్పిస్తున్నది. ఆమె మహత్తర ఆశయ పరిపూర్తికై తుదకంటా కృషి చేస్తామని మరోసారి శపథం చేస్తున్నది. ఉత్తేజకరమైన అజ్ఞాత శ్రామిక మహిళా యోధ కామ్రేడ్ సుమతి విప్లవ జీవిత అనుభవాల నుండి, కమ్యూనిస్టు ఆదర్శాల నుండి నేర్చుకొని విప్లవ పథాన దృఢంగా ముందుకు సాగాలని యావత్తు కామ్రేడ్స్‌కు మన కేంద్రకమిటీ పిలుపునిస్తున్నది.

**కామ్రేడ్ సుమతి అమర్ రహే!**

**కామ్రేడ్ సుమతి ఆశయాలను తుదకంటా కొనసాగిద్దాం!**

"తన స్వంతం కోసం ఏమీ చేసుకోకుండా ప్రతి పనీ ఇతరుల ప్రయోజనం కొరకు చేసే కామ్రేడ్ బెతూన్ దీక్ష తన పనిలో బాధ్యత పట్ల చాలా గొప్ప గుర్తింపు, తన కామ్రేడ్స్, ప్రజల పట్ల చాలా గొప్ప ఆప్యాయతల ద్వారా వ్యక్తమైంది. మనమంతా ఆయన పూర్తి నిస్వార్థ భావన నుండి నేర్చుకోవాలి. ప్రతి కమ్యూనిస్టు ఆయన నుండి నేర్చుకోవాలి. చెప్పుకోతగినంత మంది తమ పనిలో బాధ్యతారహితంగా ఉంటున్నారు. "తేలికైన దాన్ని ఎంచుకొని బరువైన దాన్ని పక్కకు నెట్టివేయడం" అంటే అధికమైన బరువులను ఇతరుల పైకి నెట్టి తమకోసం తేలికైన వాటిని ఎంచుకోవడం. ఏదైనా మొదలుకొచ్చినప్పుడు వారు తమ గురించి మాత్రమే ఆలోచించుకొని ఇతరుల గురించి ఆ తర్వాత మాత్రమే ఆలోచిస్తారు. వారు శ్రమ చేసినప్పుడు గర్వంతో పొంగిపోతారు. దాన్ని గురించి ఇతరులకు తెలియదేమోనని అతి గొప్పలు చెప్పుకుంటారు. తన తోటి కామ్రేడ్స్ పట్ల, ప్రజల పట్ల వారు నిండైన ఉత్సాహంతో మెలగకుండా అయిష్టంగానూ, సాన్నిహిత్యం లేకుండానూ, నిర్లక్ష్యంగానూ, అనాసక్తితోనూ వ్యవహరిస్తారు. అలాంటివారు నిజంగా కమ్యూనిస్టులు కారు. లేదా కనీసంగా చెప్పాలంటే మంచి కమ్యూనిస్టులుగా లెక్కించబడజాలరు. యుద్ధరంగం నుండి తిరిగి వచ్చిన వారిలో ఏ ఒక్కరూ బెతూన్ పేరు చెప్పినప్పుడు తమ ప్రశంసాభావాన్ని వ్యక్తపరచకుండా ఉండలేకపోయారు. ఏ ఒక్కరూ ఆయన దీక్షకు చలించకుండా ఉండలేకపోయారు. ...... ప్రతి కమ్యూనిస్టు ఈ నిజమైన కమ్యూనిస్టు దీక్షను కామ్రేడ్ బెతూన్ నుండి నేర్చుకోవాలి. ఈ భావనతో పనిచేసే ప్రతి వ్యక్తీ ప్రజల కోసం అధికంగా పనిచేసే వ్యక్తిగా స్థిరపడతాడు. ఈ అంశం నుండి ప్రారంభించినప్పుడు ప్రజలకు గొప్ప ప్రయోజనకరమైన వ్యక్తిగా ఎవరైనా తయారు కాగలరు. ఒక మనిషి యొక్కసామర్థ్యం అధికమైనది కావచ్చు, లేదా అల్పమైనది కావచ్చు, అతను ఈ దీక్ష మాత్రం కలిగి ఉన్నట్లయితే అతను అప్పటికే ఉన్నత ఆదర్శాలు గల మనిషిగానూ, నిర్మలమైన మనిషిగానూ, నైతికస్థాయి గల మనిషిగానూ, తుచ్ఛమైన కోర్కెలను అధిగమించిన మనిషిగానూ, ప్రజలకు అత్యంత ప్రయోజనకరమైన మనిషిగాను ఎదిగినట్లే."

"నార్మన్ బెతూన్ స్మృతిలో" - మావో

*(కామ్రేడ్ సుమతిని నిరంతరం ఉత్తేజపరిచిన కొటేషన్ ఇది)*

## కామ్రేడ్ కుంజం మంగాల్ (సునీల్ 17సం॥) అమర్ హై

కామ్రేడ్ సునీల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం లోని బీజాపూర్ జిల్లా భైరంగాడ్ బ్లాక్ ఇంద్రి గ్రామంలో నిరు పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టి పెరిగాడు. కామ్రేడ్ సునీల్ కుటుంబంలో పెద్ద కొడుకు తల్లి దండ్రులు పెట్టిన పేరు మంగాల్ ఇతనికి ఒక తమ్ముడు ఉన్నాడు. తన చిన్న వయసులోనే తండ్రి అనారోగ్యంతో చనిపోయాడు. తన తండ్రి చని పోయినప్పటి నుండి తల్లి అన్ని తానై కామ్రేడ్ సునీల్‌ను పెంచి పెద్ద చేసింది.

కామ్రేడ్ సునీల్ వాల్ల కుటుంబం దంతెవాడ జిల్లాలోని తుర్వెలీ గ్రామం నుండి భూమి కోసం ఇంద్రి గ్రామానికి వచ్చారు. కామ్రేడ్ సునీల్ చిన్న నాటి నుండి తన తల్లితో కలిసి అన్ని పనులతో చేదోడు వాదోడుగా వుంటూ కొంత పెద్దగయిన తర్వాత గొడ్లు, మేకలు మేపుకుంటూ తోటి పిల్లలతో కలసి పోయి ఆడుతూ పాడుతూ విప్లవ పాటలకు ఆకర్షితుడయ్యాడు. తన తల్లి కూడా విప్లవ మహిళ సంఘంలో సభ్యారాలు అవ్వడంతో సహాజంగానే ఆ ప్రభావం కామ్రేడ్ సునీల్ పై పడింది. అప్పటి నుండి తల్లితో పాటూ సంఘం సమావేశాలకు గ్రామ సభలకు హాజరవుతూ ఉండే వాడు. గ్రామంలోకి దళం వచ్చిందంటే తల్లితో పాటూ పోయి దళం చెప్పె



విషయాలను శ్రద్ధగా వింటూ దళం గ్రామంనుండి పోయే వరకు దళం వద్దనే ఉండేవాడు దానితో కామ్రేడ్ సునీల్‌లో ఉన్నటు వంటి ఉత్సుకతను గమనించిన దళ కమాండర్ సునీల్‌ను బాలల సంఘులో పెట్టారు. బాలల సంఘంలో చేరిన నాటి నుండి ఆ సంఘానికి ఇచ్చిన కర్తవ్యాలను నెరవేర్చడంలో సునీల్ ముందుండేవాడు తనతోటి బాల బాలికలతో కలసి మెలసి ఉంటూ వాల్లతో కలసి దళం గ్రామానికి వచ్చిందంటే శత్రువు సమాచారంతో పాటు గ్రామానికి సంబందించిన పరిస్థితిని దళ కమాండర్‌కు చెప్పేవాడు. ఈ నేపథ్యంలోనే చిన్నతనం నుండె పోరాడే తత్వాన్ని అలవర్చుకున్నాడు.

దళం ఇంద్రి గ్రామానికి వస్తూ పోతూ ఉండటంతో మరింత ఉత్సాహం కలిగి నేనూ పెద్దయ్యాక దళంలో చేరి సాయుధంగా తుపాకీ పట్టుకొని కొట్లాడాలని బలంగా నిర్ణయించుకొన్నాడు.

బాలల సంఘం నుండి బాలల సీఎన్ఎమ్ (చైతన్యనాట్యమంచ్)లో కూడ పని చేస్తూ పాటలు నేర్చుకొంటూ తను ఎక్కడికి పోయిన విప్లవ పాటలు మరిచేవాడుకాదు పాటలు పాడు కుంటూనే పనులు చేసేవాడు.

తను చిన్న తనంలో బాలల సంఘం, బాలల సీఎన్ఎమ్‌లో పెద్దయ్యాకా గ్రామ మిలీషియాలో చేరాడు. గ్రామ మిలిషియాలో ఉన్న క్రమంలో మిలీషియా కర్తవ్యాలు నెరవేర్చడంలో ముందుండి అమలు చేసేవాడు. గ్రామ రక్షణ కోసం రాత్రింబవుళ్లు సెంట్రీలు, పెట్రోలింగ్ చేస్తుండేవాడు. శతృవును నష్టపరచడం కోసం గెరిల్లా యుద్ధ ఎత్తుగడలను అమలు పరిచేవాడు.

ప్రజలు వ్యవసాయా పనుల్లో ఉన్నప్పుడు వారికి రక్షణగా నిలిచేవాడు. మిలిషియాలో ఉంటూ ప్రజలతో మమేకం అయ్యాడు. చిన్న పిల్లలతో మంచి స్నేహం చేసేవాడు. నిరంతరం ప్రజలను కలుస్తూ వారినుండి అనేక విషయాలను నేర్చుకుంటూ తనకు తెలిసిన విషయాలను ప్రజలకు అర్థం చేయిస్తూ ఉండేవాడు.

పార్టీ, ప్రజలు నిర్వహించే సభలు, సమావేశాలకు రక్షణ కల్పించడంలో తనవంతు పాత్రను పోసిస్తూ రాజ్య హింసకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద దళారీ నిరంకుశ భూర్జువా వర్గం, భూస్వామ్య అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ అనేక నిరసన కార్య క్రమాలలో, పార్టీ నిర్ణయించిన నేపథ్యంలో వాటినీ అమలు చేయడానికి చాల ఉత్సాహంగా ధైర్య సాహసాలతో పాల్గొనేవాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 2005లో రాజ్య ప్రేరేపిత ప్రైవేట్ ముఠా సల్వాజుడుం పేరుతో లంపెన్ యువతి, యువకులను చేరదీసి ఆదివాసి గ్రామాలపై దాడులు చేయడం ఇండ్లు, ఆస్తులు తగుల బెట్టడం, డబ్బులు మేకలు, కోళ్లు, పందులు, దాన్యాన్ని దోపిడి చేయడం, ప్రజలను గొడ్డళ్ళతో నరికి క్రూరంగా హత్యలు చేయడం, మహిళలపై సామూహిక అత్యాచారాలు చేసిహత్య చేయడం వంటి అనేక భయం కరమైన ఘటనలను చిన్న తనం నుండి తన కండ్లతో చూశాడు.

అయినప్పటికి కామ్రేడ్ సునీల్ తన తల్లి తోపాటు వుంటూ గుండె నిబ్బరంతో ఆ నిర్బంధాన్ని ఎదుర్కొన్నాడు. ఆ సమయంలో చాల మంది ప్రజలు గ్రామాలను విడిచి అడవుల్లో తల దాచుకొన్నారు. కొద్ది మంది సల్వా జుడుం సిభిరాలలో చేరారు వీటిని చూసి కలత చెంద లేదు ధైర్యంగా తన కుటుంబం ప్రజల పక్షమే నిలిచి సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకొని సల్వాజుడుంను ఓడించడంలో తను, ప్రజలు, మిలిషియాతో కలసి అనేక చర్యలలో పాల్గొన్నాడు.

గ్రామానికి దళం వస్తే ఎంతో ఉత్సాహంగా దళం వద్దకు వెళ్ళి సహాయ సహకారాలు అందించేవాడు. తన ప్రాణాన్ని పణంగ పెట్టి కాపాడు కోవాలనే సంకల్పంతో రక్షణగా ఉండేవాడు. దళం చెప్పేఅన్నీ రాజకీయాలు వింటూ మరింత చైతన్య యుతంగా, ఉత్సాహంగా ప్రజా అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనేవాడు. ఈ అన్ని పరిణామాలను చిన్న నాటి నుండే చూస్తూ పెరిగిన కామ్రేడ్ సునీల్ ప్రజలతో పాటు తన కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలు పోవాలన్న, ప్రజావిముక్తి జరగాలన్న సాయుధ పోరాటమే సరైనా మార్గమని నిర్ణయించుకున్నాడు.

తన తల్లి తమ్ముని పెంచిన కుటుంబాన్ని వదిలీ 2018 డిసెంబర్‌లో పార్టీ పిలుపు మేరకు మిర్తుల్ దళంలో పూర్తి కాలం కార్యకర్తగా చేరాడు. కొంత కాలం పని చేసిన తర్వాత పార్టీ అవసరాల రీత్యా 2019 మార్చిలో సీఆర్సీ–2 కంపెనీలోకి పార్టీ బదిలీ చేసింది. పార్టీ నిర్ణయానికి కట్టుబడి సీఆర్సీ–2 కంపెనీకి ఎంతో ఉత్సాహంగా వచ్చాడు. కామ్రేడ్ సునీల్ కంపెనీకి వచ్చిన కొత్త లోనే దక్షిణ్ బస్తర్‌లోని గొమ్ము గూడెం వద్ద శత్రువు చేసిన దాడిలో 4గురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఆ దాడిలో ఆయుధం లేకున్న ధైర్యంగా తోటి కామ్రేడ్స్‌తో సురక్షితంగా రిట్రీట్ అయ్యాడు. ఆయనలోని నిబద్ధతను చూసి కంపెనీలో ప్లాటూన్ కమండర్‌కు గార్డుగా నియమించగా కామ్రేడ్ సునీల్ అమరుడయ్యేవరకు గార్డు బాధ్యతలు ఎంతో క్రమశిక్షణతో ఉంటూ కమాండర్‌తో పాటూ అందరు క్యాడర్‌తో కలసి మెలసి ఉండేవాడు తనకు చెప్పిన ప్రతి పనిని బాధ్యతయుతంగా చేసేవాడు. పార్టీ చెప్పే కమ్యూనిస్టు రాజకీయలను శ్రద్ధతో వింటూడేవాడు. చదువు నేర్చుకోవడం కోసం ఎంతో ప్రయత్నం చేస్తూం దేవాడు ఎంత కష్టమైన పనిని అయిన నేను చేయను అనేమాటా కామ్రేడ్ సునీల్ నుండి ఎప్పుడు వచ్చేది కాదు.

కామ్రేడ్ సునీల్ అతి చిన్న వయసులో పార్టీలోకి వచ్చి పార్టీ నిర్ణయానుసారం కొత్త ప్రాంతం కొత్త వ్యక్తులు అయినప్పటికి ఎంతో పట్టు దలతో పార్టీ క్రమశిక్షణను పాటిస్తూ ప్రతిపనిలో పాల్గొనేవాడు. కామ్రేడ్ సునీల్ 6 డిసెంబర్ 2019న ప్రమాదవశత్తు తుపాకి ఫైర్ అయ్యి అమరుడు అయ్యాడు. కామ్రేడ్ సునీల్ అమరరహై! కామ్రేడ్ సునీల్ ఆశయాలను కొనసాగిద్దాం!

## కామ్రేడ్ కామేశ్వరి (రింకీ) స్మరణలో...

ఏవోబీ విప్లవోద్యమం మరొక అమూల్యమైన కామ్రేడ్‌ను కోల్పోయింది. మే 8న కోరాపుట్ జిల్లా కితుబా గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో దాసు, క్రిష్ణ, క్రాంతి, గీత అనే కామ్రేడ్స్‌తో పాటు కామ్రేడ్ కామేశ్వరి అమరురాలైంది. అమరుల్లో గీత మాత్రమే కొత్త కామ్రేడ్. దాసు, క్రిష్ణ, క్రాంతి ఏసీ స్థాయి కామ్రేడ్స్. దీర్ఘకాలం పాటు విప్లవోద్యమంలో విలువైన సేవలందించిన వాళ్లు. అయితే కామ్రేడ్ కామేశ్వరితో మాత్రమే నాకు సన్నిహిత పరిచయం వుంది. అందుకే తన గురించి కొన్ని విషయాలనైనా కామ్రేడ్స్‌తో, ఉద్యమ శ్రేయోభిలాషులతో, తన బంధు మిత్రులతో పంచుకోవాలనిపిస్తోంది. తన జీవిత చరిత్రను ఏవోబీ పార్టీ, తన జ్ఞాపకాలను తనతో కలిసి మెలిసి పని చేసిన కామ్రేడ్స్ వివరంగానే రికార్డ్ చేసే అవకాశం వుంది. అయినప్పటికీ తన గురించి కొంతైనా చెప్పాలనే ఆరాటం. వైవిధ్యభరితమైన తన జీవితం నుంచి పాఠాలుగా నేర్చుకునే ఎన్నో విషయాలున్నాయి.

కామ్రేడ్ కామేశ్వరి స్వరూప పేరుతో ఒడిశాలో, రింకీ పేరుతో ఏవోబీలో పని చేసింది. ఏవోబీలో కూడా తను పని చేసింది ఒడిశా భూభాగంలోనే. అలా చూసుకుంటే తను బయట పనిచేసింది ఆంధ్రాలో అయితే అటవీ ఉద్యమంలోకి వచ్చాక పనిచేసింది పూర్తిగా ఒడిశా రాష్ట్రంలోనే. ఏవోబీలో మల్కన్‌గిరి, కోరాపుట్ సరిహద్దు ప్రాంతం ఆమె కార్యక్షేత్రంగా వుండింది. రింకీతో నేను భౌతికంగా కలిసి వున్నది కొద్ది కాలమే అయినప్పటికీ మనసు విప్పి అన్ని విషయాలు



మాట్లాడుకోగలిగిన, కష్ట సుఖాలు పంచుకోగలిగిన సాన్నిహిత్యం మా మధ్య ఏర్పడింది. తనలో నాకు నచ్చిన, నన్ను ఇన్‌స్పైర్ చేసిన విషయాలు ఎన్నో. తన అమరత్వపు వార్త తెలిసినప్పటి నుండీ ఉద్యమానికి ఇంకెంతో సేవలను అందించగలిగిన కామ్రేడ్‌ను కోల్పోయిన బాధతో బాటు వ్యక్తిగతంగా కూడా పూడ్చుకోలేని ఒక వెలితి నన్ను వెంటాడుతూ వుంది.

రింకి మనసులో మెదిలినప్పుడల్లా నాకు మరి కొందరు అమరులు కూడా గుర్తుకొస్తారు. వాళ్ల ప్రస్తావన లేకుండా తన గురించి చెబితే అది అసమగ్రమే అవుతుంది. వాళ్లు కామ్రేడ్స్ విశ్వం, శ్వేత, శ్రీను. కామ్రేడ్ శ్వేత రింకీకి తోడబుట్టిన చెల్లి. కామ్రేడ్ శ్రీను రింకీ జీవిత భాగస్వామి. కామ్రేడ్ విశ్వం రింకీకి అభిమానపాత్రుడైన నాయకుడు. ఆ ముగ్గురూ ఆమె జీవితాన్ని రాజకీయంగా చాలా ప్రభావితం చేసారు, మలుపు తిప్పారు.

నేను మొదటగా రింకీ గురించి విన్నది కామ్రేడ్ విశ్వం ద్వారానే. అప్పుడు విశ్వం విశాఖ సిటీ కమిటీ సభ్యుడిగా రాజమండ్రిలోని ఆర్‌టీసీ రంగాన్ని గైడ్ చేస్తుండె. రింకీ ఉద్యమ జీవితంలోకి వెళ్లే ముందు ఆమె వ్యక్తిగత జీవితాన్ని కొంత పరిచయం చేస్తాను. నిజానికి తన గురించి తాను చాలా వివరంగానే చెప్పుకుంది. ఇప్పుడనిపిస్తుంది – దాన్ని మంచిగా రికార్డ్ చేసి వుంటే బాగుండునని. కానీ అప్పుడు నాకేం తెల్సు నా కంటే వయసులో చిన్నదైన తన గురించి రాయాల్సిన దుస్థితి వస్తుందని. నా జ్ఞాపకశక్తిపై ఆధారపడి రాసే విషయాల్లో కొన్ని పొరపాట్లు దొర్లవచ్చు. ఆ పొరపాట్లను ఎవరైనా సవరిస్తే మరీ మంచిది.

కామ్రేడ్ కామేశ్వరి పుట్టింది తూర్పు గోదావరి జిల్లాలో. అమలాపురం తాలూకా ముమ్మడివరం వాళ్ల స్వగ్రామం అని పేపర్లో వచ్చింది. బహుశా నిజమే కావొచ్చు. కానీ వాళ్ల కుటుంబం స్థిరపడింది మాత్రం అమ్మ పుట్టిల్లు శ్రీకాకుళం జిల్లా బుడితి గ్రామంలో. కామేశ్వరి యింటికి పెద్ద బిడ్డ. ఆమెకు ముగ్గురు చెల్లెళ్లు. తండ్రి అకాల మరణంతో తల్లే చిన్న ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పెంచి పోషించుకుంది. రింకీ తరచుగా “చిన్నప్పుడు బలాదూర్‌గా తిరిగేదాన్ని. బుద్ధిగా, కుదురుగా కూర్చొని చదువుకోడం అంటే బొత్తిగా పడేది కాదు నాకు. ఎప్పుడూ ఆటపాటలతోనే గడిపేసేదాన్ని. ఇంటి పని కూడా చేసేదాన్ని కాదు. అసలు నాకు ఆడపిల్ల లక్షణాలే లేవు. మగరాయుడిలా తిరిగేదాన్ని.

శ్వేత నాకు పూర్తిగా వ్యతిరేకం. కుదురుగా వుండేది. ఇంటి పనులన్నీ మీదేసుకొని ఓపిగ్గా చేసేది. ఇంటికి పెద్ద కూతురులాగా చాలా బాధ్యతగా వుండేది" అని చెప్పేది. పదో తరగతో, ఇంటర్ మీడియటో చదివిన తర్వాత రింకీకి మేనమామతో పెళ్లయింది. తర్వాత తను ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగంలో చేరింది. ఒక పాప– ముద్దు పేరు చిన్నారి – పుట్టింది. ఇలా యించుమించు సాఫీగా సాగిపోతున్న వాళ్ల కుటుంబం ఒక తీవ్రమైన కుదుపుకు గురైంది. శ్వేత జీవితం ఆ కుదుపుకు కేంద్రం అయింది. ఇతర రాష్ట్రం (ఏ రాష్ట్రమో గుర్తు లేదు. బీహార్ లేదా ఉత్తర ప్రదేశ్ అయివుంటుంది)లో సెటిల్ అయిన ఒక తెలుగు కుటుంబంలోని వ్యక్తితో శ్వేత పెళ్లయింది. పెద్దగా కట్నం ఆశించని ధనిక కుటుంబంతో పెళ్లి సంబంధం అంటే సాధారణంగా ఏ మధ్య తరగతి కుటుంబమయినా సంతోషించడం సహజమే కదా. శ్వేత అదృష్టవంతురాలని అందరూ మురిసిపోయారు. కానీ ఆ మురిపెం మూడు రోజులు కూడా మిగలలేదు. పెళ్లయిన రోజే శ్వేతతో పాటు, తోడుగా ముగ్గురు అక్కా చెల్లెళ్లు మగ పెళ్లివారింటికి వెళ్లారు. ఆ తర్వాత ఏం జరిగిందో నేను కామేశ్వరి స్వరంలోనే చెప్పే ప్రయత్నం చేస్తాను.

"ఫస్ట్ నైట్ జరిగిన తెల్లవారి శ్వేత మొహంలో నాకు ప్రేతకళ కనబడింది. నేను వర్రీ అయిపోయాను. ఏమై వుంటుంది? తనతో మాట్లాడుదామంటే నాకు అవకాశమే దొరకలేదు. ఇంటి నిండా మనుషులు. ఒంటరిగా తనతో మాట్లాడే అవకాశమే చిక్కలేదు. నేను మామూలుగానే ఉండడానికి ప్రయత్నించాను. తన మొహంలోని భావాలను పసిగట్టనట్టుగానే వుండిపోయాను. తొందరపడకుండా అవకాశం కోసం ఎదురుచూశాను. సాయంత్రం గుడికి వెళ్దామని బయల్దేరతీశాను. ఆ యింటి మహిళలు కూడా మాతో వచ్చారు. గుడిలో ఏదోలా వీలు చేసుకొని ఏమైందని అడిగాను. దానికది 'వాడసలు మగాడే కాదు. వాడో పెద్ద గూండా, శాడిస్టు. వాళ్లింట్లో దేవుడి గదిలో కత్తులూ, కటార్లూ, తుపాకులు కూడా వున్నాయి. నా జీవితం సర్వ నాశనం అయింది. ఈ విషయం బయటకు పొక్కితే మనల్నందరినీ చంపేస్తానన్నాడు' అంది. అంతకంటే చెప్పే అవకాశం లేదక్కడ. నేను షాక్ తిన్నాను. ఎలాగో తేరుకొని 'నువ్వు మామూలుగా వుండు. నేను చూసుకుంటాను. నేను ఏదో విధంగా నిన్నిక్కడి నుండి తీసుకెళ్లిపోతాను' అని చెప్పాను. చెప్పడమైతే చెప్పాను కానీ ఏం చేయాలో నాకు పాలుపోలేదు. ఆ రాత్రి నాకు కాళరాత్రే అయింది. ఆ రాత్రి వాడి గదిలోకి వెళ్తున్న శ్వేతను చూస్తే పులిబోనులోకి వెళ్తున్న లేడిపిల్లే గుర్తొచ్చింది. కానీ దాన్ని వెళ్లకుండా ఎలా ఆపగలను? రూంలో దాన్నెంత హింసపెడుతున్నాడోనని తలుచుకుని వణికిపోయాను. అర్ధ రాత్రి దాటాక ఇంటి ముందు ఏదో అలికిడయినట్టనిపిస్తే లేచి తలుపులు తీసుకొని బయటకు వెళ్లాను. కార్ షెడ్ వద్ద కారుకు ఆనుకొని శ్వేత నిలబడి వుంది. దానికి ఎదురుగా వాడు నిలబడి వున్నాడు. ఇద్దరూ ఏదో వాదించుకుంటున్నట్టుగా అనిపించింది. అదేమీ గమనించనట్టుగా నేను గభాలున అక్కడికి వెళ్లాను. శ్వేతను వాడితో వంటరిగా వదిలేయొద్దనుకున్నా. 'ఏంటండీ మరిది గారూ, చల్లగాలి కోసం బయటకొచ్చారా? కొత్త ప్లేస్ కదా నాక్కూడా నిద్రరావడం లేదు' అంటూ వాళ్ల మధ్యలో దూరిపోయి కబుర్లు మొదలుపెట్టాను. జోకులు, పరిహాసాలతో దాదాపు వేకువ ఝాము వరకూ ఏదో ఒకటి వాగుతూనే వున్నా. శ్వేతను మళ్లీ వాడి గదిలోకి వెళ్లనీయకుండా చేయాలనుకున్నా. వాడికేమీ మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదు. ఆఖరులో మెల్లగా 'మా చెల్లి చాలా లక్కీ అండీ. మాక్కూడా మీ యింట్లో చాలా సరదాగా గడిచింది. ఇంకా వుండిపోవాలనుంది కానీ నాకు లీవ్ దొరకదు. అందుకే వెళ్లాలి. మాతో పాటు మీరిద్దరూ కూడా రావాలి. ఓ నాలుగు రోజులు సరదాగా గడిపి వచ్చేద్దురు గానీ' అన్నాను. దానికి వాడు ససేమిరా అన్నాడు. 'పొద్దున పెళ్లయిందంటే సాయంత్రం బయల్దేరి వచ్చేశారు. మా బంధువులకన్నా పరిచయం కాలేదు. మాకూ అచ్చటా, ముచ్చటా వుంటుంది కదండీ' అన్నాను. అప్పటికీ వాడు ఒప్పుకోలేదు. కుదరదంటూ ఇంట్లోకి వెళ్లిపోయాడు. అప్పుడు శ్వేత దుఃఖాన్ని అదిమిపడుతూ మెల్లగా చెప్పింది 'అదిగో ఎదురుగా కొండమీద లైట్లు కనబడుతున్నాయి చూడు. అది గెస్ట్ హౌస్ అట. దాంట్లో వాడి ఫ్రెండ్స్ వున్నారట. వాళ్ల దగ్గరికి నన్ను తీసుకెళ్లడానికి బయల్దేరతీశాడు.' నోట మాట రాలేదు నాకు. నేను బయటకు రాకుంటే దాని బతుకేమై వుండేదోననే ఊహకే వణికిపోయాను. అప్పటికి దానికి అంతకంటే చెప్పే అవకాశం లేదు. కానీ ఆ తర్వాత తెలిసిన విషయం ఏంటంటే వాడొక మాఫియా గూండా. ఆ ఫ్యామిలీనే అటువంటిది. అయితే వాడి శారీరక లోపం గురించి వాడి కుటుంబానికి కూడా తెలియదు. తన లోపం బయట పడకుండా వుండడం కోసం భార్యా, పిల్లలు కావాలనుకున్నాడు. అందుకే శ్వేతను వాడి ఫ్రెండ్స్ దగ్గరకు తీసుకెళ్లాలనుకున్నాడు. ఆ సుడిగుండం నుండి దాన్నెలాగయినా బయటపడేయాలనుకున్నాను. వాడు దాన్ని పంపించేలా లేడనిపించాక వాడి నాయనమ్మను కన్విన్స్ చేయడం మొదలుపెట్టాను. ఆచారాలూ, సాంప్రదాయాలను ఏకరువు పెట్టాను. పంపించం అని చెప్పడానికి వాళ్లకు కారణం కనబడలేదు. నాయనమ్మ మనవడిని ఒప్పించింది. చివరికి శ్వేతను మూడు, నాలుగు రోజుల కోసం పంపడానికి వాడు బలవంతంగా ఒప్పుకున్నాడు. 'మీరు రాకుండా తనను ఒక్కదాన్నే పంపడం ఏమీ బాలేదండీ. తీసుకెళ్లడానికి మాత్రం మీరు తప్పకుండా రావాలి మరి. మీరు రాకుంటే మా చెల్లిని పంపించం' అంటూ పరిహాసాలాడుతూనే మేం ఆ గడపదాటేశాం. మమ్మల్ని దిగబెట్టడానికి కారును పంపించారు. కారు ఏపీ బార్డర్‌లోకి వచ్చాక నాక్కొంచెం ధైర్యం వచ్చింది. ఇంతలో కారుకు ఏదో చిన్న ట్రబుల్ రావడంతో కారు డ్రైవర్‌తో 'ఇక్కడి నుండి మేం వెళ్లిపోతాం. నువ్వు కారును తీసుకొని వెనక్కి వెళ్లు' అని చెప్పాను. 'మిమ్మల్నిలా మధ్యలో వదిలేసి పోతే నన్ను చంపేస్తారండీ' అన్నాడతను. 'ఏం కాదు నేను చెబుతానులే. నేను ఆర్టీసీలో పని చేస్తానుగా. బస్ ఛార్జీలు కూడా వుండవు. కారు ఎందుకు? పెట్రోల్ ఖర్చు దండగ' అంటూ కన్విన్స్ చేశాను. అతను అయిష్టంగానే, భయం భయంగానే వెళ్లిపోయాడు. అతను వెళ్లిపోయాక కానీ నేనూ, శ్వేతా ఫ్రీగా మాట్లాడుకోలేక పోయాం. ఎలాగోలా దాన్ని తెచ్చాను గానీ ఆ తర్వాత ఏం చేయాలో నాకు పాలుపోలేదు. వాడు గూండాలను వెంటేసుకొచ్చి మా యింటి మీద బాంబులేసైనా దాన్ని తీసుకెళ్లగలడనిపించింది. బాగా ఆలోచించాను. నాకప్పుడు శ్రీను గుర్తొచ్చాడు. నాకప్పటికి తనతో పెద్దగా పరిచయం లేదు. తను యూనియన్ లీడర్ అని మాత్రం తెల్సు. నేను యూనియన్ ఆక్టివిటీస్‌లో పెద్దగా పాల్గొనే దాన్ని కాదు. ఇంట్లో మా చెల్లీ వాళ్లను దింపేసి నేను క్షణం ఆలస్యం చేయకుండా శ్రీను దగ్గరకు వెళ్లాను. విషయమంతా విని తను నాకు ధైర్యం చెప్పాడు. భరోసానిచ్చాడు. మూడు నాలుగు రోజుల తర్వాత శ్వేతను తీసుకెళ్లడానికి వాడొచ్చాడు. మరి కొందరు

కుటుంబసభ్యులు కూడా వచ్చారు. శ్రీను వాళ్ల టీం తయారుగా వుంది. వచ్చిన వాళ్లందరినీ కట్టేశారు. నక్సలైట్లమని చెప్పారు. పిచ్చి పిచ్చి వేషాలేస్తే చంపేస్తామని బెదిరించారు. వాడితో విడాకుల పేపర్ మీద సంతకం చేయించారు. ఆ తర్వాత మ్యూచువల్ కన్‌సెంట్‌తో కోర్టులో విడాకులకు అప్లై చేశాం. జడ్జిమెంట్ వచ్చే రోజున కోర్టులో వాడొస్తాడని ఎదురుచూసాం. వాడు రాలేదు. వాడి ఆబ్‌సెన్స్‌లోనే విడాకులు మంజూరు అయ్యాయి. అయితే మేం ఇంకా కోర్టు ఆవరణలో వుండగానే మాకు తెల్సిన విషయం ఏంటంటే, వాడు కోర్టుకు రావడానికి కారులో బయల్దేరాడట. మధ్యలో ఒక రైల్వే క్రాసింగ్ వద్ద కార్‌కు ఆక్సిడెంట్ అయి వాడు చనిపోయాడట. శ్వేత ఎంత పిచ్చిదంటే విషయం తెలిసి పీడా విరగడయిందని సంతోషించాల్సింది పోయి ఏడవడం మొదలు పెట్టింది. సెంట్‌మెంట్‌తో కాదు, ఒక మనిషి ప్రాణం పోయింది కదా అనే దానితో."

శ్వేతనూ, తమ కుటుంబాన్నీ ఆ గండం నుండి గట్టెక్కించిన కామ్రేడ్ శ్రీనుపై, అతడి కార్యకలాపాలపై కామ్రేడ్ రింకీకి మంచి గురి ఏర్పడింది. స్వభావరీత్యా చొరవ, సామాజిక విషయాల పట్ల స్పందన వున్న మనిషి కావడంతో యూనియన్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం మొదలు పెట్టింది. అట్లా శ్వేత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పీడకల లాంటి ఘటన రింకీని ఉద్యమాలకు దగ్గర చేసింది. దానితో ఆమె వ్యక్తిగత జీవితంలో అశాంతి మొదలైంది. నిజానికి మొదటి నుండీ రింకీకీ, ఆమె భర్తకూ నడుమ మంచి సంబంధాలు లేవు. ఆమె భర్త సగటు మగవాడు. సగటు మగవాడు మహిళ అస్తిత్వం ఇంటి నాలుగు గోడలకే పరిమితం కావాలనుకొంటాడు. ఇంటి బయట చేసే ఉద్యోగమైన మరే పనయినా ఇంట్లో ఆమె నిర్వర్తించే పాత్రకు దోహదం చేయాలనే అనుకుంటాడు. అందుకే కామ్రేడ్ రింకీలో వికసిస్తున్న చైతన్యాన్ని అతను భరించలేకపోయాడు. ఆమె సామాజిక కార్యకలాపాలను అడ్డుకోవాలని చూశాడు. మహిళల క్రియాశీలతను దెబ్బకొట్టడానికి పితృస్వామ్య సమాజం చేతిలో తయారుగా వుండే ఒకానొక ఆయుధం వాళ్ల శీలంపై బురద చల్లడం. యూనియన్ కార్యకలాపాల్లో భాగంగా ఇంటికి వచ్చి పోయే శ్రీనుతో సంబంధం అంటగట్టి ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. కామ్రేడ్ రింకి ఆ అవమానాన్ని భరించలేకపోయింది. తన జీవితంపై అతని పెత్తనం ఇక చెల్లదనుకుంది. తన జీవితాన్ని తీర్చిదిద్దుకునే అధికారాన్ని తన చేతుల్లోకే తీసుకోవాలనుకుంది. అందుకే విడాకులు తీసుకొంది. చిన్నారిని తనతోనే వుంచుకొంది. ఆ తర్వాత ఆమె యూనియన్ కార్యకలాపాల్లో మరింతగా నిమగ్నమైంది.

ఆ సమయంలో ఆమెకు కామ్రేడ్ విశ్వం పరిచయమయ్యాడు. కామ్రేడ్ విశ్వం ఆమెను చాలా ప్రభావితం చేశాడు. రాజకీయంగా ఆమెను తీర్చిదిద్దడంలో విశ్వం పాత్ర చాలా ముఖ్యమైంది. వాళ్లిద్దరికీ ఒకరి పట్ల ఒకరికి విశ్వాసం, అభిమానం మెండుగా వుండేవి. ఆ సమయంలోనే కామ్రేడ్ శ్రీను అజ్ఞాత జీవితంలోకి వెళ్లాడు. ఒడిశా రాష్ట్రంలోని పట్టణోద్యమంలో ఆయన భాగమయ్యాడు. ఆర్‌టీసీ రంగంలో శ్రీను నిర్వహించిన బాధ్యతలను కామ్రేడ్ కామేశ్వరి తన భుజానికెత్తుకుంది. విశ్వం మార్గదర్శకత్వంలో కార్మిక రంగ నేతగా ఆమె ఆ రంగానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించింది. తోటి ఉద్యోగుల అపార విశ్వాసాన్ని చూరగొంది. పురుషాధిక్య సమాజంలో ట్రేడ్ యూనియన్ రంగంలో ఒక మహిళ నాయకత్వంలోకి రావడం సాధారణ విషయమేమీ కాదు. తన చొరవ, కలుపుగోలు స్వభావం ఆమెను అందరికీ సన్నిహితురాలిని చేశాయి. ఆమె ఒక మిలిటెంట్ ఆందోళనాకారిణి. డేషింగ్ నాయకురాలు. మంచి వక్త.

అజ్ఞాతవాసంలోకి వెళ్తున్న శ్రీనుకు సెండాఫ్ ఇవ్వడంలో భాగంగా కామ్రేడ్ కామేశ్వరి అతనితో పాటు కొద్ది దూరం బస్సులో ప్రయాణించింది. శ్రీనుతో తన జీవితాన్ని పంచుకోవాలనుకుంటున్నట్టు ఆ బస్సులోనే ఆమె శ్రీనుకు తెలియజేసింది. శ్రీను వెంటనే ఒప్పుకోలేదు. తన పాజిటివ్స్, నెగటివ్స్ చెప్పి కొంత టైం తీసుకొని లోతుగా ఆలోచించి నిర్ణయం తీసుకోమన్నాడు. కానీ ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. కొద్ది కాలం తర్వాత పార్టీ అనుమతితో వాళ్లిద్దరూ జీవిత సహచరులయ్యారు.

ఈ క్రమంలోనే కామ్రేడ్ శ్వేత కూడా విశ్వం పరిచయంలోకి వచ్చింది. కొద్ది కాలంలోనే శ్వేత తన జీవితాన్ని పూర్తిగా విప్లవానికే అంకితం చేయాలని నిర్ణయించుకుంది. చెల్లి నిర్ణయాన్ని రింకీ హృదయపూర్వకంగా స్వాగతించింది. 2004లో శ్వేత గెరిల్లా జీవితంలోకి అడుగుపెట్టింది. తాను అమితంగా ప్రేమించే చెల్లి, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొన్న చెల్లి తన జీవితాన్ని అర్థవంతంగా మార్చుకుందనే సంతృప్తి, సంతోషాలను రింకీ హృదయం పూర్తిగా ఇముడ్చుకోకముందే ఆమె నెత్తిన పిడుగుపడింది. గెరిల్లా జీవితంలోకి అడుగుపెట్టి సంవత్సరం తిరగకుండానే 2005 ఫిబ్రవరిలో మల్కన్‌గిరి జిల్లాలో జరిగిన ఒక శత్రు దాడిలో కామ్రేడ్ శ్వేత అమరురాలైంది. ఈ ఎన్‌కౌంటర్ వార్త పేపర్లలో వచ్చింది కానీ మృతుల పేర్లను పోలీసులు ప్రకటించలేదు. బహుశా శత్రువు కూడా శ్వేతను గుర్తించలేదు. అందువల్ల శ్వేత మృతదేహం అనామకంగానే మట్టిలో కలిసిపోయింది. ఆమె అమరత్వపు వార్త కూడా రింకీకి చాలా రోజుల వరకూ తెలియలేదు. వాళ్లొక పెద్ద ఆందోళనా కార్యక్రమంలో నిమగ్నమై వున్నప్పుడు ఒక రాత్రి పిడుగులాంటి ఆ వార్తను శ్రీను ఫోన్ ద్వారా ఆమెకు తెలియజేశాడు. శ్వేత గెరిల్లా జీవితంలోకి వెళ్లిందనే విషయం బహుశా వాళ్ల చెల్లెళ్లిద్దరికీ తెలుసనుకుంటా. ఆర్‌టీసీ రంగంలో కామేశ్వరితో పాటు పని చేసే ఒకరిద్దరు పార్టీ సభ్యులకు కూడా తెలుసు. కానీ వాళ్లమ్మకీ, ఇతర బంధు మిత్రులెవరికీ తెలియదు. ఎక్కడో దూరాన ఉద్యోగంలో చేరిందని అందరికీ చెప్పారు. అటువంటి పరిస్థితిలో సడెన్‌గా ఆమె అమరత్వపు వార్తను అందరికీ ఎలా తెలియజేయాలో ఆమెకు అర్థం కాలేదు. పైగా అమ్మ తట్టుకోలేదని ఆమె భావించింది. అందుకని గుండెలు పిండేసే ఆ వార్తను ఆమె రహస్యంగానే వుంచాలని నిర్ణయించుకుంది. అలా గరళం లాంటి ఆ విషాదాన్ని ఆమె తన గొంతులోనే దాచుకుంది. ఆమెతో పాటు పనిచేసే ఒక పార్టీ సభ్యుడికి మాత్రమే విషయం తెలియజేసింది. వార్త విన్న మరుసటి రోజు ధర్నా కార్యక్రమం వుండింది. ఆ ధర్నాను ఉద్దేశించి ఆమెనే ప్రసంగించాల్సి వుంది. దుర్భరమైన ఆ వేదనను అనుభవిస్తూనే ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం ఆ కార్యక్రమాన్ని నిర్వహించింది. వేదిక ఎక్కి ప్రసంగించింది. ఆ రోజు ఆమెను కొంతమంది 'డల్‌గా వున్నారేంటి?' అని మాత్రం అడిగారు. 'జ్వరంగా వుంది' అనే అబద్ధాన్ని అందరూ నమ్మేశారు కానీ ఆమె హృదయంలో రగులుతున్న బడబానలాన్ని ఎవరూ గ్రహించలేక పోయారు. ఈ విషాదాన్ని కొద్ది రోజులకు తన ఇద్దరు చెల్లెళ్లకు చెప్పింది గానీ వాళ్లమ్మకు మాత్రం తాను అజ్ఞాతంలోకి వచ్చేప్పుడు కూడా చెప్పలేదు.

శ్వేత మరణం సహజంగానే ఆమెను చాలా కుదిపేసింది. అయితే ఆమె విప్లవదీక్షను మాత్రం మరింత దృఢపరిచింది. ఆ తర్వాత క్రమంగా శత్రువు నిఘా ఆమెపై బాగా పెరిగింది. దానితో పార్టీ నిర్ణయం మేరకు ఆమె 2009 సెప్టెంబర్‌లో గెరిల్లా జీవితంలోకి అడుగుపెట్టింది. అప్పటికి శ్రీను కూడా పట్టణోద్యమం నుండి అటవీ ఉద్యమానికి బదిలీ అయ్యాడు. ఒడిశా రాష్ట్రంలోని ఘుంసర దళంలో రింకీ మొదట పని చేసింది. 2010 మార్చిలో నియమగిరి దళంలోకి బదిలీ అయింది. రవి పేరుతో ఆ దళ కమాండర్‌గా కామ్రేడ్ శ్రీను పని చేస్తుండె. నియమగిరి కొండలను వేదాంత నుండి కాపాడే కర్తవ్యంతో ఆదివాసీ ప్రజలను సంఘటితం చేస్తూ, ఒక మిలిటెంట్ ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఆ దళం కృషిలో తన సహచరుడితో పాటు భుజం భుజం కలిపి రింకీ పని చేసింది. అయితే తన సహచరుడితో పాటు కలిసి ఎక్కువ కాలం పని చేసే అవకాశం ఆమెకు దక్కలేదు. కార్పొరేట్ రంగాలకు సేవ చేసే ప్రభుత్వాలు వేదాంతకు వ్యతిరేకంగా ఉధృతమవుతున్న ఉద్యమాన్ని సహించలేకపోయాయి. నియమగిరి దళాన్ని వేటాడడానికి పెద్ద ఎత్తున పోలీసు కుక్కలను మోహరించాయి. ఫలితంగా 2011 జనవరిలో ఆ దళంపై జరిగిన దాడిలో కామ్రేడ్ శ్రీనుతో సహా ఏడుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. కొంత మంది కామ్రేడ్స్‌తో పాటు రింకి కూడా ఆ దాడి నుండి తప్పుకుంది. ఒకరిద్దరు కామ్రేడ్స్ గాయాలతో బయటపడ్డారు. కొద్ది సేపటి క్రితం వరకూ తమతో కలిసి మెలిసి నవ్వుతూ, తుళ్లుతూ వున్న కామ్రేడ్స్, ఒకరు కాదు, ఇద్దరు కాదు, ఏడుగురు కామ్రేడ్స్ అమరులు కావడం, అందులోనూ కొంత మంది తన కండ్ల ముందే నెత్తురోడుతూ కుప్పకూలడం, అందులో తను ప్రాణాధికంగా ప్రేమించిన తన జీవిత భాగస్వామి కూడా వుండడం, గాయపడి కొన ఊపిరిలో వున్న కామ్రేడ్స్‌కు చివరి వీడ్కోలు కూడా చెప్పే, ఓ కన్నీటి చుక్కను రాల్చే అవకాశం కూడా లేకపోవడం... వర్ణనాతీతమైన ఆ వేదనను తనెలా భరించగలిగిందో. అసలు కండ్ల ముందు ఏం జరుగుతున్నదో గ్రహించే, ఏం జరిగిందో నెమరేసుకునే అవకాశం కూడా లేదక్కడ. ఇక జరగాల్సిందేంటి అనేదే తను ఆలోచించింది. బయటపడ్డ కామ్రేడ్లందరిలోకీ వయసులోనూ, అనుభవంలోనూ పెద్దదయిన రింకీ ఆ సమయంలోనూ తన కర్తవ్యాన్ని విస్మరించలేదు. ఎన్‌కౌంటర్ నుండి బయటపడ్డాక ఒక గ్రామ పరిసరాల్లో ఆగి కబురు చేస్తే గ్రామస్తులు అంబలి పట్టుకొని వచ్చారు. 'ఎన్‌కౌంటర్ జరిగి రెండు, మూడు గంటలైనా గడవక ముందే మేం అంబలి తాగాం తెల్సా' అని చెప్తున్నపుడు తన మొహంలో విషాదమూ, కర్తవ్య నిర్వహణ పట్ల అంకితభావం కలగలిసిపోయాయి. "కామ్రేడ్స్ ఏడుస్తూ అంబలి తాగడానికి మొరాయిస్తుంటే 'మన అమరుల ఆశయాలను బతికించాలంటే మనం అంబలి తాగాల్సిందే' అని నేను కఠినంగా చెప్పాను" అంది తను. ప్రజల సహాయంతో మందులు తెప్పించి గాయపడిన కామ్రేడ్స్‌కు చికిత్స అందించింది. తానే ఒక ఓదార్పునూ, ధైర్యాన్ని కోరుకునే స్థితిలో వుండి, ఇతర కామ్రేడ్స్‌ను ఓదార్చుతూ, ధైర్యం చెప్తూ ఆ సమయంలో వాళ్లకు పెద్ద అండగా ఆమె నిలబడిన తీరు ఆదర్శనీయం. ఏవోబీ, ఒడిశా జోన్లకు మధ్య సమన్వయంలో భాగంగా కోరాపుట్ డివిజన్‌కు ఒక అపాయింట్‌మెంట్‌కు వెళ్లాలని ఎన్‌కౌంటర్‌కు ముందే ఆ దళం కార్యక్రమాన్ని రూపొందించుకుని వుంది. అంత మంది కామ్రేడ్స్ అమరులై, కొందరు గాయపడి, మిగిలిన కామ్రేడ్సంతా కలత చెంది వున్న ఆ పరిస్థితిలో కూడా ఎన్‌కౌంటర్‌కు ముందు నిర్ణయించుకున్న కార్యక్రమాన్ని అమలు చేయడానికి మిగిలిన సభ్యులను తను సన్నద్ధం చేసింది. గాయపడిన కామ్రేడ్స్‌ను తీసుకొని వెళ్లడం కష్టమనీ, వాళ్లనెక్కడైనా వుంచి వెళ్దామని కొంత మంది కామ్రేడ్స్ మాట్లాడితే తను ససేమిరా అంగీకరించలేదు. వాళ్లను మోసుకొనే వెళ్లడానికి కామ్రేడ్స్ అందరినీ కన్విన్స్ చేసింది. గాయపడిన కామ్రేడ్స్‌కు చికిత్సనూ, సేవలను అందిస్తూ, కామ్రేడ్స్‌కు ధైర్యం చెబుతూ తను కోరాపుట్‌కు చేరుకుంది. ఆమె ఓదార్చింది కేవలం కామ్రేడ్స్‌నే కాదు. నియమగిరి ప్రాంతంలో కామ్రేడ్ శ్రీను చాలా ఆదరణను పొందిన నాయకుడు. అతనితో సహా ఏడుగురు కామ్రేడ్స్ మరణించడం ఆ ప్రాంత ప్రజలను తీవ్ర దుఃఖంలో ముంచెత్తింది. దారిపొడుగూతా గ్రామాల్లో మీటింగ్‌లు చేస్తూ, ప్రజలకు ధైర్యం చెబుతూ వాళ్ల ప్రయాణం సాగింది. కోరాపుట్ డివిజన్‌లో కామ్రేడ్ దయ (రాంగూడ అమరుడు)తో పాటు ఇతర ఎస్‌జడ్‌సీ సభ్యులు కలిసినపుడు మాత్రమే ఆమెకు తన దుఃఖాన్ని పంచుకొనే అవకాశం దొరికింది. అంతవరకూ తొణకని కుండలా వున్న ఆమె వాళ్లు కల్సాక దుఃఖ ప్రవాహమైంది. ఆ తర్వాత కొన్నాళ్లకు నేనామెను కల్సాను. దాదాపు రెండు నెలలపాటు మేం నారాయణపట్నా ప్రాంతంలో కలిసి వున్నాం. మానసికంగా తానెంత కలతచెంది వుందో నేను గ్రహించాను. కాల్పులూ, పేలుళ్ల శబ్దాలు ఇంకా తన చెవుల్లో మారుమోగుతున్నాయనీ, కామ్రేడ్స్ ఒరిగిపోతున్న దృశ్యం కండ్లల్లో కదలాడుతున్నదని తన వేదనను పంచుకుందామె. ఆ సమయంలో ఆమె కొన్నాళ్లు చిన్నారితో గడపాలని బాగా కోరుకుంది. కానీ విప్లవోద్యమంలో అటువంటి సాధారణ విషయాలు కూడా అసాధ్యమే అవుతాయి కనుక ఆమె కోరిక నెరవేరలేదు. అయితే నాయకత్వ కామ్రేడ్స్ అందించిన సహకారం, ఓదార్పుతో కామ్రేడ్ రింకీ క్రమంగా కోలుకుంది. నిలదొక్కుకుంది. అయితే తన సహచరుడు అమరుడైన ఆ ప్రాంతంలో మాత్రం పనిచేయడానికి నిరాకరించింది. ఆమె మనోభావాలను అర్థం చేసుకున్న పార్టీ ఆమెను ఏవోబీకి బదిలీ చేసింది.

కొద్ది కాలంలోనే ఆమె ఏవోబీ ఉద్యమంలో ఒక ఆధారపడిన నాయకురాలిగా ఎదిగింది. డివిజన్ కమిటీ సభ్యురాలిగా పార్టీకి అనేక సేవలనందించింది. ముఖ్యంగా విస్థాపన వ్యతిరేక పోరాటాలకు మార్గదర్శకత్వం వహించింది. ఆర్గనైజేషనల్‌గానే కాదు ఆమె అనేక సామర్థ్యాలను కలిగి వుండేది. ఆమెకు సాంస్కృతిక రంగం పట్ల చాలా ఆసక్తి వుండేది. ఆమె మంచి గాయకురాలు. నియమగిరి ఎన్‌కౌంటర్ తర్వాత తను కోరాపుట్ డివిజన్‌లో వున్నప్పుడు మార్చి నెలలో దేవ్‌మాలి ప్రాంతంలో విస్థాపన వ్యతిరేక బహిరంగ సభ జరిగింది. అక్కడికి ఒక బాల సాంస్కృతిక టీంను పంపాలని అక్కడి పార్టీ నిర్ణయించింది. కామ్రేడ్ దయ "ఆసక్తి వున్న పిల్లలయితే వున్నారు. కానీ వాళ్లకు నేర్పేవాళ్లు ఎవరూ లేరు" అన్నాడట. "అరె నేనున్నాను కదా" అని రింకీ అంటే ఆమె మానసిక స్థితిని పూర్తిగా ఎరిగిన దయ చాలా ఆశ్చర్యపోయాడట. అతని అంచనాలకు భిన్నంగా ఆమె ఆ బాధ్యతను స్వీకరించింది. కొన్ని నాటకాలను తయారు చేసి, పిల్లలతో రిహార్సల్స్ చేయించి, ఆ పిల్లలను ఒక మంచి సాంస్కృతిక దళంగా తీర్చిదిద్ది ఆ సభకు పంపించింది.

రాయడమంటే తనకు బద్ధకం వుండేది కానీ రాయగలిగే సామర్థ్యం మాత్రం మెండుగా వుండేది. కామ్రేడ్ విశ్వం ప్రోత్సాహంతో తూర్పు గోదావరి జిల్లాలోని జీడిపప్పు ఫ్యాక్టరీల్లో మహిళా కార్మికుల స్థితిగతుల

గురించి అధ్యయనం చేసి ఒక ఫీల్డ్ రిపోర్ట్ రాసింది. 'మహిళల బతుకుల్ని పీల్చిపిప్పి చేస్తున్న జీడిపప్పు ఫ్యాక్టరీలు' అనే శీర్షికతో మే-జూన్ 2003 మహిళా మార్గంలో ఆ రచన అచ్చయింది. అది ఆమె మొదటి రచన. దేవ్‌మాలి మీటింగ్ సందర్భంగా పిల్లలను సాంస్కృతిక దళంగా తీర్చిదిద్దిన తన అనుభవాలను రాయమంటే ఎస్. సుగుణ అనే కలం పేరుతో వీధినాటిక – నా అనుభవం అనే వ్యాసం రాసింది. ఏవోబీ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విడుదలైన తూర్పుకనుమ ప్రత్యేక సంచికలో అది అచ్చయింది. తర్వాత ఏవోబీ పత్రిక 'బోల్షివిక్' కోసం తను పలు రచనలు చేసింది. శ్వేత, శ్రీనుల గురించి రాయాలనే తన కోరికను చాలా సార్లు వ్యక్తం చేసింది. ఎలా రాస్తే బాగుంటుందో రెండు, మూడు సార్లు చర్చించింది కూడా. కానీ అది తనకు తీరని కోరికగానే మిగిలిపోయింది. రాయగలనా లేదా అనే అనవసరపు సంశయాలతో మొదలుపెట్టలేదు కానీ తను పూనుకుంటే ఆ యిద్దరి కామ్రేడ్స్ గురించి చక్కగా రాసి వుండేది. తన ఉత్తరాల శైలి కూడా ముచ్చటగా వుండేది. అక్షరాలను మనం చదువుతున్నట్టుగా అనిపించదు. మన ఎదురుగా కూర్చొని తనే కబుర్లు చెబుతున్నట్టుగా అనిపిస్తుంది. తన అలకలను, బుజ్జగింపులను అన్నింటినీ అనుభూతి చెందుతాం.

విప్లవోద్యమంలో ఆమె కాంట్రిబ్యూషన్ గురించి ప్రముఖంగా చెప్పుకొనే విషయాల్లో ఆమె ఒడియా భాషా ప్రావీణ్యం ఒకటి. ఒడియా భాషపై మంచి పట్టు సాధించి పార్టీ అవసరాల మేరకు ఒడియా నుండి తెలుగుకు, తెలుగు నుండి ఒడియాకు అనేక అనువాదాలు చేసింది. ఒడియాలో క్లాసులు కూడా చెప్పింది. నాకు తెలిసి ఒడియా మీద మంచి పట్టు సాధించిన అతి కొద్ది మంది తెలుగు కామ్రేడ్స్‌లో ఆమె ఒకరు. ఏవోబీలోనైతే బహుశా మొదటి స్థానం తనదే కావొచ్చు.

ఒకచోట కూర్చొని చేసే పనులంటే తనకు నచ్చకపోయినా టైపింగ్, డీటీపీ సహా పలు కంప్యూటర్ సంబంధిత పనులు నేర్చుకొని ఉద్యమావసరాలను తీర్చింది.

అనేక ప్రావీణ్యతలు కలిగి వున్న తను కొత్తా, పాతా, చిన్నా, పెద్దా అనే తారతమ్యాలు లేకుండా అందరితోనూ కలగలిసిపోయేది. స్నేహం చేసేది. కామ్రేడ్స్‌కు అవసరమైన సహకారాన్ని అందించేది. ఒకవైపు చిన్న పిల్లలను మించి అల్లరి చేసేది. కొంటె వేషాలూ వేసేది. మరో వైపు జూనియర్ కామ్రేడ్స్‌కే కాదు సీనియర్ కామ్రేడ్స్‌కు కూడా ఒక పెద్దక్కలాగా ప్రేమనూ, సహకారాన్ని అందించేది. అవసరమైన సేవలు చేసేది. అందుకే వయోభేదాలు లేకుండా, అన్ని స్థాయిల కామ్రేడ్స్ పైన ఆమె ప్రగాఢమైన ముద్రను వేసింది. తోటి కామ్రేడ్స్‌లోని మంచీ, చెడులను చక్కగా విశ్లేషించుకోగలిగేది. మంచిని ప్రేమిస్తూ చెడుతో కొట్లాడేది. మనుషుల్లోని సంకుచితత్వాన్ని అస్సలు భరించేది కాదు. ఒడిశా రాష్ట్రంలో తను పని చేసింది కొంత కాలమే అయినా 2011లో జరిగిన ఒడిశా ప్లీనంలో డెలిగేట్‌గా పాల్గొని సవ్యసాచి పండా మితవాద, అవకాశవాద వైఖరిని సునిశితంగా విమర్శించింది.

పట్టణ మధ్య తరగతి జీవితం నుండి, అది కూడా నడీడు వయసులో వచ్చిన తను గెరిల్లా జీవితంలో ఇముడడానికీ, ఆదివాసీ ప్రజానీకంతో మమేకం కావడానికి తనను తాను ఎంతగానే మలుచుకుంది, మార్చుకుంది. ప్రజల, తోటి కామ్రేడ్సందరి అభిమానాన్నీ చూరగొంది.

ఆమెకు ప్రకృతి అంటే చాలా ఇష్టం. వెన్నెల్లో సముద్రాన్ని చూడ్డం, అమావాస్య చీకట్లో నింగిలో చుక్కల్ని చూడ్డం చాలా ఇష్టం. ఓ వెన్నెల రాత్రి పాల నురగ వంటి తెల్లని దుస్తులు ధరించి సముద్రపొద్దున ఇసుక తిన్నెలపై శ్రీనుతో చేసిన విహారం గురించి చెప్తున్నప్పుడు ఆమె కళ్లు నక్షత్రాల్లా తళుకులీనేవి. సాహిత్యం, సినిమాల పట్ల తనకు మంచి అభిరుచి వుండేది. చదివిన కథలూ, సినిమాల గురించి ఉత్తరాల్లో కూడా రాస్తూ వుండేది. తన అమరత్వానికి అయిదు రోజుల ముందు ఒక సీనియర్ కామ్రేడ్‌తో తనకు నచ్చిన బేగంజాన్ సినిమా గురించి పావుగంట సేపు చెప్పిందట. తూర్పు గోదావరి జిల్లా యాసలో, ధారా ప్రవాహం లాగా చెప్పే ఆమె కబుర్లు వినసొంపుగా వుండేవి.

కండక్టర్ ఉద్యోగాన్ని కూడా తను చాలా ఎంజాయ్ చేసింది. ఆ రోజులను ఇష్టంగా తలుచుకునేది. లేడీస్ సీట్లలో కూర్చొని లేవకుండా మొండికేసే మగవాళ్లతో, వృద్ధులూ, చంటిబిడ్డ తల్లులూ నిలబడి వున్నప్పుడు లేచి సీటివ్వకుండా జనరల్ సీట్లలో కూర్చొన్న యువకులతో, అమ్మాయిలతో వెధవ్వేషాలేసే అబ్బాయిలతో, బస్సులో పొగ తాగే వాళ్లతో తానెలా వ్యవహరించేదో చెబుతుంటే వినేవాళ్లెవరైనా పడీ పడీ నవ్వాల్సిందే. తను అలా చెప్తుంటే కండక్టర్లకు మానవీయ స్పందన వుంటే మహిళలకు, అమ్మాయిలకు ప్రయాణాలు కొంతైనా సాఫీగా సాగుతాయి కదా అనిపించేది.

వ్యక్తిగత జీవితంలో ఎంతో విషాదాన్ని మోస్తూ, తన చిన్నారి వియోగాన్ని భరిస్తూ కూడా తను నిరంతరం ఉత్సాహంగా వుండేది. ఏ చీకూ, చింతా లేనట్టుగా వుండేది. తను అలా వుండడమే కాదు తన చుట్టూ వున్న వాళ్లను కూడా అలా వుండేలా చేసేది.

వివిధ రంగాలను గైడ్ చేసిన అనుభవమూ, ప్రత్యేకమైన శక్తి, సమర్థతలూ, పట్టణోద్యమ అనుభవంతో పాటు, గెరిల్లా జీవిత అనుభవమూ, రాజకీయ అవగాహన, వ్యక్తిగత సుగుణాలూ... వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే సమీప భవిష్యత్‌లో విప్లవోద్యమంలో మరిన్ని ఎత్తులకు ఎదిగే అవకాశాలు మెండుగా వున్న కామ్రేడ్‌ను కోల్పోవడం ఏవోబీ ఉద్యమానికి ఇప్పట్లో తీరని లోటు. పైగా మహిళా కామ్రేడ్స్‌ను ఉన్నత నాయకత్వ స్థానాల్లోకి ఎదిగించుకోవడానికి పార్టీ ద్వారా విశేష కృషి జరుగుతున్న నేపథ్యంలో కామ్రేడ్ రింకీని కోల్పోవడం అత్యంత విచారకరం.

రింకీ మరణంతో ప్రజలు సమర్థవంతురాలైన ఒక నాయకురాలిని కోల్పోయారు. ఎంతో మంది కామ్రేడ్స్ ప్రేమాస్పదురాలైన సహచరిని కోల్పోయారు. మరెంతో మంది తమ శ్రేయోభిలాషిని కోల్పోయారు. ఇంకెంతో మంది ఒక మంచి స్నేహితురాలిని కోల్పోయారు.

ఇప్పటికే శ్వేత మరణాన్ని పంటి బిగువున భరిస్తున్న ఆ కుటుంబాన్ని రింకీ మరణం మరింతగా కుదిపేసి వుంటుంది. తనను ఎంతగానో ప్రేమించే, తన కోసం పరితపించే అమ్మ తన చెంత లేకపోయినా, ఎక్కడో ఒక చోట క్షేమంగా వుందనే భరోసాతో వున్న చిన్నారి హృదయం ఎంతగా తల్లడిల్లుతున్నదో.

కామ్రేడ్స్ శ్వేత, శ్రీనుల రక్తంతో తడిసిన జెండాను సగర్వంగా ఎత్తిపట్టి, తన నాయకుడు కామ్రేడ్ విశ్వం తనపై వుంచిన విశ్వాసాన్ని దృఢంగా నిలబెట్టి నేడు రింకీ అమరత్వంలో వాళ్ల సరసన చేరింది. రింకీ భౌతికంగా లేదు. కానీ ఆమె నడిచిన మార్గం మరిన్ని త్యాగాల మేళవింపులతో ఇంకింతగా ఎరుపెక్కింది. రండి ఆ మార్గాన్ని మరింతగా సుదృఢం చేస్తూ మునుముందుకు సాగుదాం.

# గుండూర్ వాహీ అమరులు కా॥ నారోటి రామ్‌కో, కా॥ శిల్ప (దుర్వా)లకు జోహార్లు

గడ్చిరోలి జిల్లా సీ-60 కమాండోలు ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో కా॥ రామ్‌కో నరోటి (46), కా॥ శిల్పా దుర్వా (29) అనే ఇద్దరు మహిళా కామ్రేడ్స్‌ను ఏటపల్లి తాసిల్ గుండూర్ వాహీ గ్రామ సమీపంలో అరెస్టు చేశారు. ఆ కామ్రేడ్స్ ఇద్దరూ నిరాయుధంగా పార్టీ పనిమీద సివిల్‌లో వెళ్లి తిరిగి వస్తుండగా ఖచ్చితమైన సమాచారంతో శత్రువు 2019 ఏప్రిల్ 27న ఉదయం 10 గం॥ సమయంలో దారి కాసి పట్టుకున్నారు. వారిద్దర్నీ అడవిలోకి తీసుకుని వెళ్లి 4 గంటల పాటు క్రూరమైన చిత్రహింసలకి గురిచేసి చంపారు. శత్రువు ఎన్ని చిత్రహింసలు పెట్టినా గానీ పార్టీ రహస్యాలను, తోటి కామ్రేడ్స్‌ను కాపాడుతూ తమ నిండు ప్రాణాలను విప్లవం కోసం అర్పించారు.

## కా॥ రామ్‌కో నరోటి

కా॥ రామ్‌కో ఉరఫ్ కమలా నరోటీ (46) ఏటపల్లి తాసిల్ కసన్‌సూర్ ఏరియా కోయన్‌దూడ్ గ్రామంలో నరోటీ కుటుంబంలో పుట్టి పెరిగింది. రామ్‌కో తండ్రి మన్‌కూ నరోటీది ఆదివాసీ ధనిక రైతు కుటుంబం. 1980 తర్వాత ఈ ప్రాంతానికి వచ్చిన విప్లవ రాజకీయాలకి ప్రభావితుడై రైతుకూలి సంఘంలో క్రియాశీలంగా పనిచేశాడు. పార్టీ సభ్యుడిగా ఆ ప్రాంతంలో జరిగిన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించి, ప్రజలందరి విశ్వాసాన్ని, ప్రేమని పొందాడు. రామ్‌కో తల్లి గ్రామ కేఏఎంఎస్‌లో పనిచేసింది. రామ్‌కో తండ్రి మన్‌కూ నరోటీ పై పోలీసులు టాడా కేసు పెట్టి అరెస్టు చేశారు. జైలుకి పంపారు. జైలు నుండి బయటికి వచ్చాక కూడా అనారోగ్యంతో 2002లో మరణించేంత వరకూ విప్లవ రాజకీయాలని అంటిపెట్టుకుని ఉన్నాడు.



ఇటువంటి విప్లవ కార్యాచరణ కలిగిన కుటుంబంలో పుట్టి, పెరిగిన రామ్‌కో పై చిన్న వయసు నుండి పార్టీ ప్రభావం పడింది. తండ్రితో పాటు దళం దగ్గరికి అన్నం, నీళ్లు తీసుకుని వచ్చేది. దళ కమాండర్‌తో, పార్టీ కామ్రేడ్స్‌తో ఎంతో సన్నిహితంగా ఉంటూ, అన్నీ అడిగి తెలుసుకునేది. అన్ని పనులలో ఉత్సాహంగా పాల్గొనేది. ఇంటి దగ్గర ఉంటూ సంఘ కార్యక్రమాలలో ఎంతో చురుకుగా పనిచేసేది. జిల్లాలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌లను, ప్రజలపై పోలీసులు చేసే దమనకాండను, తన తండ్రి అరెస్టును వ్యతిరేకిస్తూ జరిగిన ఎన్నో ప్రజాందోళనలలో భాగమైంది. గ్రామంలోని పెత్తందార్ల అణచివేతని, పెత్తనాన్ని ప్రతిఘటిస్తూ సంఘాన్ని శక్తివంతంగా నిలబెడుతూ రామ్‌కో ప్రజలకి నాయకత్వం వహించింది. తన తండ్రి అరెస్టు అయ్యి జైలులో ఉంటే, ఒకపక్క గ్రామంలో సంఘం కార్యకలాపాలు నడుపుతూనే, మరొక పక్క పెద్దకూతురుగా ఇంటి బాధ్యతలు కూడా నిర్వహించింది. రామ్‌కో చిన్నతనం నుండి విప్లవ రాజకీయాలు నేర్చుకుంటూ ప్రజా పోరాటాలలో క్రియాశీలంగా పాల్గొంటూ, నాయకత్వం వహిస్తూ ఒక కార్యకర్తగా, నాయకురాలిగా తన చైతన్యానికి పదును పెట్టుకుంది.

కా॥ రామ్‌కో గ్రామంలో పార్టీ ఇచ్చిన పనులు చేస్తూ, క్రమంగా 2004లో పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలోకి బర్తీ అయ్యింది. మొదటి నుండి కూడా గట్ట-భామ్రాగడ్ ఏరియాలోనే పనిచేసింది. ఇంటి దగ్గర ఉన్నప్పటి నుండి సంఘ కార్యకలాపాలలో ప్రజలని సంఘటితం చేసిన అనుభవం ఉన్న రామ్‌కో ఏరియాలోని ప్రజలతో లతలాగా అల్లుకునిపోయింది. 2007లో రామ్‌కో ఏరియా కమిటీ సభ్యురాలు అయ్యింది. 2010 నుండి కమాండర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఏరియాలో పార్టీని గట్టిగా నిలబెట్టింది. 2015 డిసెంబర్‌లో జరిగిన డివిజన్ ప్లీనంలో కా॥ రామ్‌కోని డివిజన్ కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. కా॥ రామ్‌కో 2016 నుండి 2019 ఏప్రిల్ 27 వరకు డీవీసీ సభ్యురాలిగా ప్రజలకి తన సేవలు అందించింది. పార్టీ సభ్యురాలుగా ఆమె చేసిన ప్రమాణానికి కట్టుబడి చివరి క్షణం వరకు కృషి చేసింది.

గడ్చిరోలి జిల్లాలో 2014 నుండి పెసా, గ్రామసభలు మొదలయ్యాయి. ప్రజా పోరాటాల నుండి చిట-పట చినుకులు రాలినట్లు సంస్కరణలు వస్తుంటాయి అని, అవి విప్లవ మార్గం నుండి దారి తప్పిస్తాయని సంస్కరణల అసలు స్వభావాన్ని ప్రజలకి విప్పి చెప్పింది. పెసా, గ్రామసభలు కాదు జనతన సర్కార్‌లు నిర్మించుకుని ప్రజారాజ్యాన్ని శక్తివంతంగా నడిపించాలి అని ప్రజలకి ముక్తి మార్గాన్ని చూపింది.

గడ్చిరోలిలో ఉద్యమం మొదటి నుండి కూడా తీవ్ర నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూనే ముందుకు సాగింది. కా॥ రామ్‌కో ఆ నిర్బంధ పరిస్థితులలో నీళ్లల్లో చేపలా ప్రజలలో కలిసిపోయింది. శత్రు క్యాంపుల మధ్యనే ప్రజల్ని కదిలించింది. సంఘాలు నడిపింది. జనతన సర్కార్ నిర్మాణాలను, గ్రామసభలను నడిపింది. 2018 ఏప్రిల్ 22 కసనూర్-తుమ్మిరిగుండ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 40 మంది కామ్రేడ్స్ అమరులు అయ్యారు. వారిలో జిల్లా కమిటీ సెక్రటరీ కా॥ శ్రీను, జిల్లా కమిటీ సభ్యుడు కా॥ నందు, కా॥ సాయినాథ్‌లు కూడా అమరులు అయ్యారు. జిల్లా కమిటీ నష్టపోయి డివిజన్ ఉద్యమం తీవ్రమైన సంక్షోభంలో ఉన్న సమయంలో ఎంతో నిబ్బరంగా అన్ని పనులలో ముందు ఉండి నడిపించింది. శత్రు చేతికి చిక్కినా గానీ ధైర్యంగా శత్రువుని ఎదుర్కొంది. ప్రజలకోసం తన నిండు ప్రాణాలని అర్పించింది.

గట్ట, కసంసూర్ ఏరియాల నడుమ సూర్జాగఢ్ మెట్ట విస్తరించి ఉంది. అందులోని ఇనుప ఖనిజం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం, సామ్రాజ్యవాదులతో కలిసి దశాబ్దానికిపైగా అనేక ప్రయత్నాలు చేస్తున్నది. గనుల తవ్వకానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలను కదిలించి వేల మందితో ప్రదర్శనలు చేయించటంలో, మిలిటెంట్‌గా ప్రతిఘటనా చర్యలు చేపడుతూ ఆ ఉద్యమాన్ని సుదీర్ఘ కాలంగా నడిపిన దానిలో కామ్రేడ్ రామ్‌కో పాత్ర గణనీయమైనది. కా॥ రామ్‌కో లాంటి స్థానిక మిలిటెంట్ నాయకురాలు ప్రజల మధ్య ఉండడాన్ని సహించలేని దోపిడీ

పాలకవర్గాలు పథకం ప్రకారం ఆమెను బూటకపు ఎన్‌కౌంటర్ హత్య చేశాయి.

కా॥ రామ్‌కో నరోటి పార్టీలో విప్లవానికి అంకితమై పనిచేస్తున్న సహయోధుడిని సహచరునిగా ఎన్నుకుంది. 2006లో వివాహం అయ్యింది.

ఎర్రగా, సన్నగా, చిన్నగా ఉండే రూపం, చెరగని చిరునవ్వుతో అందరిని ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా పలకరించే కా॥ రామ్‌కో రూపం అందరి మనస్సుల్లో చెక్కు చెదర కుండా ఉండిపోతుంది. ఉద్యమానికి ఉపయోగపడే విషయాలు తెలుసుకోవాలనే తృష్ణ, ప్రజలకి తెలియజేయాలనే తపన తన నుండి నేర్చుకోవాలి. తీవ్ర నిర్బంధ పరిస్థితులలో కూడా ప్రజలని అంటిపెట్టుకుని పనిచేయటంలో, కష్టకాలంలో బాధ్యతల్ని మీదేసుకుని పనిచేయటంలో, పట్టుదలతో తన కర్తవ్యాన్ని నెరవేర్చటంలో కా॥ రామ్‌కో అందరికీ ఆదర్శంగా నిలిచింది. రామ్‌కో ఆశయాలను కొనసాగిద్దాం.

## కా॥ శిల్ప దుర్వా

కా॥ శిల్ప దుర్వా (29) మిరంగుడ్ వంచ గ్రామంలో పేద దుర్వా కుటుంబంలో పుట్టింది. ఆ ప్రాంతంలో జరుగుతున్న విప్లవ కార్యక్రమాలు చూసి ఉత్సాహపడి 2010 చివరిలో దళంలో బర్తీ అయ్యింది. పార్టీ ఇచ్చిన బాధ్యతల్ని, పనులని ఎంతో సంతోషంగా



నిర్వర్తించేది. గత 3 సంవత్సరాలుగా ఏరియా సీఎన్ఎం బాధ్యతలు స్వీకరించి తన ఆట, పాటలతో ప్రజలలో విప్లవ రాజకీయాలు ప్రచారం చేసింది. పాతబడిన, ప్రగతి నిరోధకమైన తెగ సాంప్రదాయాలను, భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతిని విడిచి నూతన ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పాలని గ్రామ-గ్రామాన ప్రచారం చేసింది. 2018లో కా॥ శిల్ప వివాహం జరిగింది. గట్టా-భామ్రాగడ్ ఏరియాలో కా॥ శిల్ప ఆట, పాటలు చూసిన ప్రజలు, యువతీ-యువకులు ఎన్నటికీ మరిచిపోరు. కా॥ శిల్ప ఆశయాలను కొనసాగిద్దాం.

## ఉద్యమ పురోగమనంలో ఎల్లలు దాటి విస్తరించిన కా॥ సీమ (మెస్సివెడద) ఉద్యమ జీవితం

మహారాష్ట్రలోని గఢ్‌చిరోలిలో పుట్టి, ఛత్తీస్‌గఢ్ మాడ్‌మెట్టపై రాటుదేలి, ఒడిశా ఉద్యమ విస్తరణలో కీలకంగా నిలిచింది కామ్రేడ్ సీమ. అన్ని విషయాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోరాడగలరన్న విశ్వాసంతో పని చేసి నిరూపించింది. ఉద్యమంలో ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా, అనారోగ్య సమస్యలు ఎంత వేధిస్తున్నా చెదరని చిరునవ్వు ఆమె సొంతం.

2019 జూన్ 18న సమాచార ఆధారంగా వెళ్లిన ఎస్.టి.ఎఫ్ బలగాలు దళం వున్న డేరాను చుట్టు ముట్టి దాడి చేసినప్పుడు అనారోగ్యంతో వున్న కామ్రేడ్ సీమ శతృవు జరిపిన కాల్పులలో గాయపడి, పోలీసుల చేత చిక్కి చిత్రహింసలకు గురై అమరురాలయ్యింది.

మహారాష్ట్రలోని గఢ్‌చిరోలీ జిల్లా కసంసూర్ ఏరియా బూర్గి గ్రామానికి చెందిన వెడద వారి కుటుంబంలో సీమ 50 సంవత్సరాల క్రితం పుట్టింది. తల్లి, తండ్రి ఆమెకు పెట్టిన పేరు మెస్సీ. కోయ భాషలో ఒక రకమైన తేనెను మెస్సీ అంటారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినప్పటికీ చిన్నప్పటి నుండి ఆమె కష్టపడి ఎన్నో పనులు చేసేది. తునికాకు కోయటం, వెదురు నరకడం వంటి పనులు చేసింది. గ్రామంలోని సమష్టి పనుల్లో భాగమయ్యింది.

ఆ ఏరియాలో పనిచేస్తున్న ఏటపల్లి దళం బూర్గి గ్రామంలో నిర్మించిన క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ (కేఏఎమ్ఎస్)లో కామ్రేడ్ మెస్సి పనిచేసింది. కేఏఎమ్ఎస్ డివిజనల్ కమిటీలో ఉంటూ మహిళా ఉద్యమానికి నాయకత్వం వహించింది. డివిజన్‌లో కూలీ రేట్ల పెంపుదల కోసం, సమాజంలో ఆదివాసీ తెగ పెద్దల దాష్టీకాలకు వ్యతిరేకంగా పితృస్వామ్య వ్యతిరేక పోరాటాలలోనూ పాల్గొని నాయకత్వాన్ని అందించింది. వివిధ సందర్భాలలో పార్టీ ఇచ్చిన పిలుపులను చేపట్టి ఆ ప్రాంతంలోని ప్రజలలో విస్తృత క్యాంపెయిన్‌లు నిర్వహించడంలో మెస్సీ ముందు భాగానుండేది.

మహిళా సంఘంలో పని చేస్తూ తన చైతన్యాన్ని మరింత పెంచుకొని 1993లో కామ్రేడ్ మెస్సీ పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చింది. గఢ్‌చిరోలి ప్లాటూన్‌లో గీత పేరుతో 1998 వరకు పనిచేసింది. ఆ జిల్లా ఉద్యమంలో పని చేస్తున్న కామ్రేడ్ గంగన్న సిడామ్‌తో ఆమె వివాహం జరిగింది.

కామ్రేడ్ శ్యాంబాయి గఢ్‌చిరోలీ జిల్లాలో మహారాష్ట్ర ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని అమలు చేస్తున్న సమయంలో విప్లవకర కార్యకలాపాల్లో భాగమై బాధ్యతలు స్వీకరించింది. 1991-94 మధ్య గఢ్‌చిరోలీ జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్‌లు పెద్ద ఎత్తున జరిగాయి. ఆ సమయంలో సుమారు 60 మంది కామ్రేడ్స్ అమరులు అయ్యారు. గఢ్‌చిరోలీ జిల్లాలోని విప్లవోద్యమాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం 1991లో 'ప్రత్యేక అణచివేత పథకాన్ని' ప్రవేశ పెట్టింది. 1992లో సీ-60 కమాండో దళాల నిర్మాణం చేసింది. జిల్లాలో విప్లవోద్యమానికి సహకరించిన వారిని రకరకాల పద్ధతులలో అణచివేస్తూ, టాడా కేసులో ఇరికించి, జైలు పాలు చేసింది. అటువంటి సమయంలో కామ్రేడ్ గీత శత్రు నిర్బంధాన్ని లెక్క చేయకుండా ఉద్యమంలో భాగమయి, నీటిలో చేపలా ప్రజలలో తిరుగుతూ ఎంతో మెలుకువగా పని చేసింది. కామ్రేడ్ మెస్సీ ఉద్యమంలోకి వచ్చాక, ఆ ప్రభావంతో బుర్గీ గ్రామం నుండి దాదాపు ఒక ప్లాటూన్ సంఖ్యలో యువతీ, యువకులు భర్తీ అయ్యారు. కామ్రేడ్ మెస్సీ తన ఇంటి వారు, తమ గ్రామంలోని వాళ్ళు పార్టీలోకి వచ్చేలా, ఉద్యమాన్ని వెన్నంటి వుండేలా కృషి చేసింది. బూర్గీ గ్రామం ఉద్యమానికి ఒక కోటలా తయారు అయింది. బూర్గీ గ్రామం నుండి విప్లవోద్యమంలో చేరిన కామ్రేడ్ చందన, కామ్రేడ్ నాగేష్, కామ్రేడ్ ముఖేష్ వంటి ఎంతో మంది కామ్రేడ్స్ అమరులు అయ్యారు.

ఉద్యమ అవసరాల రీత్యా కామ్రేడ్ మెస్సీ ఆమె సహచరుడు, ఇద్దరూ మాడ్ డివిజన్‌కి బదిలీ అయ్యారు. 1998లో మాడ్ డివిజన్‌లో కొత్తగా

ఏర్పడిన ప్రత్యేక మహిళా దళంలో మొదట సభ్యురాలిగా వుంటూ, 2000 సంవత్సరం నాటికి కమాండర్‌గా ఎదిగింది. అక్కడ ఆమె జరీనా పేరుతో ప్రజలలో పని చేసింది. 2001మార్చ్‌లో పార్టీ 9వ కాంగ్రెస్ జరిగినప్పుడు ఆమె నాయకత్వంలోని మహిళ దళం రక్షణ బాధ్యతల్లో పాల్గొనటమే కాకుండా, మార్చ్ 8న జరిగిన బహిరంగ సభలో మహిళల సమస్యలపై కామ్రేడ్ జరీనా ఉపన్యసించింది.

ఉద్యమంలో భాగంగా ఎదుగుతున్న జరీనాని 2006 అక్టోబర్-నవంబర్‌లో జరిగిన మాడ్ డివిజన్ మహాసభలో ప్రతినిధులు డివిజన్ కమిటీ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీలో సభ్యురాలుగా ఆమె ముఖ్యంగా మహిళ ఉద్యమాన్ని పెంపొందించడానికి కృషి చేసింది. ప్రజల నుండి నేర్చుకోవటంలో, తనకు తెలిసింది ప్రజలకి చెప్పటంలో, ప్రజల్ని సంఘటితం చేయటంలో జరీనా ఎంతో కృషి చేసింది. జరీనా పని చేసిన ప్రాంతంలోని ప్రజలు తనను ఎప్పుడూ



గుర్తు చేసుకుంటూ అడుగుతుంటారు. కేడర్‌తో కలిసి పోవటంలో, తనకి తెలిసిన విషయాలు వారికి చెపుతూ వారిని ఎదిగించుకోవటంలో జరీనా ఆదర్శనీయంగా వుండేది.

పార్టీ ఆదేశాల మేరకు ఉద్యమ విస్తరణలో భాగంగా వెళ్ళిన బలగాలతో పాటు కామ్రేడ్స్ గంగన్న, జరీనా ఇద్దరు ఒరిస్సాకు వెళ్ళారు. 10 సంవత్సరాల పాటు మైన్‌పుర్ డివిజన్‌లోని సీతానదీ ఏరియాలో ఆమె దృఢ దీక్షతో పని చేసింది. అక్కడ సీమ పేరుతో ప్రజలలో అల్లుకుపోయింది. కొత్త ప్రాంతంలో ప్రజల కట్టుబాట్లు, వివిధ రకాల స్థానిక భాషలు (ఛత్తీస్‌గఢీ, ఒడియా, కమార్ వంటివి) నేర్చుకుని ప్రజలలో కలిసిపోయింది. మూడు రాష్ట్రాలలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ఎదిగిన సీమ స్థానిక ప్రజలకు విశ్వసనీయమైన నాయకురాలిగా పనిచేసింది. పార్టీ అందించిన చైతన్యంతో ప్రజలు సంఘటితపడి విప్లవ రాజకీయ చైతన్యంతో పోరాడి అనేక సమస్యలు పరిష్కరించుకున్నారు. అందులో భాగంగా ఫారెస్ట్ గార్డ్‌ల దోపిడీ, దౌర్జన్యాన్ని ఎదిరించి ఆ గ్రామాల నుండి వెళ్లగొట్టారు. ఉదంతి ఏరియాలో అభయారణ్యానికి వ్యతిరేకంగా పెద్దెత్తున ఆందోళన చేశారు. రైతాంగ ఆర్థిక సమస్యలు, వ్యవసాయక సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకుని ఆదివాసీ రైతాంగాన్ని కదిలించి నకిలీ విత్తనాలు, నకిలీ మందులకు వ్యతిరేకంగా, జొన్నపంట గిట్టుబాటు ధర కోసం, అధిక వడ్డీ రేట్లకి వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపట్టారు.

2012లో సీతానది ఏరియా కమాండర్‌గా 2013లో నగరి ఏరియా కమిటీ కార్యదర్శిగా డివిజనల్ కమిటీ (డీ.వీ.సీ.ఎమ్.) సభ్యురాలిగా కృషి చేసింది. ఆ తదుపరి జరిగిన ఒడిశా రాష్ట్ర ప్రథమ మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యింది. ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించింది. ఉద్యమంలో వివిధ స్థాయిల్లో పని చేస్తూ నిర్దిష్టంగా సీతానది ఉద్యమ ప్రాంతానికి నాయకత్వాన్ని అందించింది. విద్యార్థి, యువజనులతోనూ, మహిళలు, ఉద్యోగులు వివిధ సెక్షన్ల ప్రజలతోనూ వాళ్ళకి అర్థం అయ్యే భాషలో రాజకీయాలను చెప్పి ఓపికతో ఒప్పించి విప్లవ కార్యకలాపాలలో పాల్గొనేలాగా, సహకరించేలాగా కృషి చేసింది. తనతో వున్న సహచర కామ్రేడ్స్‌ను రాజకీయంగా, మిలిటరీపరంగా ఎదిగిస్తూ నిత్యనిర్బంధంలో కొత్త ఎత్తుగడలతో ఉద్యమాన్ని కాపాడి, అభివృద్ధి చేసింది. దండకారణ్య ఉద్యమానికి, ఒడిశా ఉద్యమానికి మధ్య వారధిగా విశేష కృషి చేసింది. ఒడిశా, దండకారణ్య ఉద్యమాలకు, సీతానది ఏరియా ఉద్యమం సమన్వయంగా ఉండడంతో శత్రువు ఆ ఏరియాపై తీవ్ర నిర్బంధం కొనసాగిస్తున్నాడు. ఈ సంవత్సర కాలంలో దళసభ్యుడు కామ్రేడ్ జైసింగ్‌ను పోలీసులు పట్టుకొని కాల్చి చంపారు. ఏరియా కమాండర్‌తో సహా మరో సభ్యుడ్ని అరెస్టు చేసి, తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసినప్పటికీ, అక్కడి ప్రజల్లో పార్టీని నిలబెట్టడానికి కామ్రేడ్ సీమ తుదిశ్వాస వరకూ అలుపెరుగని కృషి చేసింది.

27 సంవత్సరాలు అనుభవంతో, పూర్తి విశ్వాసంతో, ప్రజలకి అంకితమై పనిచేసిన కామ్రేడ్ సీమ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుందాం. సీనియర్ మహిళా నేత కామ్రేడ్ సీమకు జోహార్లు.

## కామ్రేడ్స్ రాంశిల, ప్రదీప్‌లకు లాల్‌సలాం!

కొందమాల్ జిల్లాలోని కొడంగ్ ప్రాంతంలోనున్న కొడంగ్ నదిని దాటుతుండగా, నదీ ప్రవాహంలో మునిగి 2018, సెప్టెంబర్‌లో కామ్రేడ్స్ రాంశిల, ప్రదీప్‌లు అసువులుబాసారు. వీరిద్దరూ పార్టీలో ఏరియా కమిటీ సభ్యులు, జీవితంలోనూ సహచరులు, మరణంలోనూ అమర సహచరులుగానే నిలిచి కొడంగ్‌కు వన్నె తెచ్చిన మృత్యుంజయులు.

### కామ్రేడ్ రాంశిల

దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ భైరంగఢ్ ఏరియా నుండి ఉద్యమంలోకి అడుగు పెట్టింది. ఆమె స్వంత ఊరు వెచ్చం. ఆ కామ్రేడ్ రాంశిల ఓయం కుటుంబంలో 25 సంవత్సరాల క్రితం జన్మించింది. ఇంట్లో ముద్దుగా ఆమెను పిల్చుకునే పేరు శ్యామల. ఉద్యమ పొత్తిళ్లలో పుట్టి పెరిగిన కామ్రేడ్ రాంశిల ఎదుగుతూ గ్రామ



సంఘంలో చేరింది. తరతరాలుగా ఆదివాసీ ప్రజలు అనుభవించిన తెగ పెద్దల ఆధిపత్యాన్ని, సమాజంలో వున్న పితృస్వామ్యాన్ని, ప్రభుత్వ దోపిడీ, అణచివేతలను ఆమె తెలుసుకొని పోరాడడానికి సన్నద్ధమయ్యింది. 2007లో కామ్రేడ్ శ్యామల ఉద్యమంలో చేరిపోయింది. మొదట మిర్తూర్ దళంలో పని చేసింది. ఆమె తెలివి తేటలు, శక్తి సామర్థ్యాలను గుర్తించిన పార్టీ ఆమెకు 2008లో టైలర్ బాధ్యతలనూ ఆ తర్వాత 2009లో డాక్టర్ బాధ్యతలనూ అప్పజెప్పింది. పార్టీ అప్పజెప్పిన ఏ పనులనైనా కామ్రేడ్ శ్యామల మనస్ఫూర్తిగా స్వీకరించేది. అలా టైలర్‌గా గెరిల్లా బలగాలకు యూనిఫాం డ్రెస్‌లను, డాక్టర్‌గా గెరిల్లాలకు, ప్రజలకు వైద్య సేవలను అందించింది. అన్ని సేవలలోనూ ఆమె అందరి మన్ననలను పొందింది.

పార్టీ పిలుపునందుకుని 2014లో ఆమె ఒడిశా విస్తరణ ప్రాంతానికి ఉత్సాహంగా వెళ్ళింది. నూతనంగా ఏర్పడిన కందమాల్-కలహండి-బౌద్ధ్-నయాగడ (కే.కే.బీ.ఎన్) డివిజనల్ కమిటీ నాయకత్వంలోని కొడంగ్ ఏరియాలో పని చేసింది. 2016లో మహానది ప్రాంతానికి బదిలీ అయింది. కామ్రేడ్ శ్యామల మంచి ప్రజా కళాకారిణి. ఆమె తన ఆట, పాటలతో కందమాల్ బౌద్ధ్ ప్రాంతంలోని కువ్వీ ప్రజలను అలరించి వారిని సంఘటితం చేయడంలో మంచి కృషి చేసింది. తీవ్ర నిర్బంధం మధ్య ప్రజలను సంఘటితం చేస్తూ వారితో సజీవ సంబంధాలను కొనసాగించింది. ఒడియా, కువ్వీ భాషలను నేర్చుకుని పాటలు కూడా రాసింది. 2017 జూలైలో ఏరియా కమిటీ సభ్యురాలిగా ప్రమోట్ అయ్యింది. 2017 అక్టోబర్‌లో ఆమెకు తనకు నచ్చిన కామ్రేడ్ ప్రదీప్‌తో వివాహమయ్యింది.

2017 సెప్టెంబర్‌లో జరిగిన కేకేబీఎన్ ప్లీనంలో ఆమె ప్రతినిధిగా పాల్గొన్నది. కువ్వీ, ఒడియా ప్రజలలో మరింత మమేకం అయి ప్రజలను సంఘటితం చేయాలని మాట్లాడింది. 2018 మే 13న జరిగిన ఎన్‌కౌంటర్‌లో జిల్లా నాయకత్వంతో సహా అయిదుగురు కామ్రేడ్స్ అమరులైనారు. ఆ ఎన్‌కౌంటర్‌లో ధైర్యంగా పోరాడుతూ బయటపడి, అందులో గాయపడిన కామ్రేడ్స్‌కు ఆమె వైద్యం చేసింది.

కామ్రేడ్ శ్యామల ఎప్పుడూ ఉత్సాహంగా చిరునవ్వుతో వుండేది. ఆమె ఎక్కడైనా అందరితో సునాయాసంగా ఐక్యం అయ్యేది. ఆమె తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా చెప్పేది. పార్టీ పనుల రీత్యా వెళ్తూ దారిలో కొడంగ్ నది దాటుతుండగా నీట మునిగి కామ్రేడ్ ప్రదీప్‌తో సహా అమరత్వం పొందింది. వీరి అమరత్వాన్ని ప్రజలు సదా స్మరించుకుంటారు.

## కామ్రేడ్ ప్రదీప్

కామ్రేడ్ ప్రదీప్ దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూరు ఏరియా నుండి 2013లో ఉద్యమంలోకి పూర్తి కాలం కార్యకర్తగా వచ్చాడు. ఆయన మల్లూరు గ్రామంలో పేద కుటుంబంలో జన్మించాడు. తనకు తల్లి-తండ్రులు ప్రేమతో పెట్టుకున్న పేరు విజ్జా. ప్రజలపై సల్వాజుడుం దాడి విరుచుకుపడడం వల్ల బాల్యంలో ప్రదీప్ చదువుకోలేక పోయాడు, గ్రామంలో వున్నప్పుడే పార్టీ రాజకీయాలతో, విప్లవ కార్యక్రమాలతో



ప్రభావితమై 2013లో భర్తీ అయ్యాడు. భర్తీ అయ్యాక నాలుగు నెలలు గంగులూరు ఏరియా ప్రజల మధ్య పని చేశాడు. పార్టీ నిర్ణయం మేరకు 2014లో ఒడిశాలోని ఉద్యమ విస్తరణ ప్రాంతానికి సిద్ధం అయి వెళ్లాడు.

2014 నుండి 2018 సెప్టెంబర్‌లో తను అమరుడయ్యే వరకు నూతనంగా విస్తరించిన కేకేబీఎన్ డివిజన్‌లోనే, కొడంగ్ ఏరియాలోని కువ్వీ ఆదివాసీల మధ్యనే పని చేశాడు. 2018 మేలో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. తను ఎక్కువ కాలం డివిజన్ కమిటీ సభ్యుడికి గార్డుగా పని చేశాడు. 2017 అక్టోబర్‌లో కామ్రేడ్ ప్రదీప్, రాంశిలలు ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. వీరిద్దరూ మహానది ఏరియా కమిటీలో పని చేయాలని పార్టీ నిర్ణయించింది. వారు అందుకు ఎలాంటి శషబిషలు లేకుండా సిద్ధమయ్యారు.

2008లో ఆర్ఎస్ఎస్ మతోన్మాదులు కందమాల్ ప్రాంతంలో సృష్టించిన మతకల్లోలాలలో క్రైస్తవ దళితులు, కువ్వీ ఆదివాసీలపై హత్యాకాండను కొనసాగించారు. ఆ మతోన్మాద దాడికి కారకుడైన లక్ష్మణానంద సరస్వతిని ప్రజా గెరిల్లాలు ఖతం చేసిన ఈ ప్రాంతంలో పార్టీ విస్తరణను ప్రజలు స్వాగతించారు. ఆ ప్రాంతంలో కామ్రేడ్ ప్రదీప్ ప్రజల భాషను నేర్చుకుంటూ, వారితో మంచి సంబంధాలు కొనసాగించాడు. కొడంగ్ ఏరియాలో కామ్రేడ్ ప్రదీప్ ప్రజలపై, ఏరియాపై మంచి పట్టు సాధించడం వల్ల ప్రజల్లో విప్లవోద్యమం త్వరగా నిలబడడానికి ఉపయోగపడింది.

తీవ్ర నిర్బంధం ఉన్న దళం ద్వారా ఒంటరిగా కూడా ప్రజలతో సంబంధాలు కొనసాగించడం, ప్రతిఘటన, ఇతర ముఖ్యమైన పనుల సందర్భంగా సప్లయ్‌లు సమకూర్చడంలో కామ్రేడ్ ప్రదీప్ మంచి పాత్రను పోషించాడు.

కామ్రేడ్ ప్రదీప్ సాదాసీదాగా ఉండి పార్టీ చెప్పిన పనులను ఎంతో ఉత్సాహంగా పూర్తి చేసేవాడు.

2018 సెప్టెంబర్‌లో కొడంగ్ నది దాటుతుండగా, తన సహచరి కామ్రేడ్ రాంశిల నీట మునగడం చూసి, ఆమెను రక్షించడం కొరకు వెళ్ళిన కామ్రేడ్ ప్రదీప్ కూడా మునిగి పోవడంతో ఏకకాలంలో ఇద్దరూ అమరలయ్యారు. వారి అమరత్వంతో ఎర్రబారిన కొడంగ్ వేనవేల వారి వారసులను సృష్టించుకు తీరుతుంది.

## మాందగిరి అమరులు కామ్రేడ్స్ రాజు, మున్నీ, అనిత, దుర్గలకు విప్లవ జోహార్లు!

మైన్‌పుర్-నువపడా డివిజనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ సీమను డీఆర్‌జీ హంతకులు పట్టుకొని హత్య చేసిన నెత్తుటి తడి ఆరక ముందే అదే ఏరియాలోని (సీతా నది) కట్టిగావ్ అటవీ ప్రాంతంలో ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాజు, పార్టీ సభ్యులు కామ్రేడ్స్ మున్నీ, అనిత, దుర్గలు శత్రువుతో పోరాడుతూ జూలై 6న అమరులైనారు. గోబ్రా, సీతానది ఏరియా కమిటీల కామ్రేడ్స్ రాజకీయ తరగతులు జరుపుకుంటుండగా శత్రు బలగాలు దాడి చేసి ఈ నలుగురు కామ్రేడ్స్‌ను చంపివేశాయి. వారందరికి వినమ్రంగా విప్లవ జోహార్లర్పిద్దాం.

## కామ్రేడ్ కొమరా బాలు (రాజు)

కామ్రేడ్ రాజు వయస్సు 25 సంవత్సరాలు. కాంకేర్ జిల్లా, అంతాగఢ్ బ్లాక్ అలయినార్ గ్రామంలో తల్లి సోమారి, తండ్రి చైనులకు కలిగిన ఆరుగురి సంతానంలో కామ్రేడ్ రాజు నాలుగవవాడు. కామ్రేడ్ రాజుకు తల్లి తండ్రులు బాలు అని పేరు పెట్టారు.

చిన్న వయస్సులో విప్లవ కార్యక్రమాలకు ఆకర్షితుడయ్యి, 2008, డిసెంబర్ 2న దళంలోకి భర్తీ అయ్యాడు. భర్తీ అయిన తర్వాత ఆరునెలలు కిస్కోడ్ దళంలో పని చేశాడు. దళంలోనే చదువు నేర్చుకున్నాడు. కిస్కోడ్ ఏరియాలో తెగ పెద్దల ఆధిపత్యానికి

వ్యతిరేకంగా దళంతో కలిసి ప్రజల్ని ఐక్యం చేశాడు. యువకులను ఉత్సాహపరుస్తూ సంఘటితం చేయడంలో, మిలీషియాలోకి భర్తీ చేయడంలో కామ్రేడ్ రాజు ముందున్నాడు.

విప్లవోద్యమాన్ని విస్తరించడానికి మైన్‌పుర్ డివిజన్‌కు బదిలీ కావాలనీ పార్టీ ప్రతిపాదించగా, వెంటనే చాలా సంతోషంగా ఆమోదించి వెళ్ళాడు. ఆ సమయంలో ఆయనతో పాటుగా అయిదుగురు విస్తరణకు వెళ్ళితే, వారిలో నల్గురు దిగజారగా కామ్రేడ్ రాజు మాత్రం ఉద్యమంలో దృఢంగా నిలబడ్డాడు.



మైన్‌పుర్ డివిజన్‌లోని ఉదంతి దళంలో 2009 నుండి 2011వరకు దళ సభ్యుడిగా పని చేశాడు. 2011లో పార్టీ సభ్యుడయ్యాడు. 2012లో ఉదంతీ దళం నుండి బదిలీ అయి మరో అయిదు సంవత్సరాలు (2017 వరకు) జిల్లా కమిటీ సభ్యుడికి రక్షణగార్డ్‌గా బాధ్యతలను నిర్వర్తించాడు. 2016లో ఏరియా కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. గార్డు నుండి బదిలీ అయ్యి, 2017 నుండి అమరుడయ్యే వరకు గోబ్రా ఏరియా కమిటీ సభ్యుడిగా వుంటూ, అక్కడి ఉద్యమానికి నాయకత్వం వహించాడు.

కామ్రేడ్ రాజు ఉదంతి ఏరియాలో, గోబ్రా ఏరియాలో తీవ్ర నిర్బంధం మధ్య పనిచేశాడు. ప్రజల ఆదరాభిమానాలు పొందాడు. ప్రజలని సంఘాల్లో సంఘటితం చేస్తూ, పోరాటంలో ముందుకు నడిపించేవాడు. శత్రువుతో పోరాడడంలో రాజు ఒక మంచి సాహసిక పోరాట యోధుడిగా గుర్తింపు పొందాడు.

గ్రామంలో మిలీషియాలో వున్నప్పుడే అనేక ప్రతిఘటన చర్యల్లో పాల్గొన్నాడు. దళంతో పాటు కూడా పలు సైనిక చర్యలలో పాల్గొన్నాడు. ఆర్గనైజేషనల్‌గా, గార్డుగా బాధ్యతలు నిర్వహించిన ఈ 11 సంవత్సరాల్లో కామ్రేడ్ రాజు దాదాపు 17 ఎన్‌కౌంటర్‌లలో శతృవుతో సాహసికంగా పోరాడాడు. తన దళాన్ని, పార్టీ నాయకత్వాన్ని కాపాడడంలో ముందున్నాడు. ఎన్‌కౌంటర్స్‌లో గాయపడిన కామ్రేడ్స్‌ను రక్షించడం, వారికి వైద్య సేవలు అందించడంలో ఆయనకు ఆయనే సాటి.

గామ్‌సామ్ ఎన్‌కౌంటర్‌లో, జోలారాం, గాజీమురా, జోలారామ్, బ్యేస్, కల్లారి ఎన్‌కౌంటర్‌లో ధైర్యంగా పోరాడాడు. తోటి కామ్రేడ్స్‌ని పోలీసు కాల్పుల నుండి రక్షించాడు. జూన్ 18వ తేదీన కట్టీగావ్ ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సీమ (డీవీసీఎమ్) తన కళ్ళ ముందే నేల కొరిగినా, ఏ మాత్రం చలించకుండా మిగిలిన కామ్రేడ్స్‌ను రిట్రీట్ చేయడంలో, గాయపడిన కామ్రేడ్స్‌కు వైద్య సేవలు అందించడంలో తన పాత్రను పోషించాడు.

సివిల్‌లో చాలా చాకచక్యంగా పార్టీ అప్పజెప్పిన పనులు చేసేవాడు. ఇన్‌ఫార్మర్లను, వర్గ శత్రువులను నిర్మూలించడంలో ముందుండేవాడు.

మైన్‌పుర్‌కు వెళ్లిన కొద్ది కాలానికే ఛత్తీస్‌గఢీ, హిందీ, స్థానిక ప్రజల కమార్ భాషలను నేర్చుకున్నాడు. సీదా సాదాగా వుండే కామ్రేడ్ రాజు పీడిత ప్రజలకు తలలో నాలుకలా వ్యవహరించేవాడు. ఆ అమరవీరుడి ఆదర్శాలతో అక్కడి ఉద్యమం పురోగమించి తీరుతుంది.

## కామ్రేడ్ హేమ్లా మాసే (మున్నీ)

నారాయణపుర్ జిల్లా ఇంద్రావతి ఏరియా, తాకిలోడ్ పంచాయితీ, జాడ్కా గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో 28 సంవత్సరాల క్రితం కామ్రేడ్ మున్నీ జన్మించింది. కామ్రేడ్ మున్నీ స్వంత పేరు కామ్రేడ్ మాసే.

ఇంద్రావతి ఏరియాలోని ప్రజా ఉద్యమ కార్యకలాపాలకు చిన్ననాటి నుంచే ఆకర్షితురాలయ్యింది. తాకిలోడ్ ప్రాంతంలో భూస్వాములకు, తెగపెద్దలకు వ్యతిరేకంగా, వారి పితృస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు జరిపిన పోరాటాల ప్రభావం కామ్రేడ్ మున్నిపై ఎంతో వుంది. దానితో తాను కూడా పూర్తికాలం ఉద్యమంలో పని చేయడానికి సిద్ధపడి 2005 నవంబర్‌లో దళంలో భర్తీ అయ్యింది. తను పూర్తికాలం విప్లవ కార్యకర్తగా వుంటూ మహిళా సంఘాల్ని కలుస్తూ వారితో పాటు అనేక పోరాటాలలో పాల్గొంది. తను భర్తీ అయిన ప్రారంభ సమయంలోనే ప్రజలపై ఫాసిస్ట సల్వాజుడుం విరుచుకు పడింది.



అప్పుడు ప్రజల్ని సంఘటితంగా నిలబెట్టడంలో తన వంతు పాత్ర తాను నిర్వహించింది.

ఒడిశాలో ఉద్యమ విస్తరణకై 2010 మధ్య కాలంలో పార్టీ చేపట్టిన అదనపు బలగాల సమీకరణలో మున్ని భాగమై అక్కడికి వెళ్ళింది. అక్కడ నూతనంగా ఏర్పడిన బొలంగీర్-బరగడ్-మహాసముంద్ (బీబీఎమ్) డివిజన్ ఉద్యమ ప్రాంతంలో పని చేసింది. ఉద్యమ అవసరల రీత్యా 2012లో నువపడా డివిజన్‌లోని కోయల్‌బీతర్ దళంలో పని చేసింది. 2013 నుండి 2015 వరకు డివిజన్ కమిటీ సభ్యురాలికి గార్డ్‌గా రక్షణ బాధ్యతలలో వుండి నాయకత్వ రక్షణలో తన అమూల్య సేవలను అందించింది. 2016 నుండి 2018 జూలై వరకు ప్లాటూన్‌లో పని చేసింది. అందులో భాగంగా కమిటీ సమావేశాల సందర్భంగా ప్రొటెక్షన్ బాధ్యతలను, ఆర్గనైజేషన్ పనుల్లో నాయకత్వానికి రక్షణగా వుండడంతో పాటు ప్రతిఘటన చర్యలలో చొరవగా పాల్గొంది. 2018 జూలైలో గోబ్రా దళంలో సభ్యురాలిగా బదిలీ అయ్యింది. ఆ సమయంలోనే ఆ దళ కమాండర్‌ను ఇష్టపడి పెళ్ళి చేసుకున్నది.

కామ్రేడ్ మున్నీ ప్రజలతో చాలా సన్నిహితంగా వుండేది. ఒంటరిగా (సివిల్) వెళ్ళి ప్రజల్ని ఆర్గనైజ్ చేసేది. నాయకత్వం చెప్పే అనేక ముఖ్యమైన పనులను చాలా చాకచక్యంగా చేసేది. ఆ పనులు చేసేప్పుడు

నిబ్బరంగా వుండేది.

తను త్వరగానే హిందీ, ఒడియా, కమార్, ఛత్తీస్‌గఢీ భాషలను నేర్చుకుని ఆదివాసీ, ఆదివాసేతర ప్రజలతో మమేకం కాగలిగింది. మిలటరీ రీత్యా ధృఢంగా వుండేది. 2010లో విస్తరణకు వెళ్ళిన తొలినాళ్ళలోనే మహాసముంద్ జిల్లా పడ్కిపల్లిలో ఎన్‌కౌంటర్ జరిగి 9 మంది కామ్రేడ్స్ అమరులైనారు. కొత్త ప్రాంతం అయినా శతృవుతో వీరోచితంగా పోరాడుతూ మున్నీ ఆ ఘటనలో రిట్రీట్ అయ్యింది. ఇంకా అనేక మిలటరీ చర్యల్ని సఫలం చేయడానికి ఆమె ఎంతో కృషి చేసింది.

ఆర్గనైజేషన్, మిలటరీ అనువభం వున్న కామ్రేడ్ మున్ని, గోబ్రా ఏరియాకు వచ్చిన కొద్ది కాలానికే అమరురాలు కావడం ఆ ప్రాంత ఉద్యమానికి వెంటనే పూడ్చుకోలేని నష్టమే అయినప్పటికీ ఆమె సంఘటితం చేసిన యువత ఆమె లేని లోటు కచ్చితంగా తీరుస్తారు, ఆమె జీవితాశయాలను పరిపూర్తి చేస్తారు.

## కామ్రేడ్ కోవాసి అడిమే (అనిత)

కామ్రేడ్ అనిత, సుక్మా జిల్లా, దక్షిణ బస్తర్ డివిజన్, కిష్టారం ఏరియాలో దుర్మా గ్రామంలోని ఆదివాసీ పేద కుటుంబంలో జన్మించింది. తన తల్లి తండ్రులకు కలిగిన రెండవ సంతానం అడిమే.

గ్రామంలో పితృస్వామిక అణిచివేతకు వ్యతిరేకంగా అడిమే కేఏఎంఎస్‌లో ఉంటూ పోరాడింది. తల్లితండ్రులు ఆమెకు ఇష్టం లేని వివాహాన్ని చేయ తలపెట్టారు. ఆ బలవంతపు పెళ్లిని వ్యతిరేకించి 2007లో దళంలో భర్తీ అయిందామె. ఆమె శారీరక ధృఢత్వం, ఆట పాటల్లో చలాకీగా వుండడం చూసి పార్టీ ఆమెను ఇన్‌స్ట్రక్టర్ టీమ్‌లో నియమించింది. 2008 నుండి 2014 వరకు ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తూ, ఏరియాలోని అనేక మంది మిలీషియాకు మిలటరీ శిక్షణ ఇచ్చింది.



2014లో ఒడిశా విస్తరణకు వెళ్ళాలని పార్టీ ఆమె ముందు ప్రతిపాదించగా చాలా ఉత్సాహంగా స్వీకరించి వెళ్ళింది. ఒడిశాలోని బొలంగీర్-బర్గడ్-మహాసముంద్ (బీబీఎమ్) డివిజన్ ఉద్యమ ప్రాంతంలోని బొలంగీర్ దళంలో 2015 నుండి 2018 వరకు పని చేసింది. 2018 చివర్లో మైన్‌పుర్ డివిజన్‌కు బదిలీ అయ్యి, డివిజన్ కమిటీ సభ్యురాలికి రక్షణ గార్డుగా పనిచేసింది. ఒడిశాలో పని చేసిన 5 సంవత్సరాలల్లో అనేక కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ పని చేసింది. తీవ్ర అనారోగ్యం మధ్య కూడా ప్రజలను అంటిపెట్టుకుని ఉంటూ 2019 జులై 6నాడు శత్రువు దాడిలో సహచర కామ్రేడ్స్ నలుగురితో పాటుగా అనిత అమరురాలైంది. కామ్రేడ్ అనిత భౌతికంగా దూరమైనప్పటికీ దక్షిణ బస్తర్‌లోని కిష్టారం ప్రాంతం నుండి బీబీఎం వరకు విస్తరించిన విప్లవ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా వుంటుంది.

## కామ్రేడ్ పొడియామి మాసే (దుర్గ)

కామ్రేడ్ దుర్గ దక్షిణ బస్తర్ డివిజన్, కుంట ఏరియా, తోలెం గ్రామంలోని ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించింది. తల్లిదండ్రులు ఆమెకు ప్రేమగా పెట్టుకున్న పేరు మాసే. విప్లవ వాతావరణంలో పుట్టి పెరిగిన కామ్రేడ్ మాసే సహజంగానే పోరు మార్గంలో సాయుధమైంది. 2009లో ఆమె వృత్తి విప్లవకారిణిగా పీఎల్‌జీఏలో భర్తీ అయింది. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కామ్రేడ్ మాసే తల్లిదండ్రులనూ, పుట్టిపెరిగిన ప్రాంతాన్ని వదలి, మైన్‌పుర్ డివిజన్‌కు చేరుకుంది. తర్వాత బదిలీ అయి 2018 వరకూ ఆమె బీబీఎం డివిజన్‌లో పని చేసింది. 2018 నుండి మైన్‌పపూర్-నువాపాడ డివిజన్‌లోని గోబ్రా ఎల్‌ఓఎస్‌లో పని చేసింది. అక్కడి ప్రజల భాష నేర్చుకుని ఆమె వారిలో ఒకరిగా మారింది. తోటి కామ్రేడ్స్‌తోనూ ఆమె కలిసిమెలిసి వుండేది. గోబ్రాలో పని చేస్తున్న కాలంలో ఆమె మాటియబహారా ఎన్‌కౌంటర్‌లో గాయపడంది. ఆ కఠిన పరిస్థితిని ఆమె ధైర్యంగా ఎదుర్కొంది. తను అమరత్వం చెందిన ఘటనలోనూ ఆమె చాలా ధైర్యసాహసాలను ప్రదర్శించింది. శత్రువు తూటా తలకు తగిలి తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో వున్నప్పటికీ తన తుపాకీ శత్రువు దొరకకూడదనే దృఢ సంకల్పంతో దానిని ఆమె తన సహచరులకు అందించింది. దక్షిణ బస్తర్‌లో పుట్టిన ఈ యువ విప్లవకారిణి ఒడిశా జోన్‌లో తన వెచ్చని నెత్తురు చిందించి ఒడిశా అమరురాలిగా విప్లవోద్యమ చరిత్రపుటల్లో తన సుస్థిర స్థానాన్ని పొందింది.



★ పౌరసత్వ సవరణ చట్టంను వ్యతిరేకించండి !

★ పౌరసత్వ సవరణ చట్టంను మైనార్టీ పీడిత ప్రజలకు వ్యతిరేకమైనది!

★ ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామికవాదులంత ఐక్యమై పౌరసత్వ సవరణ చట్టం రద్దు కొరకు పోరాడండి !

**పోరాట వార్తలు**

## విశ్రాంత కార్మికుల డిమాండ్

బొగ్గుగని కార్మికుల ఫించను పెంచాలని డిమాండ్ చేస్తూ సింగరేణి విశ్రాంత కార్మికులు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. బొగ్గుగని కార్మికుల భవిష్యనిధిలో ఫించను సవరించకపోవడంతో అతి తక్కువగా ఫించను పొందుతూ కనీస జీవనానికి కూడా సరిపోని పరిస్థితి ఉందని నిరసన వ్యక్తం చేశారు. శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సభలో రూ.1000 కంటే తక్కువగా ఫించను పొందే కార్మికులకు ఫించను అర్హత కల్పిస్తామని ప్రకటించారని, ఇప్పటి వరకు అమలుకావడం లేదన్నారు. కనీస ఫించను రూ.8500 చెల్లించే విధంగా సవరించాలని, విశ్రాంత సింగరేణి కార్మికులకు రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేయాలని, అలాగే ఉచిత వైద్య సేవలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఆదివాసుల ముట్టడితో దద్దరిల్లిన ఐటీడీఏ

హరితహారం పేరుతో అటవీ భూముల సాగుదారులను తమ భూమి నుంచి వెళ్లగొట్టాలని ప్రభుత్వం చేస్తున్న కుట్ర పూరిత రాజకీయాలను ఎండగడుతూ అడవి నుంచి ఆదివాసీలను పంపించాలని పోలీసులను, అటవీ సిబ్బందిని మోహరించి ప్రజలపై దాడులు చేయడం దుర్మార్గమని మండి పడ్డారు. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వంద్వ వైఖరి పాటిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఐటీడీఏను ముట్టడించి ధర్నా చేసి డిమాండ్‌ల పత్రాన్ని ఐటీడీఏ అధికార్లకు ఇచ్చారు.

## పట్టా పుస్తకాల కోసం వీఆర్‌ఓను నిర్బంధించిన రైతులు

పట్టా పుస్తకాలు ఇవ్వడం లేదని రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులు ఆందోళనకు దిగారు. పాసుపుస్తకాలు ఇవ్వాలని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పట్టించుకోవడం లేదని నిరసన తెలిపారు. తనకు పట్టా పాసు పుస్తకం ఇవ్వడం లేదని రైతు ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా రైతు బంధు డబ్బులు ఇవ్వడం లేదంటూ నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో రైతులు అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సత్తన్‌పల్లిలో 6.23 ఎకరాల భూమి వుంది. అయితే ఇటీవల ఖానాపూర్‌కు చెందిన వ్యక్తి అధికారులతో కుమ్మక్కై తమ భూమిని పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. తమ భూమిని ఇతరుల పేరిట అక్రమంగా పట్టా చేయడాన్ని, పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఈ తతంగం నడిపారని ఆరోపించారు. తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం జల్లాపల్లి ఫారంలో 50 మంది రైతులకు ఏడాది నుంచి పట్టా పుస్తకాలు అందలేదు. వీఆర్వోను సంప్రదించినా, తహసిల్దార్ కార్యాలయానికి వెళ్ళినా సమస్య పరిష్కారం కాకోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహించిన గ్రామసభలో పాస్ పుస్తకాలపై వీఆర్వోను నిలదీశారు. పట్టా పుస్తకాలు రాలేదని ఆయన సమాధానం ఇవ్వడంతో వీఆర్వో, వీఆర్ఏలను గ్రామ పంచాయతి కార్యాలయంలో నిర్బంధించారు.

## ఆదివాసుల పోరు బాట

ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి భారీగా తరలి వచ్చిన ఆదివాసీలను పోలీసులు కట్టడి చేసే క్రమంలో తోపులాట, వాగ్వాదం జరిగింది. ఒక దశలో కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్ళెందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ నినాదాలు చేశారు. సమావేశం జరుగుతుండగా ఆదివాసీలు నినాదాలతో హోరెత్తించారు. లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులకు, ఆదివాసీలకు మధ్య తోపులాట జరిగింది. లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలనే నినాదాలతో ఐటీడీఏ కార్యాలయం అట్టుడికి పోయింది.

## జీఎం కార్యాలయం వద్ద భూ నిర్వాసితుల ధర్నా

శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఇందారం వద్ద ప్రారంభించే సింగరేణి ఐకే-ఓసీపీ కింద భూములు కోల్పోతున్న రైతులకు, నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద భూ నిర్వాసితులు ధర్నా చేశారు. తరతరాల నుండి తాము వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. ఓపెన్ కాస్టు ప్రాజెక్టు కోసం తమ భూములు ఇస్తే నిరాశ్రయులవుతామని పేర్కొన్నారు. 30,00000 ల చొప్పున చెల్లిస్తే తాము వేరే చోట భూములు కొనుక్కుని వ్యవసాయం చేస్తామని పేర్కొన్నారు. భూములు కోల్పోయిన ప్రతి నిర్వాసితుని కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఆక్రమిత ప్రభుత్వ భూములను గిరిజనులకు పంచాలని ధర్నా

ప్రభుత్వ భూములను రక్షించాలని పేద గిరిజనులకు పంపిణీ చేయాలని 132 రోజులపాటు వివిధ గ్రామాల గిరిజనులు స్వచ్ఛందంగా దీక్షలు చేశారు. ఊరురా కదిలొచ్చి నిరసనలు తెలిపారు. గోదావరి పరీవాహక ఆక్రమిత భూముల్లో గిరిజనులు విత్తనాలు చల్లి తమ నిరసన తెలిపారు. ప్రజల న్యాయమైన డిమాండ్లు ఈనాటికి పరిష్కరించకపోగా కొందరు బడా బాబుల ఆక్రమణలోనే కొంత మేర విలువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి. భూప్రక్షాళనలో ఈ ఆక్రమణల పర్వం వెలుగులోకి వచ్చినా అధికారులు పట్టించుకో లేదు పైగా బోగస్ పట్టాదారు పుస్తకాలను సృష్టించి ఆక్రమాలకు పాల్పడ్డారు.

చట్టాన్ని పాతరేసి అక్రమ పట్టాదారు పుస్తకాలు జారీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

చేశారు. ప్రజలు భూఅక్రమాలు, లంక భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చర్లలో రాలీ దీక్షలను చేపట్టారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని లంక భూములను నిరుపేద గిరిజనులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో 1970కు ముందు సెటిల్‌మెంట్ పట్టాలు ఉంటే గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వాలే. ఈ మధ్య కాలంలో కొనుగోళ్లు జరిపిన భూములకు అధికారులు పట్టాలు జారీ చేశారని ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు రక్షణగా నిలిచిన 1/70ను రక్షించాల్సిన ఉన్నతాధికారులు ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని, షెడ్యూల్డ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## ఓపెన్ కాస్టుకు వ్యతిరేకంగా నిరసన

గోదావరి 5వ బొగ్గు గనిని ఓపెన్ కాస్టుగా మార్చే ప్రయత్నాలపై నిరసనలు తెల్పుతూ స్థానిక ప్రజలు సింగరేణి యాజమాన్యాన్ని నిలదీశారు. ఓపెన్ కాస్టు చేయడాన్ని మానుకోవాలంటూ డిమాండ్ చేస్తూ సింగరేణి యాజమాన్యం దిష్టి బొమ్మను దహనం చేశారు.

సింగరేణి యాజమాన్యం పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిని బొందల గడ్డగా మార్చడానికి, 5వ గనిని ఓపెన్ కాస్టుగా మార్చడానికి ప్రయత్నం చేస్తుండడంతో ప్రజలు ఆందోళనకు దిగారు. ఇప్పటికే ఓపెన్ కాస్టులతో గోదావరిఖనిలోని సగం భూభాగాన్ని బొందలగడ్డగా మార్చారని ఇప్పుడు 5వ గనిని ఓపెన్ కాస్టుగా చేసి గోదావరి పట్టణాన్నే పూర్తిగా లేకుండా చేయడానికి సింగరేణి యాజమాన్యం కుట్ర చేస్తుందని ఆగ్రహాన్ని వెళ్ళబుచ్చారు. ఓపన్ కాస్టుల వల్ల శబ్ధకాలుష్యం, దుమ్ము, ధూళి, విషవాయువులు, ఇళ్లు ధ్వంసం, వ్యవసాయ భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ఓపెన్ కాస్టు పనులను నిలిపివేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలి. లేకుంటే అన్ని ఓపన్ కాస్టులను అడ్డుకుంటామని ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఆశావర్కర్ల ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట జిల్లా ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. కొన్ని నెలలుగా పెండిగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవిన్యూ అధికారి, కలెక్టర్ కార్యాలయం ఏఓ తమ సమస్యలు పరిష్కరించాలని, ఆశా వర్కర్లలకు పారితోషికాలు అవసరంలేదని, ప్రతినెలా రెగ్యూలర్‌గా రూ.10వేల గౌరవ వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు ఎక్కువ చేయిస్తూ పారితోషికాల పేరిట శ్రమదోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సమయపాలన పాటించాలని అధికారులు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఎక్కువగానే చేస్తున్నామన్నారు. అధికారులు ఆశా వర్కర్లు ఏ పనులు చేయాలో ప్రత్యేక విధివిధానాలను రూపొందించి డ్యూటీ ఇస్తే అందరూ ఆనందంగా విధులు నిర్వహిస్తారన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని కొరారు. నాలుగు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అధికారులు స్పందించకుంటే జిల్లా వ్యాప్త ఆందోళలనలు చలో హైదరాబాద్ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆశాలకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఐడెంటి కార్డులు యూనిఫారాలు తదితర మౌళిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు.

## నిర్వాసితుల ఆందోళన

శ్రీరాంపూర్‌లోని నేషనల్ హైవే 363 నిర్మాణానికి ఇండ్లు కోల్పోతున్న నిర్వాసితులకు నామమాత్రపు నష్టపరిహారం ఇస్తూ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడంపై నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ 363 నిర్వాసితులు శ్రీరాంపూర్ ఆర్కే 6 కొత్తరోడ్డు ఏరియాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజీవ్ రహదారి నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్ వరకు నిర్మాంచనున్న జాతీయ రహదారి 363 రోడ్డు నిర్మాణానికి శ్రీరాంపూర్ అర్కే 6 గాంధీనగర్ కొత్తరోడ్డు ఏరియాలో 230 గృహాలను తొలగించనున్నారు. ఇండ్లు కోల్పోతే నిరాశ్రయులవుతామని తమకు వేరే ప్రదేశంలో ప్రభుత్వం తరపున స్థలాలు కేటాయించి డబుల్ బెడ్ రూం మంజూరు చేయాలని నిర్వాసితులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ఇంటి విలువకు మూడు రేట్లు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 40 యేండ్లుగా ఉపాధి కోసం వచ్చి చిరువృత్తులు చేసుకుంటూ స్థిరపడ్డ తాము తమ ఇండ్లు కోల్పోతే మరెక్కడ ఉపాధి పొందుతామని ప్రశ్నించారు. నామమాత్రపు నష్టపరిహారం ఇవ్వడం ఏమిటని నిరసన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి కోసం ఇండ్లను త్యాగం చేస్తే కనీసం మార్కెట్ విలువ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇండ్లను ప్రైవేటు ఏజెన్సీలో రీసర్వే చేయించి తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల కుటుంభాల్లో మేజర్ వయస్సు ఉన్న వారికి నష్టపరిహారం ఇప్పిసామని రెవెన్యూ అధికారులు ఒప్పుకుని ప్రస్తుతం దాటవేస్తున్నారని, సింగాపూర్ ఓపెన్ కాస్టు ప్రాజెక్టు భూ నిర్వాసితులకు చెల్లించిన విధంగా నష్టపరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు ఒప్పుకున్నారన్నారు. ఇప్పటికైనా తమ ఇండ్లకు పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలి,

మత ప్రాతిపదికన మోసపూరిత చర్యలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడుతూ, అందులో భాగంగానే పౌరసత్వ సవరణ బిల్లును తెరపైకి తెచ్చి ముస్లీమేతరులకు పౌరసత్వం ఇస్తామని మతం పేరుతో కులమత లింగ, భాషా విభేదాలను, విద్వేషాలను రెచ్చగొడుతూ పౌరసత్వ బిల్లును బీజేపీ ప్రభుత్వం తెరమీదకు తీసుకువచ్చింది. మతం పేరుతో దేశాన్ని విడగొట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుంది. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రతీ అంశంలో రాజ్యాంగ సవరణకు పూనుకుంటూ దేశ ఆర్థిక వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తూ, పౌరసత్వ సవరణ బిల్లుపై బీజేపీ దేశమంతటా తప్పుడు ప్రచారం

చేస్తూ అవస్తవాలను చెబుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నది. పౌరసత్వ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల నాయకత్వంలో భారీ ర్యాలి నిర్వహించారు.

## విద్యార్థుల ధర్నా

ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విదార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల అలసత్వం, గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల పాఠశాలల్లో మరుగుదొడ్లు పూర్తికాకపోవడంతో విదార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, మెనూ పాటించడం లేదని, వసతి గృహ మరమ్మత్తులపై ప్రభుత్వం జాప్యం చేస్తుందని, ఇన్‌చార్జ్ వార్డెన్ కూడా పూర్తిస్థాయిలో బాధ్యతలు నెరవేర్చడం లేదని త్రాగునీటి సౌకర్యం మరియు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ పరిష్కారం అయ్యేంత వరకు ఆందోళనలు వీడేది లేదన్నారు. విద్యార్థులు వసతి గృహం ఎదుట సుమారు 3 గంటల పాటు ధర్నా చేశారు.

### మద్యంపై ఉద్యమించిన మహిళలు

గ్రామాలల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్ట్ షాపులపై మహిళలు నడుంబిగించారు. గ్రామాలల్లో మద్యం మహమ్మారితో అనేక కుటుంబాలు గొడవలు పడుతున్నాయి. ఆర్థికంగా కూడా నష్టపోతున్నాయి. మహిళలు మద్యం అమ్మకాలపై మండిపడుతూ మద్యాన్ని వ్యతిరేకిస్తూ ప్రస్తుతం వున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని విరుచుకు పడ్డారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బెల్ట్ దుకాణాలపై దాడులు చేశారు. బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేసే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## పోరాడి జీతాలు పెంచుకున్న రైల్వే కార్మికులు

తెలంగాణలో గత కొన్ని సంవత్సరాలుగా రైల్వే స్టేషన్లలో పని చేస్తున్న కార్మికులు కనీస సౌకర్యాలు కల్పించకుండా లేబర్ కమీషన్‌లో పేర్కొన్న హక్కులు సైతం కాలరాచీ వేస్తూ అసంఘటిత కార్మికులైన రైల్వే కార్మికులను వెట్టి చాకిరీ చేయిస్తున్న కాంట్రాక్టర్లకు వ్యతిరేకంగా పోరాడి వరంగల్ రైల్వే కార్మికులు 100 మంది, కాజీపేట కార్మికులు 200 మంది 12000 రూ॥ వేతనాలను సాధించుకున్నారు. అలాగే మహబూబాబాద్, దోర్నకల్, ఖమ్మం, జనగామ, జమ్మికుంట, రామగుండం, మంచిర్యాల రైల్వే కార్మికులు 500 మంది పోరాడి 9000 జీతంతో పాటు పీఎఫ్ ఈఎస్ఐ కార్డ్ సాధించుకున్నారు.

## ఫారెస్టు వాళ్ళను తరిమి కొట్టిన గ్రామ ప్రజలు

వెంకటాపూర్ మండలం లక్ష్మీపూర్, తిప్పాపూర్ గ్రామ ప్రజలు సాగు చేసుకుంటున్న భూములను ఫారెస్టు అధికారులు పొక్లైన్లతో, బుల్డోజర్లతో ధ్వంసం చేసి ప్రజలను ఇక్కడి నుండి వెళ్ళిపోవాలని ప్రజలపై దాడులు చేస్తే ప్రజలు తిరగబడి ఫారెస్టు అధికార్లను తరిమికొట్టి పొక్లైన్లను తగలబెట్టి వారి భూములను స్వాధీనం చేసుకుని పంటలు వేశారు.

## అడవి గ్రామాలలో పోలీసుల దాడులు

వెంకటాపూర్ ఏరియాలోని అడవి గ్రామాలలో దూలపురం, కొంగాల్, కారంగుప్ప, బొల్లారం, మురుమూర్, లక్ష్మిపురంలలో సాయుధ పోలీసులు మూకుమ్మడిగా దాడులు చేసి మావోయిస్టులకు సహకరిస్తున్నారనే పేరుతో ఇండ్లలోకి చొరబడి వస్తువులని చిందరవందరం చేస్తుంటే ప్రజలంతా తిరగబడి పోలీసుల దుశ్చర్యలను నిలదీయడంతో వెనుదిరిగి వెళ్ళిపోయారు.

★ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడండి !

★ కశ్మీర్ స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరించేంత వరకు పోరాడండి !

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న "సమాధాన్"ని ప్రతిఘటించండి !

మనం ప్రజలకు సేవ చేస్తున్నాం కాబట్టి మన లోపాలను ఎత్తి చూపినా విమర్శించినా మనం భయపడం. మన లోపాలను ఎవరైన ఎత్తి చూపవచ్చు. అది సరైన విమర్శ అయితే మనం తప్పుల్ని దిద్దుకుంటాం. వారు ప్రతిపాదించాలి. ప్రజలకు మేలు చేస్తే మనం అందుకు అనుగుణంగా చర్య తీసుకుంటాం.

కా॥ మావో

# గుండెపోటు - సంకేతాలు

**డా॥ రమేశ్ గూడపాటి కార్డియాలజిస్టు**



గుండెపోటు తీవ్రమైన సమస్య. చెట్టంత మనిషిని ఉన్నట్టుండి నిట్టనిలువుగా కూల్చేసే సమస్య. అత్యవసరంగా స్పందించకపోతే, సరైన చికిత్స అందకపోతే ప్రాణాంతకంగా పరిణమించే సమస్య కొన్నిసార్లు గుండెపోటు హఠాత్తుగా ముందస్తూ లక్షణాలేవి లేకుండా ముంచుకురావొచ్చు. కొందరికి కొద్ది రోజుల ముందు నుంచే కొన్ని హెచ్చరిక సంకేతాలు కనిపించొచ్చు. అయినా వాటిని గుండెజబ్బుకు సంబంధిచినవని చాలా మంది గుర్తించలేకపోవచ్చు. దీనికి ప్రధాన కారణం లక్షణాలు అంత స్పష్టంగా లేకపోవటం, వాటిపై సరైన అవగాహన లేకపోవటం. గుండెపోటుకు మూలం గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో పూడికలు తలెత్తటం. ఈ పూడికల మీద హఠాత్తుగా రక్తం గడ్డకట్టి రక్తనాళం పూర్తిగా మూసుకుపోతుంటుంది. దీంతో గుండె కండరానికి రక్త సరఫరా నిలిచిపోయి గుండెపోటుకు దారితీస్తుంది. కొందరికి పూడికలు స్వల్పంగా (70% కన్నా తక్కువ) ఉన్నా హఠాత్తుగా వాటి మీద కర్తం గడ్డ కట్టి గుండెపోటు రావొచ్చు. ఇలాంటివారిలో ముందుగా ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే ఉన్నట్టుండి గుండెపోటు వస్తుంటుంది. అయితే చాలామందిలో పూడికలు ముందు నుంచే తీవ్రంగా.. అంటే 70% కన్నా ఎక్కువగా ఉంటుంటాయి. ఇవి ఏ క్షణంలోనైనా గుండెపోటుకు దారితీయొచ్చు. కాస్త మంచి విషయం ఏంటంటే- వీరిలో కొందరికి ముందు నుంచే కొన్ని హెచ్చరిక సంకేతాలు, లక్షణాలు కనిపిస్తుండటం వీటిని గుర్తించటం ముఖ్యం. తగు జాగ్రత్తలు తీసుకుంటే ఇవి ప్రమాదకరంగా పరిణమించకుండా కాపాడుకోవచ్చు.

**తాత్సారం చేయొద్దు**

గుండెపోటు తీవ్రమైన సమస్య అందువల్ల అంతకుముందు లేకుండా కొత్తగా ఏవైనా ఇబ్బందికర లక్షణాలు కనిపిస్తే తాత్సారం పనికిరాదు. వయసు మీద పడటం వల్ల, ఎక్కువ పనిచేయటం వల్ల ఆయాసం వచ్చిందనో.. తిన్నది సరిగా అరగకపోవటం వల్ల కడుపు ఉబ్బిందనో.. రాత్రి ఒక పక్కకు తిరిగి పడుకోవటం వల్ల మెడనొప్పి వచ్చిందనో.. పంటిలో ఏదో ఇరుక్కొని దవడ నొప్పి వచ్చిందనో.. మనకు మనమే సమాధాన పడటం తప్పు. అసలు కారణమేంటన్నది నిర్ధారించుకోవటం మంచిది. ముఖ్యంగా 40 ఏళ్లు దాటిన తర్వాత నిర్లక్ష్యం అసలే పనికిరాదు. ఇలాంటి లక్షణాలు చాలావరకు మామూలువే అయ్యుండొచ్చు. అంతమాత్రాన గుండె సమస్యకు సంబంధించినవి కాదని కచ్చితంగా తీసిపారేయలేం. ఒకవేళ గుండెపోటుతో ముడిపడిన లక్షణాలైతే ముందుగానే జాగ్రత్త పడటానికి వీలుంటుంది.

గుండెపోటును అనుమానించినప్పుడు ఈసీజీ, ఎకో పరీక్షలు.. అలాగే ట్రోపోనిన్ రక్త పరీక్ష చేయాల్సి ఉంటుంది. వీటితోనే సమస్య చాలావరకు బయటపడుతుంది. సమస్యను నిర్ధారించటానికి, చికిత్స పద్ధతులను ఖరారు చేయటానికి యాంజియోగ్రామ్ పరీక్ష చేస్తారు. ఇందులో పూడికలు ఎక్కడ, ఎలా, ఎంత తీవ్రంగా ఉన్నాయనేది తెలుస్తుంది.

**పెద్ద ప్రమాదాన్ని తప్పించుకోవచ్చు**

గుండెపోటు రాకముందే సమస్యను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదకరంగా మారకుండా చూసుకోవచ్చు. పూడికలు చిన్న, ఉప రక్తనాళాల్లో ఉన్నా.. స్వల్పంగా ఉన్నా మందులతోనే మంచి ఫలితం కనిపిస్తుంది. రక్తాన్ని పలుచగా చేసే ఆస్ప్రిన్, క్లోపోడోగ్రిల్.. కొవ్వును తగ్గించే స్టాటిన్స్ మేలు చేస్తాయి. ఉపరక్తనాళాల్లో పూడిక తీవ్రంగా ఉంటే నైట్రైట్లు, బీటా బ్లాకర్లు ఇస్తారు. దీంతో లక్షణాలు తగ్గుముఖం పడతాయి. ప్రధాన రక్తనాళాల్లో పూడికలు తీవ్రంగా ఉంటే స్టెంట్ అమరుస్తారు. అవసరమైతే బైపాస్ చేస్తారు. పూడికల సంఖ్య, పొడవు, గట్టిదనం, అవి ఉన్నచోటును బట్టి స్టెంట్ అమర్చాలా? సర్జరీ చేయాలా? అన్నది నిర్ణయిస్తారు.

**ఆయాసం**

మనం విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు గుండెకు అంత రక్త సరఫరా అవసరముండదు. అదే వేగంగా నడవటం, మెట్లు ఎక్కటం, బరువులు మోయటం వంటి కష్టమైన పనులు చేస్తున్నప్పుడు ఎక్కువ రక్తం కావాలి. విశ్రాంతి తీసుకునే సమయంతో పోలిస్తే తీవ్రమైన శారీరక శ్రమ చేసినప్పుడు గుండెకు సుమారు 5 రెట్లు ఎక్కువ రక్తం కావాలి. ఎవరికైనా రక్తనాళంలో పూడిక ఉందనుకోండి. వేగంగా నడవటం, పరుగెత్తటం వంటివి చేసినప్పుడు గుండెకు అవసరమైనంత రక్తం అందదు. దీంతో గుండె సామర్థ్యం తగ్గుతుంది. గుండె కండరం మృదుత్వాన్ని కోల్పోవచ్చు. గుండెలో ఒత్తిడి పెరిగినప్పుడు ఊపిరితిత్తుల్లో నీరు చేరుతుంది. ఇది ఆయాసం, శ్వాస సరిగా తీసుకోలేకపోవటం వంటి లక్షణాలకు దారితీస్తుంది. అందువల్ల పనులు చేస్తున్నప్పుడు

ఇలాంటివి కనిపిస్తుంటే గుండె సమస్య ఉండొచ్చని అనుమానించాలి.

**ఛాతీ నొప్పి**

తగినంత రక్తం అందనప్పుడు గుండె కండర కణాలకు ఆక్సిజన్, ఇతర పోషకాల సరఫరా తగ్గుతుంది. దీని ఫలితంగా గుండె కండరంలో ఉత్పత్తయ్యే కొన్ని రసాయనాలు నొప్పికి దారితీస్తాయి. కొందరికి నొప్పి తీవ్రంగా ఉండొచ్చు. కొందరికి స్వల్పంగా.. వస్తూ పోతూ ఉండొచ్చు. కొందరికి ఛాతీ బరువుగా అనిపించటం, మంట, ఏదో లాగుతున్నట్టు ఉండటం వంటివీ కనిపిస్తుంటాయి వీటిని కొందరు అజీర్ణంతో తలెత్తే ఛాతీ మంటగానూ పొరపడుతుంటారు. ఛాతీ నొప్పిని.. ముఖ్యంగా పనులు చేస్తున్నప్పుడు వచ్చే నొప్పిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. గుండెజబ్బుకు ప్రధానమైన తొలి సంకేతం ఇదే. కాకపోతే ఆడవారిలో 30% మందిలోనే ఛాతీ నొప్పి కనిపిస్తుంటుంది.

**నీరసం, నిస్సత్తువ**

గుండెకు తగినంత రక్తం అందనప్పుడు ఏ పనీ సరిగా చేయటం సాధ్యం కాదు. చాలా మంది దీన్ని నీరసం, నిస్సత్తువ, బలహీనతగా భావిస్తుంటారు. ఇది వయసుతో పాటు వచ్చే బలహీనతనే అనుకుంటుంటారు. అందుకే ఈ మధ్య వ్యాయామం చేస్తే బాగా నీరసం వచ్చేస్తోందని, కాస్త నడవగానే బలహీనపడిపోతున్నానని చెబుతుంటారు. ఇటీవల అంతగా నడవటం లేదు కదా. అలవాటు తప్పి ఉండొచ్చు, ఆయాసం వస్తుండొచ్చని అనుకుంటుంటారు. కొందరు చేసే పనుల వేగాన్ని తగ్గించుకుంటారు. నెమ్మదిగా నడవటం వంటివి చేస్తుంటారు. ఇలా అలసట, ఆయాసం రాకుండా తమకు తామే పనులను నియంత్రించుకుంటారు. మొదట్లో కాస్త కష్టమైన పనులు చేసినప్పుడు వచ్చే నీరసం క్రమంగా చిన్నపాటి పనులకూ, చివరికి విశ్రాంతి తీసుకుంటున్నప్పుడూ రావటం మొదలవుతుంది. ఇవి అలాగే కొనసాగుతూ గుండెపోటుకు దారితీయొచ్చు.

**కడుపు నొప్పి**

గుండెకు వెళ్లే నాడులు, కడుపు భాగానికి వెళ్లే నాడులు కొన్నిచోట్ల ఒకదాని మీది నుంచి మరోటి అంటుకొని వెళ్తుంటాయి. అందువల్ల గుండెపోటుతో ముడిపడిన లక్షణాలు కొన్నిసార్లు కడుపు నొప్పిగానూ కనిపించొచ్చు. అన్నవాహికకు వెళ్లే నాడులు ప్రభావితం కావటం వల్ల కడుపుబ్బరం, వికారం వంటివీ ఉండొచ్చు. దీన్ని అజీర్ణ సమస్యగానూ చాలా మంది పొరపడుతుంటారు. కొందరికి గుండె నొప్పి పిత్తాశయంలో రాళ్లతో వచ్చే నొప్పి మాదిరిగానూ ఉండొచ్చు. ఇదీ పొరపడేలా చేస్తుంది.

**దవడ, చేయి, మెడ నొప్పులు**

గుండె నొప్పి కింది దవడ నుంచి బొడ్డు వరకు ఎక్కడైనా రావొచ్చు. అందుకే కొందరికిది దవడ, మెడ, చెయ్యి నొప్పి రూపంలోనూ బయటపడొచ్చు. ఈ భాగాలకు వెళ్లే నాడులు, గుండెకు వెళ్లే నాడులు కొన్నిచోట్ల ఒకదాని మీది నుంచి మరోటి దాటుకొని వెళ్తుండటమే దీనికి కారణం కొందరు కొద్దిగా నడవగానే కింది దవడ నొప్పి పుట్టిందనీ చెబుతుంటారు. దీన్ని పళ్ల సమస్యగా భావించి దంత వైద్యులనూ సంప్రదిస్తుంటారు. కొందరికి చేతుల్లో.. ముఖ్యంగా ఎడమ చెయ్యి నొప్పి వస్తుంటుంది. ఈ నొప్పి భుజం దగ్గర్నుంచి కిందికి పాకుతూ.. లాగుతున్నట్టు అనిపిస్తుంటుంది. కొన్నిసార్లు ఇది మెడనొప్పి మాదిరిగానూ కనిపించొచ్చు. అంతకుముందు నుంచే మెడనొప్పితో బాధపడేవారు దీన్ని పోల్చుకోవటం కష్టం. చాలా ఏళ్లుగా మెడనొప్పి ఉంది కదా. ఇప్పుడు కాస్త పెరిగి ఉండొచ్చని అనుకుంటుటారు.

**గుండె దడ**

మన గుండె కొట్టుకోవటాన్ని స్వయంచాలిత నాడీ వ్యవస్థ నియంత్రిస్తుంటుంది. ఇందులో సింపథిటిక్, పారాసింపథిటిక్ అని రెండు రకాలున్నాయి. సింపథిటిక్ నాడీ వ్యవస్థ ప్రేరేపితమైనప్పుడు గుండె వేగంగా కొట్టుకుంటుంది. దీంతో గుండె దడ, చెమట్లు పట్టటం వంటి లక్షణాలు బయలుదేరతాయి. పారాసింపథిటిక్ వ్యవస్థ ప్రేరేపితమైతే గుండె వేగం బాగా తగ్గిపోయి కళ్లు తిరగటం, బైర్లు కమ్మటం, తల తేలిపోయినట్టు అనిపించటం, వికారంగా ఉండటం వాంతులు కావటం వంటివీ ఉండొచ్చు.

---

**ప్రతి వ్యక్తి ఎప్పుడో ఒకనాడు మరణించక తప్పదు. కాని ఒకరి చావుకూ మరొకరి చావుకూ తేడా ఉంటుంది. దాని ప్రాముఖ్యత కూడా వేరు విధంగానే ఉంటుంది. పురాతన చైనా గ్రంథకర్త జుమాచిన్ ఇలా అన్నాడు. నీమరణం అందరికీ సమానమే. కాని కొందరి మృత్యువు థాయ్ పర్వతం కంటే బరువుగానూ, మరికొందరి మృత్యువు ఈక కంటే తేలికగానూ ఉంటుంది. ప్రజల కోసం మరణించడం థాయ్ పర్వతం కంటే బరువైనది. కాని ఫాసిస్టుల కోసం పనిచేయడం, దోపిడిగాళ్లు, ప్రజలనణిచే వారి తరపున చావడం కాకి ఈక కంటే తేలికైనది.**

**మావో (ప్రజలకు సేవ చేయండి. మావో రచనలు సంపుటి నుండి)**

క్రూరమైన భూస్వాములను అంతమొందించడంలో, శత్రు కిరాయి పోలీసు బలగాల దాడులను తిప్పికొట్టడంలో ధైర్యంగా నాయకత్వం వహించిన వీర కమ్యూనిస్టు గెరిల్లా కమాండర్ కామ్రేడ్ రామన్న. 1993లో ఆయనకు సహచర మహిళా కామ్రేడ్‌తో వివాహం జరిగింది. వారికి ఒక కొడుకు ఉన్నాడు.

1993లో డివిజన్ కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయి అక్కడి తొలి మిలటరీ దళానికి (ఎంఎస్)కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించాడు. 1995 మార్చిలో ఉద్యమావసరాలను దృష్టిలో పెట్టుకుని ఉత్తర బస్తర్ డివిజన్‌కు బదిలీ అయి కేశ్‌కల్, కొండగావ్, కోయిలీబేడ, మాడ్ ప్రాంతాలలో నరేందర్ పేరుతో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించాడు. శత్రు దాడులను తిప్పికొడుతూ అక్కడి ఉద్యమాన్ని పురోగమింపజేసాడు. 1998 సెప్టెంబర్‌లో తిరిగి దక్షిణ బస్తర్ డివిజన్‌కి బదిలీ అయ్యాడు. 2000 సెప్టెంబర్‌లో ఆ డివిజన్ 3వ మహాసభలో దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ డివిజన్లు ఏర్పడడం, ఆయన దక్షిణ బస్తర్ డివిజన్ కార్యదర్శిగా ఎంపిక కావడం జరిగింది. 2000 డిసెంబర్‌లో దండకారణ్య స్పెషల్ జోన్ పార్టీ 3వ మహాసభలో కామ్రేడ్ రామన్న ఎస్‌జడ్‌సీ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. 2003 మార్చిలో డీకే ఎస్‌జడ్‌సీ సెక్రటేరియట్ సభ్యుడిగా, స్టేట్ మిలటరీ కమిషన్ (ఎంఎస్‌సీ) సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించాడు. 2005లో కంపెనీ-2 పార్టీ కమిటీ (సీవైపీసీ) కార్యదర్శి బాధ్యతలు సైతం చేపట్టాడు. 2006లో డీకే స్పెషల్ జోన్ పార్టీ 4వ మహాసభలో కమిటీ సభ్యుడిగా తిరిగి ఎన్నికై సెక్రటేరియట్ సభ్యుడిగా కొనసాగాడు. 2007 డిసెంబర్‌లో దక్షిణ సబ్‌జోనల్ బ్యూరో కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. 2009 ఆగస్టులో డీకేలో ఏర్పడిన పీఎల్‌జీఏ మొదటి బెటాలియన్ పార్టీ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి అనేక మిలటరీ చర్యలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించాడు. ఈ క్రమంలో జన్‌జాగరణ్ అభియాన్ (1990), సల్వాజుడుం (2005-2009) దాడులను ప్రతిఘటించి ఓడించడంలో, ఆపరేషన్ గ్రీన్ హంట్ (2009-2017)లను తిప్పికొట్టడంలో కామ్రేడ్ రామన్న ముఖ్య పాత్ర పోషించాడు. 2011 అక్టోబర్‌లో డీకే స్పెషల్ జోన్ 4వ మహాసభ ఆయన మొదటి ప్లీనంలో ఎస్‌జడ్‌సీ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. జోన్ క్రాంతికారీ జనతన సర్కార్ సమన్వయ కమిటీ అధ్యక్షుడి బాధ్యతలు కూడా చేపట్టాడు. 2013 మార్చిలో పార్టీ కేంద్రకమిటీలోకి కో-ఆప్ట్ అయినప్పటి నుండి దేశవ్యాప్త విప్లవోద్యమానికి నాయకత్వం అందించడంలో భాగస్వామి అయ్యాడు. గత 20 సంవత్సరాలుగా తీవ్ర అనారోగ్యం(డయాబెటిస్)తో పోరాడుతూ ప్రజల కోసం తన జీవితాన్ని నిస్వార్థంగా త్యాగం చేస్తూ 2019 డిసెంబర్ 7న పార్టీ కేడర్ల, పీఎల్‌జీఏ యోధుల, ప్రజల మధ్యన తుదిశ్వాస విడిచాడు. శత్రువు నిత్యావసర వస్తువులను, మందులను తెచ్చుకోకుండా జబ్బుపడిన-గాయపడిన పార్టీ, పీఎల్‌జీఏ బలగాలకు వైద్య సదుపాయాలు లభించకుండా తీవ్ర అడ్డంకులు కల్పిస్తున్నాడు. ఈ విధంగా యుద్ధగ్రస్త ప్రాంతాలలో శత్రువు అంతర్జాతీయంగా ఆమోదించిన చట్టాన్ని సైతం ఉల్లంఘిస్తున్నాడు. అందువల్ల వైద్య సదుపాయం లభించక మరణించడం అంటే రాజ్యం చేత హత్యకు గురికావడమే.

కామ్రేడ్ రామన్న 1983లో దండకారణ్యంలో అడుగు పెట్టింది మొదలు తుదిశ్వాస వరకూ భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని జయప్రదం చేసే లక్ష్యంలో భాగంగా దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మలిచే పార్టీ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో అలుపెరుగని విప్లవ నాయకుడిగా, యోధుడిగా కృషి చేసాడు. బస్తర్ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అర్థం చేసుకునేందుకు సామాజిక పరిశోధన చేసి నిర్దిష్టంగా ఆదివాసీ సమాజంలో వర్గ పొందికను అర్థం చేసుకుని వర్గ శత్రువులను గుర్తించి, సాయుధంగా పోరాడితేనే ప్రజలకు అధికారం లభిస్తుందనే విప్లవ రాజకీయాలను మొదటి నుండి బోధిస్తూ భూస్వామ్య వ్యతిరేక వర్గ పోరాటాలలో ప్రజలను సంఘటితం చేయడంలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలలో, రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజలను పెద్దెత్తున కదిలించి ప్రజా ఉద్యమాలను, ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన సృజనాత్మకతను ప్రదర్శించాడు. బస్తర్ ప్రాంతంలో పోరాటాలలో కదిలే ప్రజలను తొలి నుండి మిలీషియాలో అంటే గ్రామ రక్షణ దళాలతో (జిఆర్‌డీ) మొదలుకొని భూంకాల్ మిలీషియా, మిలీషియా ప్లాటూన్లు, మిలీషియా కంపెనీలలో సంఘటితం-సాయుధం చేస్తూ వర్గకసితో మిలిటెంట్ ప్రజా ప్రతిఘటనా పోరాటాలను అభివృద్ధి చేసాడు. మహిళలను పితృస్వామ్య వ్యతిరేక, రాజ్యహింస వ్యతిరేక వర్గ పోరాటాలలో మహిళలను పెద్దెత్తున కదిలించడంలో, వివిధ నిర్మాణాలలో సంఘటితం చేయడంలో మార్గదర్శకత్వం వహించాడు. గెరిల్లా జీవితంలోని అనేక కష్టాలను, ఒడిదుడుకులను దృఢంగా ఎదుర్కొన్నాడు. పార్టీ పంథాపై, ప్రజలపై అపార విశ్వాసంతో గ్రామ స్థాయి నుండి ప్రజలను సమీకరించి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో వర్గ పోరాటాన్ని కొనసాగిస్తూ వారితో ప్రజాసంఘాలు, మిలీషియా, పార్టీ సెల్స్, గ్రామ పార్టీ కమిటీలు, బ్రాంచీలు నిర్మాణం చేయడంలో, ప్రజా రాజ్యాధికార అంగాలుగా తొలుత గ్రామ రాజ్య కమిటీలు, ఆ తర్వాత పంచాయితీ, ఏరియా, డివిజన్ స్థాయి క్రాంతికారీ జనతన సర్కార్లను (విప్లవ ప్రజా కమిటీలు), దండకారణ్య క్రాంతికారీ జనతన సర్కార్ సమన్వయ కమిటీని ఏర్పరచడంలో ముఖ్య పాత్ర వహించాడు. లక్షలాది ప్రజలను విస్థాపితులను గావించే బైలడిల్లా, నంద్‌రాజ్ పహాడ్, రావుఘాట్, హాహ్లాది, కువ్వెమారి, సూర్జాగఢ్ వంటి గనుల తవ్వకాన్ని, లోహండిగూడా, ధుర్లి వంటి స్టీల్ ప్లాంట్లు, బోధ్‌ఘాట్ డ్యాం మొదలైన వాటితో కూడిన సామ్రాజ్యవాద ప్రాయోజిత కార్పొరేట్ బూటకపు అభివృద్ధి మోడల్‌ను, పాలకవర్గాలకు బహిర్గతం చేస్తూ వాటికి వ్యతిరేకంగా దండకారణ్య ఆదివాసీ ప్రజలను కూడగడుతూ మిలిటెంట్ పోరాటాలకు నాయకత్వం అందించాడు. ప్రజా నిర్మాణాలలో

**(మిగతా 15వ పేజీలో)......**



కా॥ విజయ్ కుమార్ (ఆర్ఓసీ) (70సం॥ రాలు) అనారోగ్యంతో చనిపోయాడు.



చర్ల ప్రతినిధి కే. చంద్రన్న (75 సం॥రాలు) (జనశక్తి) అనారోగ్యంతో చనిపోయాడు.




జేఎన్‌యూ అధ్యక్షురాలు



డా.కాశీంను అరెస్ట్ చేసి తీసుకెళుతున్న ములుగు పోలీసులు ★ పోలీసులు ఇచ్చిన పత్రంతో డా.కాశీం భార్య స్నేహలత



తాడ్వాయి అడవుల్లో పోలీసుల గాలింపు



గాయపడిన జేఎన్‌యూఎస్‌యూ అధ్యక్షురాలు ఘోష్ హాస్టల్‌లో విధ్వంసం



పర్యావరణాన్ని కాపాడాలంటూ ప్రసంగిస్తున్న గ్రేటా




సేవగని ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, స్థానికులు



అమరావతి రాజధాని కోసం ర్యాలీ




అత్యాచారాలకు వ్యతిరేకంగా ర్యాలీ



[illegible]



పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

# సీపీఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడు, డీకే ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి, పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు

# కామ్రేడ్ రామన్న (రావుల శ్రీనివాస్)కు విప్లవ జోహార్లు అర్పిద్దాం!

# అమరుల కలల్ని నిజం చేసేందుకు తుదిశ్వాస వరకు పోరాడుదాం!

కామ్రేడ్ రావుల శ్రీనివాస్ (రామన్న, నరేందర్) తన 55వ ఏట డిసెంబర్ 7న రాత్రి 10 గంటలకు తీవ్ర అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. ఆయన 2011 అక్టోబర్ నుండి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకే ఎస్‌జడ్‌సీ) కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. 2013 మార్చిలో కేంద్రకమిటీ సభ్యుడిగా కో-ఆప్ట్ అయ్యాడు. ఆయన 36 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితం దండకారణ్య ఉద్యమంలోని అభివృద్ధితో ప్రతి మలుపు పెనవేసుకొనిపోయింది. ఆయన ప్రజలలో, కేడర్లలో రామన్నగా, నరేందర్‌గా అపార అభిమానాన్ని, గౌరవాన్ని చూరగొన్న ప్రియతమ విప్లవ నాయకుడు, యోధుడు. కామ్రేడ్ రావుల శ్రీనివాస్ దేశ విప్లవోద్యమానికి,



ప్రత్యేకించి దండకారణ్య పీడిత ప్రజలకు అందించిన అత్యున్నతమైన సేవలను, ఆయన అమరత్వాన్ని స్మరిస్తూ మన పార్టీ కేంద్రకమిటీ వినమ్రంగా తలవంచి విప్లవ జోహార్లు అర్పిస్తోంది, ఆయన కలల్ని సాకారం చేసేందుకు ముందుకు పురోగమిస్తానని శపథం చేస్తోంది. ఆయన కుటుంబం, స్నేహితుల, సహచర కామ్రేడ్ల, పీడిత ప్రజల విషాదంలో పాలుపంచుకుంటోంది. భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారా వేలాది అమరులు కన్నకలల్ని సాకారం చేయాల్సిందిగా పార్టీ శ్రేణులన్నింటికీ, భారత పీడిత ప్రజలకు కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

కామ్రేడ్ రామన్న తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా చేర్యాల మండలంలోని బైరాన్‌పల్లి గ్రామ పంచాయితీలోని బెక్కల్ గ్రామంలో తల్లి వరమ్మ, తండ్రి రామలింగంల ఆరవ సంతానంగా 1965 జులైలో జన్మించాడు. అది ఒక దిగువ మధ్యతరగతి రైతు కుటుంబం. తల్లిదండ్రులు ఆయనకు శ్రీనివాస్ అని పేరు పెట్టారు. నైజాం పాలనలో రజాకార్లతో, ఆ తర్వాత నెహ్రూ-పటేల్ కిరాయి సైన్యంతో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన తెలంగాణ వీర రైతాంగం హోరాహోరీగా సాయుధంగా పోరాడిన గొప్ప విప్లవ సాంప్రదాయం గల ప్రాంతంగా జనగామ ప్రాంతం తెలంగాణాలో ప్రసిద్ధి చెందింది. ఆ గడ్డలో గొప్ప ధైర్యసాహసాలతో పోరాడుతూ వందలాది వీరులు నేలకొరిగారు. ఈ వీరోచిత పోరులో శ్రీనివాస్ తాతలు, తండ్రులు సైతం భాగస్వాములే. ఆ విప్లవ గడ్డన పుట్టిన శ్రీనివాస్ సమీపంలోని దూల్‌మెట్ట హైస్కూల్‌లో చదువుతూ విప్లవ విద్యార్థి రాజకీయాలను పరిచయం చేసుకున్నాడు. విప్లవాల గడ్డలో పుట్టడం, తనది విప్లవ వారసత్వం వున్న కుటుంబం కావడం ఇందుకు ఆయనకు ఎంతగానో తోడ్పడింది. 1981-82లో రాడికల్ విదార్థి సంఘం(ఆర్ఎస్‌యు)లో చేరాడు. స్కూల్ ఆర్ఎస్‌యు యూనిట్ కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తూ పలు విద్యార్థి పోరాటాలలో భాగస్వామి అయ్యాడు. 1982, 83 సంవత్సరాల్లో 'విద్యార్థి-యువజనులారా! గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో తన విప్లవ చైతన్యాన్ని పెంచుకున్నాడు. 1983 ఏప్రిల్‌లో పార్టీ సభ్యత్వాన్ని పొందిన వెంటనే ఉద్యమ అవసరాలను ఆయనకు అర్థం చేయించి పార్టీ వరంగల్ జిల్లా కమిటీ ఆయనను పూర్తికాలం కార్యకర్తగా దండకారణ్య ప్రాంతానికి పంపింది.

ఆయన రామన్న పేరుతో 1983 జూన్‌లో దండకారణ్యంలోని భద్రాచలం గెరిల్లా దళ సభ్యుడిగా గెరిల్లా జీవితం ఆరంభించాడు. డిసెంబర్‌లో భద్రాచలం నుండి కుంట దళసభ్యుడిగా బదిలీ అయ్యాడు. 1985లో దళం డిప్యూటీగా, ఆ తర్వాత 1987లో ఆ దళ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. 1992లో కుంట దళం ఏరియా కమిటీ (ఎస్ఎసి) కార్యదర్శిగా ఎదిగి బస్తర్ ప్రాంతంలోని కుంట, సుక్మ, గొల్లపల్లి, దోర్నపాల్, కిష్టారం ప్రాంతాలలో ఆదివాసీ ప్రజలను సంఘటితం చేస్తూ ఫారెస్టు, రెవెన్యూ అధికారుల దోపిడీ, పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా అనేక రాజకీయ-ఆర్థిక ప్రజా పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించాడు. భూపోరాటాలు నిర్వహించడంలో ముందున్నాడు. కల్మ దేవాల్, బురద వడ్డె లాంటి